మమత-సమత-మానవత
www.gurajada.org

# ప్రకాశిక

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org


సంపుటి 1 | సంచిక 2 జనవరి-మార్చి, 2021

## సంక్రాంతి శుభాకాంక్షలు



మమత-సమత-మానవత
www.gurajada.org

# ఆధునిక తెలుగుకు ఆద్యుడు



కీ.శే. గురజాడ వేంకట అప్పారావు

editor@prakasika.org

# ప్రకాశిక – ఒక పరిచయం

ఆధునిక కవితకు అడుగుజాడ అయిన మహాకవి శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు తలపెట్టిన పత్రిక **'ప్రకాశిక'**. ఆ పత్రికని పునరుద్ధరించి ఆయన స్మృతికి ఘన నివాళి ఇవ్వాలనే ఉద్దేశంతో **'ప్రకాశిక'** ప్రచురణకి గురజాడ ఫౌండేషన్ (అమెరికా) పూనుకుంది. యావత్ తెలుగు జాతికి అలనాటి భాష, సంస్కృతి, సంప్రదాయం, వ్యావహారికాలను, సమకాలీన సాహితీ ప్రక్రియలను మళ్లీ పరిచయం చేస్తూ, నేటి సమాజపు స్థితిగతులకు అద్దంపట్టే ఒక వేదికగా ప్రకాశిక రూపుదిద్దుకుంటోంది. దీనిని తెలుగు అంతర్జాల త్రైమాస పత్రికగా వెలువరిస్తున్నాం.

గురజాడ కలం నుండి జాలువారిన అక్షర మాలికలు ఎన్నో. గురజాడ వేంకట అప్పారావు గారికి 'మహాకవి శ్రీ గురజాడ అప్పారావు'గా గుర్తింపు తెచ్చిన ఆయన రచనలు ఆణిముత్యాలు, సరస సరాగాలు, ముత్యాల సరాలు. పరిసరాలని పరిశీలిస్తూ, ప్రభావితమవుతూ, మంచి అన్నది పెంచమంటూ, భాష భావ వ్యక్తీకరణకు సాధనమే కానీ పదడాంబిక ప్రదర్శనకు సూచిక కాదని నమ్మి, తెలుగు భాషని తేటగా, తీయగా, సరళంగా, సరసంగా పండిత పామరులకు చేరువ చేయడంలో ఆయన సలిపిన కృషి అజరామరం, చిరస్మరణీయం.

సాంఘిక దురాచారాలని వ్యావహారిక భాషలో ఎత్తి చూపి, వ్యంగ్యాయుధంతో వాటిని కూకటివేళ్లతో సహా పెకిలించిన అరుదైన భాషావేత్త, సంఘ సంస్కర్త, మహాకవి, గురజాడ వేంకట అప్పారావుగారు. అక్షరాయుధంతో మరెన్నో సాధించాలనుకున్నారో ఏమో, **'ప్రకాశిక'** పత్రికను ఆయన స్థాపించారు. అయితే, ఆ పత్రిక ఎంతోకాలం సాగిన దాఖలాలు లేవు. తొలి రాత ప్రతి దొంగిలించబడిందని ఆయన వంశీకుల ఆవేదన. ప్రకాశిక పత్రిక పరహస్తగతమైనా, అందులోని భావతరంగాలు శతాబ్దానికి పైగా ఎన్నో తరాలను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయి.

ఆ మహాకవి కాలంలో ఉన్న దురాచారాలు, మూఢ నమ్మకాలు ఈ కాలంలో కూడా ఆధునిక పరిజ్ఞానంతోపాటు, ఏదో ఒక రూపంలో

విరివిగా, విస్తృతంగా కొనసాగుతున్నాయి. మనుషులలోని భయాలనీ, ఆందోళనలనీ ఆసరాగా తీసుకుని, అరకొర జ్ఞానంతో, శాస్త్రాలకి వక్రభాష్యాలతో అమాయకులని మోసంచేసే నవయుగ గిరీశాలు కోకొల్లలుగా, ఖండాంతరాలుగా వ్యాపించి ఉన్నారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో హేతుబద్ధ ఆలోచనలు పెంచే ప్రయత్నం ప్రకాశిక ద్వారా చేద్దాం. గురజాడ వ్యక్తిత్వస్ఫూర్తితో, ఆయన ఆలోచనలకు అనుగుణంగా, భాషోద్దీపన, సమాజ శ్రేయస్సులను కాంక్షిస్తూ **'ప్రకాశిక'**ని నడపాలని గురజాడ ఫౌండేషన్ (అమెరికా) సంకల్పం.

సమాజాన్ని తట్టి, కుదిపి, ఆలోచింపచేసే రచనలూ, వెన్నుతట్టి దారిచూపే దార్శనికుల వ్యాసాలు, మస్తిష్కానికి పదునుపట్టే శీర్షికలతో **'ప్రకాశిక'** అందంగా ముస్తాబయి మీ ముందుకు వస్తుంది. ముఖ్యంగా, తెలుగు మాండలిక శోభతో రాసిన రచనలని ప్రోత్సహిస్తాం. హాస్యం, వ్యంగ్యం, వెటకారం తెలియని, నచ్చనివాడు తెలుగువాడు కాదేమో అనిపిస్తుంది. కన్యాశుల్కం ఒక ప్రభావిత నాటకంగా నిలిచిందంటే, హాస్యం, వ్యంగ్యం, వెటకారాలని అనుపానంగా పెట్టి నిష్ఠూరాన్ని నిబ్బరంగా చెప్పడంవల్లే కదా! హాస్య, వ్యంగ్యభరిత, రచనలు పంపిస్తే కళ్ళకద్దుకొని తీసుకుంటాం.

తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన వారితో ఏర్పాటయిన సంపాదక మండలి, ప్రకాశికని అత్యున్నతమైన ప్రమాణాలతో, ఆధునిక భావజాలంతో మంచి సామాజిక, సాహితీ పత్రికగా మలిచేందుకు మార్గనిర్దేశనం చేస్తుంది. కథ, కవిత, వ్యాసం, అనువాద రచన మొదలైన సాహిత్య ప్రక్రియలన్నింటికీ ప్రకాశిక ఒక విలక్షణమైన వేదికగా ఉంటుంది. గురజాడ వారి జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబరు మాసంలో ప్రకాశిక ప్రత్యేక వార్షికోత్సవ సంచికని వెలువరిస్తాము.

**'ప్రకాశిక'**ను ప్రకాశవంతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దడంలో సాహితీ మిత్రులు, రచయితల అండదండలు, సహకారం మాకు సదా అవసరం. **'ప్రకాశిక'**లో ప్రచురించమని ప్రసిద్ధ రచయితలకి, కొత్త రచయితలకి ఆహ్వానం పలుకుతున్నాం.

ఈ పత్రిక మనందరిదీ. కలిసి పెంచుదాం.

**ప్రధాన సంపాదకులు**

# ప్రకాశిక సంపాదక వర్గం

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ,** ప్రధాన సంపాదకులు



పుట్టినది పశ్చిమగోదావరి జిల్లాలోని ఇరగవరం అగ్రహారం. పెరిగినది చాలా వరకు తణుకులో. తాడేపల్లిగూడెం కళాశాల నుంచి డిగ్రీ, ఉమ్మడి రాష్ట్ర రాజధాని భాగ్యనగరంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్.సి, దేశ రాజధానిలోని ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఫిల్, పిహెచ్.డి చేశారు. గత 27 సంవత్సరాలుగా అమెరికాలో నివాసం. చాలా సంవత్సరాలు వైద్య విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా కేన్సర్ వ్యాధికి సంబంధించిన అంశాలపై పరిశోధనలు జరిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ ఫార్మాస్యుటికల్ కంపెనీలో కేన్సర్ మందులు రూపొందించే శాస్త్రవేత్తగాను, హ్యూస్టన్ లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలోని వైద్యశాస్త్ర విభాగంలో అనుబంధ ఆచార్యులుగానూ పని చేస్తున్నారు. అంతర్జాతీయ కేన్సర్ పరిశోధనలకి సంబంధించిన అంతర్జాతీయ పత్రికకి ప్రధాన సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. మాటల మాలలల్లడం ప్రవృత్తి. అడపాదడపా రాసిన కవితలు, కథలు, వ్యాసాలు ఒకచోట కూర్చి ''మనస్వినీయం'' అన్న పేరుతో ఇటీవల ఒక పుస్తకం ప్రచురించారు.

**మా శర్మ,** గౌరవ సంపాదకులు



"మా శర్మ" గా సుపరిచితులైన మాచవరం వేంకట చెంచురామ మారుతి సుబ్బరాయశర్మ 1967 సంవత్సరం నవంబర్ 29వ తేదీన గుంటూరు జిల్లా, నరసరావుపేటలో జన్మించారు. పాత్రికేయులు, కాలమిస్ట్‌గా ప్రసిద్ధులు. తెలుగువారికి సొంతమైన అవధాన ప్రక్రియ, ఆశుకవిత్వంలో అగ్రగణ్యులు, ఆరాధ్యులైన కొప్పరపు కవులు మా శర్మగారికి మాతా మహులు. ఆ మహాకవుల పేరిట శ్రీ కొప్పరపు కవుల కళాపీఠాన్ని 2002లో స్థాపించారు. వారి విగ్రహాలను విశాఖపట్నం సాగరతీరంలో, నరసరావుపేటలో స్థాపించారు. కొప్పరపువారి సాహిత్యాన్ని సేకరించి దొరికినంత వరకూ గ్రంథస్థం చేశారు. ప్రతియేటా 'శ్రీ కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారాలు' ప్రదానం చేస్తున్నారు. ప్రముఖులు పీసపాటి నరసింహమూర్తి, వేటూరి సుందరరామ్మూర్తి, మల్లాది చంద్రశేఖరశాస్త్రి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, నేదునూరి కృష్ణమూర్తి, కె.విశ్వనాథ్, బేతవోలు రామబ్రహ్మం, మేడసాని మోహన్, గరికిపాటి నరసింహారావు, మాడుగుల నాగఫణిశర్మ, పి.సుశీల, సిరివెన్నెల సీతారామశాస్త్రి మొదలు

ఎందరో తెలుగు, జాతీయ కవులు, కళాకారులు ఆ పురస్కారం అందుకున్న వారిలో ఉన్నారు. ప్రస్తుతం ఆంధ్రపత్రిక దినపత్రికకు కన్ సల్టింగ్ ఎడిటర్ గా పాత్రికేయ సేవలు అందిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుండి మీడియాలో ఉన్నారు.

**శ్రీమతి గురజాడ అరుణ,** నిర్వాహక సంపాదకులు



గురజాడ వేంకట అప్పారావుగారి ముని మనుమరాలు శ్రీమతి గురజాడ అరుణ. ముంబైలో పుట్టి పెరిగిన వీరు IT రంగంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ముత్తాతగారి అకాల మరణంతో అసంపూర్ణంగా మిగిలిపోయిన వారి సాహితీ సేవలు, సంఘ సంస్కరణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళే క్రమంలో గురజాడ ఫౌండేషన్ (అమెరికా) స్థాపించారు. గురజాడ వారి పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముత్తాతగారి స్మృతిని చిరస్థాయిగా ఉంచుతున్నారు.

**శ్రీ గురజాడ రవీంద్రుడు,** సంపాదక సలహాదారు



గురజాడ వేంకట అప్పారావుగారి మునిమనుమడు శ్రీ గురజాడ రవీంద్రుడు. 2014లో గురజాడ ఫౌండేషన్ (అమెరికా) స్థాపనలో ముఖ్య భూమిక పోషించారు. ఫౌండేషన్ లక్ష్యాలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడంలో చురుకైన పాత్ర పోషిస్తూ ముత్తాతగారి అడుగుజాడల్లో పయనిస్తున్నారు. గురజాడ ఫౌండేషన్ (అమెరికా) ఇండియన్ చాప్టర్‌కు ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

**శ్రీ విహారి,** సంపాదక సలహాదారు



'విహారి' అనే కలం పేరుతో సుప్రతిష్టులైన శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు 1941లో తెనాలిలో జన్మించారు. వీరు 12 కథాసంపుటాలు, 15 విమర్శనాత్మకమైన వ్యాస సంపుటాలు, ఒక వ్యాస కదంబం,7 నవలలు, 5 కవితా సంపుటాలు, ఒక దీర్ఘ కథాకావ్యం– పుస్తకాల రూపంలో వెలువరించారు. అన్ని ప్రసిద్ధ తెలుగుపత్రికలలోనూ 300కి పైగా వీరి రచనలు

ప్రచురితమయ్యాయి. వివిధ పత్రికల్లో పరిచయాలూ–పరామర్శలు, "బతుకు గీతలు", "కథావిహారం" వంటి శీర్షికలనూ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, అజో విభో కందాళం ఫౌండేషన్ (AVKF) వారి జీవన సాఫల్య పురస్కారం, ఆం.ప్ర భాషా దినోత్సవ పురస్కారం, తె.వి.వి.కీర్తి పురస్కారం లాంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు అందుకున్నారు. ఎల్.ఐ.సి.లో జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసి, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

**ఆచార్య వెలమల సిమ్మన్న,** సంపాదక సలహాదారు



బహుముఖ ప్రజ్ఞాశాలిగా వాసికెక్కిన ఆచార్య వెలమల సిమ్మన్నగారు 1955 సంవత్సరం మార్చి 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, తిమడాం గ్రామంలో జన్మించారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో తెలుగుశాఖలో అధ్యాపక ధర్మం నిర్వర్తించారు. భాష, సాహిత్యం, వ్యాకరణం, భాషా శాస్త్రం, విమర్శ, పరిశోధన, మొదలైన రంగాలకు సంబంధించి 83 గ్రంథాల్ని రాశారు. 440కి పైగా పరిశోధన పత్రాలు ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 160కి పైగా వివిధ సెమినార్లలో హాజరై పరిశోధన పత్రాల్ని సమర్పించారు. 50కి పైగా రేడియో ప్రసంగాలు చేశారు.

**ఆచార్య గుమ్మా సాంబశివరావు,** సంపాదక సలహాదారు



తెలుగు సాహిత్యంలో ప్రముఖ విమర్శకులుగా, పుస్తక సమీక్షకులుగా, అన్నింటికీ మించి మంచి అధ్యాపకునిగా పేరొందిన గురువర్యులు ఆచార్య గుమ్మా సాంబశివరావు గారు. స్వగ్రామం గుంటూరు జిల్లాలోని వేజెండ్ల. 2018లో ఆంధ్ర లయోలా కళాశాలలో తెలుగు శాఖాగ్రణిగా పదవీ విరమణ చేశారు. మహాకవి గురజాడ 150వ జయంతి కానుకగా 2011 డిసెంబరులో 'కన్యాశుల్కంలో హాస్యం' పేరుతో ఓ గ్రంథాన్ని ముద్రించారు. 2012 డిసెంబరు 27,28,29 తేదీల్లో తిరుపతి నగరంలో నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని తెలుగు అకాడమీ వారు ఆచార్య గుమ్మా సాంబశివరావు రచించిన 'తెలుగువాఙ్మయ చరిత్ర–రచయితలు' అనే గ్రంథాన్ని ముద్రించారు. నూటముప్పైకి పైగా వివిధ పత్రికల్లో వ్యాసాలు, 150 కి పైగా పుస్తక సమీక్షలు, 60 కి పైగా ఆకాశవాణిలో ప్రసంగాలు అనేక

జాతీయ అంతర్జాతీయ వేదికల మీద వివిధ అంశాల మీద ప్రసంగాలు, సాంబశివరావుగారి విస్తృత ప్రతిభకి తార్కాణం. సాంబశివరావు గారు అనేక జాతీయ, అంతర్జాతీయ సన్మానాలు, సత్కారాలు పొందారు. ఏ అంశంపైనైనా అనర్గళంగా ప్రసంగించే వీరి సామర్థ్యాన్ని గుర్తించి అనేక సాహిత్య పీఠాలవారు 'ప్రసంగప్రజ్ఞానిధి', 'ఉపన్యాసకేసరి' వంటి బిరుదులతో సత్కరించారు.

**డా. సి. భవానీదేవి,** సంపాదక సలహాదారు



రచయిత్రి, విమర్శకురాలు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుంచి ప్రభుత్వ ఉప కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. 15 కవితా సంపుటులు, వివిధ ప్రక్రియల్లో 51 గ్రంథాలు వెలువరించారు. వీరి పలు కవితలు, కథలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి. డాక్టర్ సి. భవానీదేవి పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. ఆకాశవాణి, ప్రసారభారతి జాతీయ స్థాయిలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రసారం చేసే జాతీయ కవి సమ్మేళనంలో భాగంగా 2019 సంవత్సరానికి తెలుగు కవయిత్రిగా ఎంపికయ్యారు.

**డా. రేవూరి అనంత పద్మనాభరావు,** సంపాదక సలహాదారు



పద్మనాభరావు వందకుపైగా అష్టావధానాలు చేశారు. 120 గ్రంథాలు ప్రచురించారు. అందులో నాలుగు కథా సంపుటాలు, నాలుగు నవలలు, 12 అనువాదాలు, 11 జీవితచరిత్రలు, 12 సివిల్స్ పరీక్షల గ్రంథాలు, పరిష్కరణలు, వ్యాఖ్యలు, పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించారు. వీరి రచనలపై నాలుగు విశ్వవిద్యాలయాల నుండి ఆరుగురు పరిశోధక విద్యార్థులు ఎం.ఫిల్ / పి.హెచ్.డి డిగ్రీలు సంపాదించారు. పద్మనాభరావుకు 1993లో తెలుగు విశ్వవిద్యాలయ అనువాద పురస్కారము, 2000లో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించాయి. ఢిల్లీ తెలుగు అకాడమీ, మదరాసు తెలుగు అకాడెమీ సనాతన ధర్మచారిటబుల్ ట్రస్టు తదితర అవార్డులు పొందారు. కందుకూరి రుద్రకవి రచనలపై పిహెచ్‌డి చేశారు. 1967లో కందుకూరు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి 1975 నుండి 2005 వరకు ఆకాశవాణి, దూరదర్శన్‌లో పదవీ

బాధ్యతలు మూడు దశాబ్దాలు నిర్వహించి, ఢిల్లీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా పదవీ విరమణ చేశారు. 2005 – 10 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేసి శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌కు అంకురార్పణ దశలో కృషి చేశారు. కంచికామకోటి పీఠాధిపతి వీరిని ఆస్థాన విద్వాంసులుగా సత్కరించారు. అమెరికా, యు.కె, జర్మనీ దేశాలలో పర్యటించి ఉపన్యసించారు. 1200 వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురించారు. 74 సంవత్సరాల పద్మనాభరావు హైదరాబాదులో స్థిరపడ్డారు.

**డా. నాగసూరి వేణుగోపాల్,** సంపాదక సలహాదారు



దేశవ్యాప్తంగా తొమ్మిది ఆకాశవాణి కేంద్రాలలో సుమారు ముప్పెయి మూడు సంవత్సరాలుగా పనిచేస్తూ మరోవైపు రచయితగా, కాలమిస్టుగా, సంపాదకునిగా డా. నాగసూరి వేణుగోపాల్ ఇంతవరకు 60 పైగా పుస్తకాలు వెలువరించారు. అనంతపురం జిల్లా కొనతట్టు పల్లిలో 1961లో జన్మించిన నాగసూరి ఎస్వీయూ నుంచి ఫిజిక్స్‌లో ఎం.ఎస్సీ., ఎం.ఫిల్., తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో పిహెచ్.డి. గడించారు. పరిశీలన, పరిశోధన, ప్రణాళికతో ఆకాశవాణి కార్యక్రమాలు నిర్వహించిన నాగసూరి రేడియో పరిచయ కార్యక్రమ నిర్వహణలో పేరుపొందడమే కాక ఆదివాసీ అంతరం, శతవసంత సాహితీ మంజీరాలు, వెలుగుజాడ, అన్నమయ్య పదగోపురం, జీవనబింబం, చిత్తూరు జిల్లా జీవన చిత్రం వంటి విలువైన కృషి ద్వారా చిరకాలం నిలబడే ముద్ర వేశారు. విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, పత్రికారంగం, ప్రసారమాధ్యమాలు, చరిత్ర, భాష వంటి విషయాలపై పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించారు. గురజాడ, తాపీ, పొట్టి శ్రీరాములు, నార్ల, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, జి.వి.కృష్ణారావు, విద్వాన్ విశ్వం వంటి వారి పరిశోధనాత్మక పుస్తకాలు వెలువరించిన నాగసూరి సాహితీ వీక్షణం, సాహితీ స్పర్శ వంటి విమర్శనా గ్రంథాలు కూడా రచించారు. 20వ శతాబ్దం ముగుస్తున్న వేళ విజయవాడ ఆకాశవాణి ద్వారా మూడేళ్ళపాటు పరిచయం చేసిన శతాబ్దపు వంద ఉత్తమ తెలుగు గ్రంథాల గురించి వెలువరించిన శతవసంత సాహితీ మంజీరాలు అత్యంత విలువైన సంకలనం. ఇంకా సాహిత్య అకాడమీకి సైన్స్ ఫిక్షన్ 'వైజ్ఞానిక కథలు', అలాగే 'కథావరణం', 'మదరాసుబదుకులు' కథా సంకలనాలను మిత్రులతో కలిసి వెలువరించారు. స్థానిక మూలాలు, విస్మృత ప్రముఖులు, జానపదకళలు, హెచ్.ఐ.వి./ఎయిడ్స్, ఆదివాసుల జీవితం, ఇతర ప్రాంతాల తెలుగువారు, అన్నమయ్య వంటి అంశాలపై దృష్టి నిలిపి కృషి చేసిన వేణుగోపాల్ ప్రస్తుతం తెలుగువారు విస్మరించిన గాంధీ తత్వంలోని ప్రయోజనకరమైన కోణాలను వివరించడానికి తన బృందంతో కలసి శ్రమిస్తున్నారు. వీరి ప్రస్తుత నివాసం హైదరాబాదు.




**సంపాదక వర్గం**

**వ్యవస్థాపక సంపాదకులు**
కీ.శే. శ్రీ గురజాడ
వేంకట అప్పారావు

**ప్రధాన సంపాదకులు**
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

**గౌరవ సంపాదకులు**
శ్రీ మా శర్మ

**నిర్వాహక సంపాదకులు**
శ్రీమతి గురజాడ అరుణ

**సంపాదక సలహాదారులు**
శ్రీ గురజాడ రవీంద్రుడు
శ్రీ విహారి
ఆచార్య వెలమల సిమ్మన్న
ఆచార్య గుమ్మా సాంబశివరావు
డా. సి. భవానీదేవి
డా. రేవూరి అనంత పద్మనాభరావు
డా. నాగసూరి వేణుగోపాల్

**పత్రిక కూర్పు**
త్రిపురాన శ్రీనివాసరావు

# ఆలోచిద్దాం

ప్రకాశిక తొలి సంచికకి మంచి స్పందన, అభినందనలు వచ్చాయి. తొలి సంచిక లో వ్యాసాలు రాసిన ప్రతీ ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు. ప్రకాశిక రెండవ సంచిక 31 జనవరి 2021 న విడుదల అవుతోంది. ఈ సంచిక కూడా విశేష ఆదరణ పొందుతుందని నమ్ముతున్నాను.

వాదాలకి, వర్గ, వర్ణాలకి అతీతంగా పత్రికని నడపాలన్నది నా అభిమతం. వేరు వేరు రంగాలకి చెందిన ప్రముఖుల రచనలు, విభిన్న ఆలోచనా ధోరణులని పంచే రచనలను ప్రచురించడం పత్రిక ఆరోగ్యానికి మంచిదని నా నమ్మకం. ఏ ఒక్క సిద్ధాంతానికీ ప్రకాశిక మద్దతు పలకదు; ఏ భావజాలాన్నీ నిరసించదు. గురజాడలో ఎన్నో కోణాలు ఉన్నాయి. వాటిని గుర్తించి విశాలాంధ్ర పబ్లికేషన్స్ వారు గురజాడ రచనలు ఎన్నో వెలికి తీశారు కాబట్టి ఈ రోజు మనం వాటిని చదివి ఆనందించగలుగుతున్నాం. సమాజాన్ని, సమస్యలని వేరు వేరు కోణాలలో పరిశీలించి నిజాయితీగా అభిప్రాయాలు పంచుకుంటే తప్పులేదు. సాహిత్య ప్రయోజనం సమాజహితం, సమాజ అభివృద్ధి అని ప్రకాశిక పత్రిక వెనక ఉన్న అభిమతం. సమాజంలో సమానత్వ ఆకాంక్షలని ప్రతిబింబిస్తూ రచనలు రావాలి; అలాగని కొత్త అసమానతలకి దారితీసే వాదాలు, వివాదాలు తెరమీదకి వస్తే కన్యాశుల్కం పోయి వరకట్నం వచ్చినట్లు అవుతుంది. పరిపుష్టమైన భాషలో రాసిన రచనలకి ప్రకాశిక చిరునామా అవ్వాలని మా ఆకాంక్ష. ప్రకాశిక భావేంద్ర ధనుస్సులా విలసిల్లాలని మా అభిలాష. తొలి సంచిక చదివిన చాలామంది ప్రకాశిక 'భారతి పత్రిక' ని పోలి ఉంది అని వ్యాఖ్యానించారు. ఆ నేపథ్యంలో భారతి పత్రిక పాత ప్రతులని పరిశీలించి అందులోని

కొన్ని రచనలని ఈ సంచికలో పునర్ముద్రిస్తున్నాము.

జనవరి 30 భారత దేశ చరిత్రలో ఒక గంభీరమైన రోజు. మహాత్మా గాంధీ నేలకొరిగిన రోజు. అహింసావాద కమలం ముకుళించడం మొదలయిన రోజు. మహాత్మ నిశ్చలాత్మ అయ్యాక గడియారం 73 సంవత్సరాలు తిరిగి, దేశ గతిని, గమనాన్ని పరికిస్తూ నిట్టూరుస్తూనే జీవిస్తోంది. స్వతంత్ర భారత దేశంలో ధర్మాగ్రహానికీ, సత్యాగ్రహానికీ విలువ, చోటు లేని పరిస్థితులు నెలకొన్నట్లు కనిపిస్తోంది. దేశ రాజధానిలో రైతులు నెలలు తరబడి సత్యాగ్రహం చేస్తూంటే ఏమీ పట్టనట్లు ఉపేక్షించే పాలకులు, వేల ఎకరాల భూములిచ్చి భవిష్యత్ ఏమిటో తెలియక అయోమయంలో కొట్టుమిట్టులాడుతూ ఏడాదికి పైగా ధర్మపోరాటం చేస్తూంటే కన్నెత్తి చూడని ప్రజాప్రభుత్వం తీరు చూసి మహాత్మ సమాధిలో సతమతమవుతున్నారేమో. పాలకుల ధోరణి చూస్తూ ఉంటే, ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నించే వారికి అడగకుండానే ఆయుధాలు ఇచ్చినట్లుగా ఉంది. ఈస్ట్ ఇండియా కంపెనీ భౌతికంగా భారతదేశంలో ప్రవేశించి తిష్ట వేసి మనలని బానిసలుగా చేస్తే, బహుళ జాతి సంస్థలు ఎలాంటి శ్రమ లేకుండా దేశ ఆర్థిక వ్యవస్థని నిర్దేశించే ప్రయత్నం చేస్తూంటే ప్రజలు ఎలా ప్రతిఘటించాలి? “అంతా మీ మంచికే” అని బోధించే పాలకులు మంచి చెడులు విడమర్చి చెప్పే ప్రయత్నం చేయక్కరలేదా? ఒక విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి సందేహాలూ, సంశయాలు తీర్చే ప్రయత్నం ప్రధాని చేయక్కర లేదా? గత ఐదు సంవత్సరాలుగా ప్రధాని ఎన్ని విలేఖరుల సమావేశాలు ఏర్పాటు చేశారు?

ఏకపక్ష, నిరంకుశ ధోరణులు పాలకులలో విస్తరించడానికి కారణం ఏమిటి? నిర్వీర్యమైన మేధావి వర్గం, నినాదాలే విధానాలుగా ప్రచారం చేసే నాయకులకి వత్తాసు పలికే విస్తృతమైన భజన సమాజాలు. నిష్పాక్షికంగా చెప్పాలంటే కుంచిస్తున్న స్వతంత్ర ఆలోచనలు గల మేధావి వర్గం జాతి మనుగడకి హానికరం. ప్రశ్నించే వారికి రంగులద్దే సంస్కృతి ప్రబలుతున్నట్లు కనిపిస్తోంది. అన్యాయాన్ని నిరంగ మనస్కులై నిరసించే సమాజం రావాలి. అన్యాయాన్ని ఎత్తి చూపి సమస్యల పరిష్కారానికి మార్గం చూపే రచనలు రావాలి. ఏ రాజకీయ పార్టీ పాలిస్తున్నా సమస్యలపై గళం విప్పే తటస్థ మేధావుల సమూహం దేశానికి అవసరం. ప్రస్తుతం అగ్ర రాజ్యాల పరిస్థితి చూస్తూంటే నిష్కల్మష, ఉద్రేకరహిత (impassionate) అంతర్జాతీయ మేధావి వర్గ ఆవిష్కరణ ఆవశ్యకత చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జెండాలు మాసి ఎజెండాలుగా మారాయి. వ్యక్తులు మారారు. వ్యవస్థలు మారలేదు. రాజులు పోయారు, ప్రజా ప్రతినిధులు వచ్చారు; అణగార్చే ధోరణులు సమసిపోలేదు. నవ యుగ చింతనకి మనమే నాంది కావాలి.



**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

స్వవిషయము 13



భోగిమంటలు 18



శుభ కామన
నవ జీవన క్రాంతి 19



కన్యాశుల్కంలో
గిరీశం 26

ఆలోచనల దారిలో.. 30

నా అనుభవాలు–
జ్ఞాపకాలు 32



గురజాడ
జీవిత గమనం,
భాషా విప్లవం 37





పెన్నేపల్లి
గోపాలకృష్ణ చెక్కిన
సజీవశిల్పం
మధురవాణి 41

స్వాగతము 48

కరుణశ్రీ గారి
కావ్యత్రయ దర్శనం 49

నవయుగాల బాట
"నార్ల" మాట 53



పద్య సౌరభం 57



తెలుగుసినిమా పాట–
సాహిత్యసౌరభాలు 60

సాహిత్యవాదాలు
సామాజిక
వైషమ్యాలకు ఆజ్యం
పోస్తున్నాయా? 66



నేటి యూరప్‌లోని
విద్యావిధానాలు 69



ఫోను 78



82

తిలక్ కథలు –
శిల్పసౌందర్యం




87

కరోనానంతరకాలం



తొలి ఆధునిక
వైజ్ఞానిక రచయిత,
దార్శనికుడు 90



కలయిక 96

అర్ధాంగి 102





109 ఇంకుడుగుంత



112

ఆదర్శం

# స్వవిషయము

## భారతి తొలి సంచిక సంపాదకీయం

1924-01-01 | Volume 01 | Issue: 01

**ఉ. కాటుకకంటి నీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చె ? దో**
**కైటభదైత్యమర్దనుని గాఁదిలికోడల! యో మదంబ! యో**
**హాటకగర్భురాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్ల క**
**ర్ణాటకిరీటకీచకుల కమ్మ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ.**




పోతన శ్రీమదాంధ్ర భాగవతమును రచియించు సందర్భముననను మహానుభావుఁడైన పోతనామాత్యునకును భాగ్యభోగప్రియుఁడైన శ్రీనాథునకును సంబంధించిన కథ లనుశ్రుతముగ వచ్చుచున్నవి. ఆ గాథల యందు భాగవతకృతిసమర్పణమునకు సంబంధించిన గాథయు నొకటి కలదు. ఆ గాథయును పోతరాజునకు సహజమైన స్వాతంత్ర్య భావ వైభవమును మనోహరముగ దెలుపుచున్నది.

పోతరాజు తన భాగవతకృతి నే రాజునకో ఇచ్చి దుర్భరమైన దారిద్ర్యమును బాపుకొనుట వివేకమని శ్రీనాథుడు పోతరాజును హెచ్చరించెను. శ్రీనాథుని పలుకులు పోతరాజునకుఁ గొంత సంభ్రమమును గలుగఁ జేసినవఁట! తన మనోవికారము వలనన్ను భారతికి గలిగిన సంతాపమును పోతన గనుఁగొని పై పద్యమును రాసి భారతికి దుఃఖోపశమనమును జేసినాఁడట! పరాధీన స్థితియందున్న భారతి విశుద్ధమైన దేశభాషారాధకులకు గలుగఁజేసెడి హృదయసంతాపము నీ పద్యార్థము విశదముఁ జేయుచున్నది.

పోతరాజు పరమస్వతంత్రుఁడు. ఆ మహాకవికి కావ్యసామ్రాజ్యానుభవమున కాటంకము లెవ్వియును లేవు. భాషయందును భావములందును విజ్ఞానమునందును జీవనప్రవృత్తి యందును. పూర్ణస్వాతంత్ర్యమును గలిగి స్వాధీనభారతి నారాధింపఁ గలిగినను కృతివిక్రయభావము పోతరాజునకు సంతాపమును గలుగఁజేసినపుడు సకల విధములౌ స్వాతంత్ర్యమును గోల్పోయి యిపుడు పరాధీనస్థితియందున్న

భారతిని గనుగొనునపుడు గలుగగల సంతాపమునకు మితిమేరలుం గలవా? మన నిర్మాణమునకు మన పరాధీనస్థితికి మూలశక్తియైన భారతియొక్క పరాధీనస్థితియె మూలము. స్వీయ సంప్రదాయాచార సిద్ధమైన భారతీస్వరూపమును సంకల్పించి ధ్యానించి పూజించి వర్ణించి చిత్రించి కీర్తించి భారతిని ప్రత్యక్షము చేసికొనుటయె స్వాధీనస్థితికి సాధనము.

భారతి దీనదశ ననుభవించుచున్నది. అంగములు శుష్కించినవి. కాంతికళలు పోయినవి. విషమస్థితి గలిగినది. ఈ మహోపద్రవమునందు మునిఁగితేలుచున్న భారతి నుద్ధరించి శుభస్థితిని గల్పింపవలయునను సంకల్పము భారత హృదయము నందు గలిగినది. సేవాపరాయణులు పలువిధముల నీ దేవి నారాధించుచు దివ్యరూప సందర్శనమును జేయగోరుచున్నారు. ఆరాధనాభిలాష యితర రాష్ట్రములందు వలె నాంధ్రరాష్ట్రమునందును గలదు. ఆ యభిలాషను సఫలము చేయుటకు పత్రికలను ప్రచురించుచున్నారు. గ్రంథములను వ్రాయుచున్నారు. చిత్తరువులను చిత్రించు చున్నారు. పాటలను బాడుచున్నారు. ఈ ప్రయత్నములన్నియును భారతిని బ్రత్యక్షము చేయుచు నాత్మవికాసమునకు సాధనంబు లగుచున్నవి.

భారతి ఆదిశక్తి, మహాశక్తి, సావిత్రి, సరస్వతి, మహాలక్ష్మి, త్రిపురసుందరి. కైలాస శిఖరమునందును కన్యాకుమారియందును, శ్రీ గిరియందును వేంకటాద్రియందును, వటమునందును చూతమునందును, మత్తేభమునందును మరాళమునందును, అజంతాయందును ఎల్లోరా యందును, కమలములందును కేదారములందును, మందిరములందును మహలులందును, వేదములందును కావ్యములందును, పాట లందును పద్యములందును సర్వత్ర భారతి ప్రత్యక్షముగ నున్నది. సర్వత్ర కన్నులుగల వారికి ప్రత్యక్షముగనున్న భారతిని యథాశక్తి నారాధించి భారతీప్రసాదమును బడయుటయె ఆత్మోపలబ్ధికి సాధనము.

భారతి దేశభాషారీతుల ననుసరించి బహురూపములను నెల్లెడలను వెలయుచున్నది. ఆ మహాదేవి వంగ మహారాష్ట్రాది దేశములందు నవవికాసముతో విహరించుచున్న విధమును నారాష్ట్రముల కళావాఙ్మయముల వికాసము విశదము చేయుచున్నది. వంగ భాషయందుఁ బ్రచురింపఁబడుచున్న గ్రంథములు చిత్రపటములు పత్రికలు పరిశోధనలు వారి యుత్సాహమునకు నిదర్శనములు. ఆంధ్రభారతియును వంగభారతియును కర్ణాటక భారతియును భారతీస్వరూపములు. భారతీదేవి నెవ రేరీతిని గొలిచిన వారి కారీతిని బ్రత్యక్షమగుచు కామితార్థముల నొసంగుచున్నది. శ్రీకాకుళమునుండి నాశిక వరకును మహావైభవ విలాసములతోఁ బూర్వమానందముగ నాంధ్రావనియందు విహరించిన భారతి యిపుడు పరాధీనయై దైన్యము ననుభవించు చున్నది. స్వాతంత్ర్య వాతావరణము చెలరేఁగుచున్న వర్తమాన సమయమునందు దైన్యదశ కంటికిఁ బాగుగఁ బొడగట్టుచున్నది. మానవులకు భావదాస్య విమోచనము

గలుగకను బాహ్యదాస్యవిమోచనము గలుగఁజాలదు. ఆత్మవికాసమునకు సాధనం బులైన భాష భావములు కళలు శాస్త్రములు సంప్రదాయాచారములు కాంతికళలు లేకను జీవనప్రవాహము సంకుచితమైనది. హృదయవికాసమునకు సాధనంబులైన కావ్యకళానాటకాదుల యుద్ధరణమున కాత్మసంస్మరణము సాధనముగ నున్నది. ఆత్మ సంస్మరణమున కవసరమైన దేశావృతమైన సాధనల నారాధించి భావదాస్యవిమోచనమును బడయవలసిన శుభ ముహూర్తము సంప్రాప్తమైనది.

ఆంధ్రయువజన హృదయముత్సాహపూరితమై వర్తమాన సమయమునందు భావకర్మరంగములందు నిర్మాణమార్గము నవలంబించుటకు పరితపించుచున్నది. కళాభిజ్ఞులు కళాభ్యుదయమునకుఁ బాటుపడుచున్నారు. పండితులు శాస్త్ర పరిశోధన లకుఁ బూనుకొనుచున్నారు. కవులు మనోభావములను వర్ణించుచున్నారు. గాయకులు పాడుచున్నారు. చిత్రకారులు చిత్రించుచున్నారు. శాస్త్రజ్ఞులు పరిశోధించుచున్నారు. అన్ని దిశలయందును జిజ్ఞాసకాంతులు ప్రసరించుచున్నవి. అన్ని కులములవారును మతములవారును ఆత్మోపలబ్ధిని బడయఁ గోరుచున్నారు. ఆంధ్ర హృదయమునందు స్వకీయమైన స్వరూప స్వభావములను నిర్ణయించి స్వధర్మము నారాధింపవలయునను సంకల్పము గలిగినది. ఆ సంకల్పమును సఫలము చేయుటకు చరిత్రకారులు పండితులు పరిశోధకులు కళాప్రవీణులు ప్రచారకులు చేయుచున్న పరిశ్రమ దేశవ్యాప్తమై ప్రజాపోషణమును బడయుచున్నది. దేశ వ్యాప్తములైన ప్రయత్నముల నేకముఖమునను నాంధ్ర ప్రపంచమునకు వ్యక్తముచేసి ప్రజాదృష్టిని నవసరము గలిగినది. ఆ యవసరమును సఫలము చేయుట కాంధ్ర ప్రపంచము పూర్వాపర సంస్కారములను సమన్వయమును జేయుటకు బూను కొనుచున్నది. ఆంధ్రప్రవృత్తిని పరిశీలించునపుడు ఈ విషయమును వ్యక్తమగుచున్నది.

ఆంధ్రవ్యక్తిత్వము చిరకాలాగతంబైన సంస్కార ఫలము. ఆ వ్యక్తిత్వమునందును నితరవ్యక్తిత్వములందువలె విశేషణములు గలవు. ఆంధ్రహృదయశీల మభివ్యాపకము గాని వ్యావర్తకము గాదు; ఉదారముగాని సంకుచితముగాదు; సరళముగాని వక్రము గాదు. ఆంధ్ర హృదయక్షేత్రమునందీ విశేషణము లాదికాలమునుండియు నప్రతి హతముగఁ బ్రకాశించుచున్నవి. ఆంధ్రభాష, వాఙ్మయము, మత సంప్రదాయా చారములు, ఆచారవ్యవహారములు, కళలు, శిల్పములును నీశీలమును విశదము చేయుచున్నవి. దేశవ్యాప్తములైన ప్రతిష్ఠాపనలందీ సహజశీలము గోచరంబగుచున్నది. శ్రీశైలము వేద యుగమునకు ఋష్యాశ్రమము; బౌద్ధయుగమునకు బౌద్ధవిహారము; శంకరయుగమునను శివక్షేత్రము; బసవయుగమునను జంగమమఠము; ఇపుడు శిథిల క్షేత్రము. శ్రీశైలము దశాభేదముల పాలైనను నేటికిని సుప్రసిద్ధమైన యాంధ్ర క్షేత్రముగ నున్నది.

ఆంధ్ర భాష సంస్కృత సంప్రదాయబద్ధమైనను ద్రవిడసంప్రదాయబద్ధమైనను

ప్రత్యేక సంప్రదాయముల ననుసరించి వికసించినది. ప్రాకృత సంస్కృత ద్రవిడ భాషల సంపర్కము భాషాభ్యుదయమునకుఁ దోడ్పడినను భాషాశీలమును శిథిలము చేయ లేదు. ఆంధ్ర భాష స్వరాంతమై సరళవర్ణరంజితమైన మృదు మధుర స్వభావమును గాపాడుకొనఁ గలిగినది. ఆంధ్రవాఙ్మయము ప్రాకృత సంస్కృత కర్నాటక వాఙ్మయముల సంపర్కమును గలిగినను ప్రత్యేక రీతిని వికసించినది. మతాచారములు వైదిక జైన బౌద్ధశంకర వీరశైవ రామానుజాది మత సంపర్కమును గలిగియున్నను జ్ఞానమార్గమునవలంభించుచు వ్యక్తిత్వమును విశదము చేయుచున్నవి. కళలు దేశకాలపాత్రల స్థితిగతుల కనుగుణముగను వృద్ధిక్షయములను బొందినను ప్రత్యేక లక్షణములను గలిగియున్నవి. జీవనప్రవాహము నిమ్నోన్నత తలముల నధిగమించినను నిర్మలాకృతిని గలిగి ప్రవహించుచున్నది.

ఆంధ్రవ్యక్తి పరిణామమును నిరూపించుటకపారమైన విషయావగాహనమును జేయుట కాంధ్రలోకము పూనుకోవలసియున్నది. విషయావగాహనమునకు సాధ నములైన ప్రాచీనమందిరములు బౌద్ధస్తూపములు తామ్రశిలా శాసనములు తాళపత్ర గ్రంథములు కళావిచిత్రములు వాఙ్మయస్వరూపములు నిగూఢములై ప్రకాశము నపేక్షించుచున్నవి. ఆంధ్రవ్యక్తిద్యోతకములైన అమరావతి సాంచి మొదలగు స్తూపముల వైభవ మజ్ఞాతముగ నున్నది. శాసనపరిశోధనాలయమునందు వందలకొలఁది తామ్రశాసనములు త్రుప్పుపట్టి పోవుచున్నవి. ప్రాచ్యలిఖితపుస్తక భాండారమునందును తంజావూరు గ్రంథభాండారమునందును ప్రాఁతప్రతులు శిథిలము లగుచున్నవి. అజంతాయందలి మనోహరమైన చిత్తరువులు ప్రకాశమును గోరుచున్నవి. రసవంతమైన వాఙ్మయము ప్రకాశమును పరిశీలనమును గోరుచున్నది. దేశమునందు మూలమూలను దాఁగియున్న శాసనములు గ్రంథములు కళలు వెలుతురును గోరుచున్నవి. ఈ విషయావగాహనముకు దోడుగను ఆంధ్ర ప్రపంచమునందు భావరంగమునందు గలిగిన మహాసంచలనము సాదర పరిశోధనమును ప్రకాశమును గోరుచున్నది. గ్రంథకర్తలు చిత్రకారులు కళాప్రవీణులు సరసములైన నవరచనలను జేయుచు నవజీవనోదయమును జేయుచున్నారు. ఈ మహోదయ సమయమునందు యథాశక్తిని భారతిని గొలుచుట కవకాశము లారాధకులకు గలవు.

ఈ విషయావలోకమునకును సంస్మరణమునకును గారణ మాత్మసందర్శ నాభిలాష గాని స్వకీయప్రతిష్ఠ గాదు. విషయసాగరమథనమును ప్రాజ్ఞులు చేయుచు నాత్మసందర్శనమును జేయుచున్న విధమును విజ్ఞానకాంతులు విశదము చేయుచున్నవి. పరిశోధకమండలులు పత్రికలు సాహిత్య సంఘములు చిత్రకళా సంఘములు విద్యానిలయములు విషయసాగరమథనమును జేయుచు ఫలప్రాప్తికి సాధనములను విశదము చేయుచున్నవి. ఈ స్వల్పారంభమును లబ్ధావకాశములను

విషయావగాహనమును జేయుట కేర్పడినదిగాని మహత్ఫలమును సమకూర్పఁబడునను నభిమానముతో నేర్పడలేదు.

భారతియందు భాష వాఙ్మయము శాస్త్రములు కళలు మొదలగు విషయములు సాదరభావముతోఁ జర్చించుట కవకాశములు గల్పింపబడును. వాఙ్మయనిర్మాణమున కిపుడు జరుగుచున్న ప్రయత్నములు ప్రస్ఫుటము చేయబడును. శిల్పమునకు చిత్ర లేఖనమునకు శాసనములకు సంబంధించిన విషయములు చిత్రములతో బ్రచురింపఁబడును. సామాన్యముగఁ బత్రికాప్రచురణమునందుఁ గల సాధకబాధకము లనను భవవేద్యములైనను ఓ క్రొత్తప్రయత్నము సాహసకార్యముగఁ గనఁబడును. మాసపత్రిక నొకదానిని బ్రచురింపవలయునని తలఁచి కార్యసిద్ధికిఁ బ్రయత్నములు జరిగినవి. విజ్ఞానసంపన్నులు కొమఱ్ఱాజు లక్ష్మణరావుగా రీ భారమును బూనుట కంగీకరించిరి. ఆ మహానుభావునకు నూఱేండ్లు నిండినవి. వారి సహాయము దుర్లభమైనది. రెండేండ్లు లక్ష్మణరావుగారి నిమిత్తమును గతించినవి. సంకల్పము రిక్తమనోరథముగ నిలిచినది. కొంతకాలము పెరిఁగిన సంకల్పమును చేసిన ప్రయత్నములను సఫలము చేయుటకుఁ గల యవకాశములను వినియోగించుట కీప్రయత్నము కారణము. ఫలము దైవాధీనమునందు గలదు.

విపులమైన యాంధ్రావనియం దిట్టి ప్రయత్నముల కెన్నిటికైనను నవకాశములు గలవు. భారతిని పెంచి పోషింపవలసిన భారమాంధ్రలోకాధీనమైయున్నది. ముఖ్యముగ నీభారము విద్యావంతులమీఁదను గలదు. పత్రికకు జీవకళను విద్యావంతుల వ్యాసములు సమకూర్చునటులు బొమ్మలును పటములును నచ్చును సమకూర్పఁజాలవు. విద్యాసంపన్నులు యథాశక్తిని సకలవిధములను భారతిని బోషించుటకుఁ బ్రార్థితులు. వ్యాసములను పద్యములను పాటలను చిత్రపటములను బంపి ప్రచురణమునకుఁ దోడ్పడిన మహాజనులకు వందనశతంబులు. ఆంధ్ర మహాజనులు సదయహృదయులై భారతికి స్వాగతంబు నొసంగి దీవించి నా ప్రయత్నమును సఫలము చేయుటకు సాయపడుదురు గాక!

## ప్రకాశిక సంపాదకుని వ్యాఖ్య

"భారతి" తొలి సంచిక జనవరి 1924 సంవత్సరంలో, రుధిరోద్గారి నామ సంవత్సరం పుష్యమాసం లో విడుదలైనది. తొలి సంపాదకులు గన్నవరపు సుబ్బ రామయ్య గారు రాసిన సంపాదకీయాన్ని ప్రకాశిక పాఠకులను, రచయితలను ఉత్తేజ పరచడం కోసం ఇక్కడ పునర్ముద్రిస్తున్నాము. ప్రకాశిక, భారతిల మధ్య భావ, ఆశయ, రూప సారూప్యత ఉండడం చాలా ముదావహం.

# భోగిమంటలు

(భారతి 1945సంచిక 1,Vol 22 నుండి)



శ్రీ వింజమూరి
శివరామారావు

శర్వరీనీలకేశపాశమ్మునుండి
జారిపడె కోటితారకాకోరకములు;
ఉదయశైలకోటీరరత్నోజ్జ్వలముగ
మెరసె తరుణభాస్కరశోణకిరణచయము.

పాతాళమ్మునునుండి భువనసౌభాగ్యంబు దర్శింపగా
నేతెంచున్ బలి నేడె, పండుగయు నేడే భోగి యం చూరకే
మ్రోతల్‌వెట్టుచు తేనెలూరు మధుపమ్ముల్ రేగె నెత్తావితో
వీతెంచెన్ పవనమ్ము; క్రొవ్విరులతో విప్పారె నారామముల్.

అపుడు-బలిరాజు పాలించినపుడు -గడప
గడప - నూత్నతోరణముగా, ఎడద నెడద
నిత్యకల్యాణముగ నయ్యె; నేడు మరల
వచ్చు బలిరాజు; బ్రదుకులే విచ్చునేమొ!

అలరుచు గేహదేహళులయందు రసాలకిసాలతోరణ
మ్ములు సవరింపుడీ! ఎడద పొంగగ ప్రాంగణసీమ రంగవ
ల్లులు రచియింపుడీ! బ్రదుకులోవలె వీథులవెంట భోగిమం
టలు వెలిగింపుడీ! పుడమినాలుగుమూల లలంకరింపుడీ!

ప్రాతవై పాడుపడినవై రోతలైన
బ్రతుకులన్ని, కాలగ, సుందరములు నూత
నములు వాసంతయువజీవితములు వెలుగ,
కూడి భోగిమంటలు రగుల్కొ ల్పుడయ్య!



# శుభ కామన నవ జీవన క్రాంతి



జంధ్యాల
శరత్ బాబు
99483 45013

మన కలలూ కోరికలూ నిరంతరాలు, నిరంతరాయాలు. అంధకారాన్ని పటాపంచలు చేసే భోగిమంటలు, దూరాల్ని దరిచేర్చే దారాల గాలిపటాలు, పోరు పటిమను పెంచి పోషించే నానావిధాల పందేలు... ఇవన్నీ మానవాళి ఆశల ఆశయాల ప్రతిరూపాలు. వీటన్నిటి సమాహారమే ఏడాదిలో తొలిదీ పెద్దదీ అయిన సంక్రాంతి. ముచ్చటగా మూడు మాటల్లో నవ జీవన కాంతి. 'సం' అంటే ముందుకు. 'క్రాంతి'కి అర్థం అడుగు. ఒక్కముక్కలో ముందడుగు. అందుకే ఇది అఖిలలోక వైజయంతి, స్వర్ణప్రభా స్రవంతి. సరదాలు, మురిపాలు, ఆటపాటలు పైకి కనిపించేవైతే అంతర్లీనంగా వెల్లివిరిసేవి సంస్కృతీ సంప్రదాయాలు. వీటిని తోటివారితో పంచుకుంటే కష్టం తగ్గి సుఖం రెట్టింపవుతుంది. అందునా వరుసగా నాలుగురోజులు సంకురాత్రి పండుగ శోభ (భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ) తెలుగింటనే కాక అంతటా వెలుగులీనుతూనే ఉంటుంది. నేనూ, నా ఊరూ, నా వాళ్ళనే ఆరని తడిని గుండెగుండెనా నింపుతుంటుంది. ఏ ప్రాంతంలో ఏ పేరుతో పిలిచినా ఇదంతా పర్వదినోత్సాహం, ప్రతి ఒక్కరి మహాహృదయోల్లాసం. కవిస్వరం పలికినట్లు 'హేమంత వీధి కదలివచ్చెను భాగ్యాల కడలి వోలె మకర సంక్రాంతి లక్ష్మి'

మానవ గమనాల, గమ్యాల సూచిక లక్ష్మీకళ. భానుడి నవీన రాశీ ప్రవేశం – సంక్రమణం. దీనికితోడు ఉత్తరాయణ కాల ఆగమనం, ధనుర్మాస ప్రాభవాదులు సైతం భారతజాతి వైభవయాత్రా భాగాలు. బహువిధ అరిష్టాలను భస్మీపటలం చేసే, సుఖశాంతి ప్రకాశికలను ఊరూరా వాడవాడలా ప్రసాదించే సంక్రాంతి లక్ష్మి మనందరి పాలవెల్లి, కల్పవల్లి. ఇదంతా సకల జనుల శ్రేయస్సునూ కోరి ఆవరించే ప్రకృతి ఆరాధనోత్సవం. పౌష్య లక్ష్మీపూజతో ఇల్లంతా భోగభాగ్యాలమయం కావాలన్న శుభకామనోత్సాహ నిలయం. అత్యాధునిక జీవనవేగం కొనితెచ్చిన కామ క్రోధ లోభ మద మోహ మాత్సర్యాలను సత్య శివశాంతి సుందరాదులు నిండిన ప్రేమతో క్షాళన చేయాలన్నదే ఈ పండుగ అర్థం – పరమార్థం. జాషువా కవి అభిలషించినట్లు 'చలితో రేగిన రోగబీజముల దోషం బెల్ల నీ భోగిమం / టలతో దగ్ధము చేసి జీవితపు తోటల్ శుద్ధి గావించి, రా/ గల సంవత్సరమెల్ల దేశమున సౌఖ్యశ్రీలు వర్షించి, ని / ర్మల ధీశక్తులొసంగుమమ్మ! శుభసంక్రాంతీ! దిగంతంబులన్'. మాలిన్యం మలగిపోవ, మాత్సర్యం కరగిపోవ, దౌర్భాగ్యం తొలగిపోవ, చీకట్లవి చెదిరిపోవ ప్రతి వ్యక్తీ తన శక్తికొద్దీ సాగించే యత్నాలే కదా ఈ వాడుక వేడుకలన్నీ!

దివినంతా రవిదీప్తి నిండేలా భువినిండా మానవత పండేలా ఐక్యత సమగ్రతలిచ్చే సంబరం ఇది. విజ్ఞాన వివేక వికాసత్రయాన్ని రంగరించి జాతి మత కుల ప్రాంత వర్ణ వర్గాదులకు అతీతమైన స్ఫూర్తి దీప్తులనందించే జనజాతరా ఇదే. దీని విలక్షణత ఎంత సర్వసంపన్నమంటే 'వినుము ధనములు రెండు తెరగులు / ఒకటి మట్టిన పుట్టినది. వేరొకటి హృత్ కమలంపు సౌరభంబు (గురజాడ కవీంద్రుడు)'. అవి సంస్కృతీ సంప్రదాయాలే. పంటధాన్యాలూ పల్లెటూళ్ళే సంకురాతిరికి అసలు సిసలైన శాశ్వత చిరునామాలు. వారూవీరన్న అంతరమేదీ లేకుండా అందరినీ ఒక్కుమ్మడిగా కలగలిపి నిలిపేవే ఈ అన్నివిధానాలూ. ఎంతటి మట్టివాసననైనా బిగబట్టి పట్టి చూపించే అనుభూతి మాధుర్యానికి పతాక, ప్రతీక సంక్రాంతే! నిర్వహణలో ఇంకెంత వైవిధ్యముందో ఉదాహరణ సహితంగా తెలుసుకుందాం. నెలపట్టడం, ముంగిళ్ళలో సందళ్ళు రేపడంగా దీన్ని తెలుగువారు భావిస్తారు. సంవత్సరమంతా ఇళ్ళలో పేరుకుపోయిన వ్యర్థాలతో వేకువవేళ భోగిమంట. ఆ రోజునే పసివాళ్ళకు భోగిపళ్ళు, పిన్నలతో పాటు పెద్దలనీ మురిపించి, మైమరపించేలా బొమ్మలకొలువులు, పసందైన విందుభోజనాలు, అటు తర్వాత పోటీలూ, పందేల కోలాహలం. నగరవీధులు బోసిపోయినా పల్లెసీమల్లో కిలకిలలూ కళకళలూ. బతుకు పచ్చదనాన్ని ఆశగా శ్వాసించడానికే పట్టణాల నుంచి గ్రామాలకు వరస ప్రయాణాలు. కాలప్రవాహంలో పరుగుల ఉరవడిలో మనుషుల నడిమధ్యన నిట్టనిలువునా లేస్తున్న అడ్డుగోడలను ఒక్కపెట్టున కుప్పకూల్చే మంత్రశక్తి ఈ తిరణాలకే ఉంది.

విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రాంతంలోని ఇటకర్ల పల్లిలో సంక్రాంతిని కొన్ని కుటుంబాలు తొమ్మిదిరోజులు చేసుకుంటాయి. భోగికి ముందుగా వచ్చే రోజుల్లోనే సంబరాలు ఆరంభిస్తారు. ఎవరు ఎక్కడ ఉన్నా ఆ రోజుల్లో స్వస్థలానికి చేరి పెద్దలను గౌరవించుకుంటారు. అక్కడివారికి అది నవరాత్రి ఉత్సవ సంరంభం. చిత్తూరుజిల్లా బంగారుపాళ్యం సమీపంలోని ఓ ఊరిపేరు సంక్రాంతి పల్లె. అక్కడున్న వారిలో పలువురి ఇంటిపేరు 'కోడి'! అందుకేనేమో కోళ్ళను పెంచి పందేలకు దిగుతుంటారు. పండుగ మూడురోజులూ ఇళ్లదగ్గరే ఆటపాటా. కృష్ణాజిల్లా గుడివాడ పరిసరాల్లో ఎడ్లతో బండలాగుడు పోటీలు



జరుపుతుంటారు. బలప్రదర్శనకే పెద్దపీట. కోనసీమలో కోడిపందేలకు తోడు ప్రభల వేడుకలకు తండోపతండాలుగా చేరుకుంటారు. రాజమహేంద్రవరం, తదితర ప్రాంతాల్లో భోగిదండల విక్రయాలెక్కువ. పిడకల్ని అట్టల్లో ఉంచి అమ్మకానికి పెట్టడం కాలపరిణామం. చేత చిరుతలు వాయిస్తూ దైవ సంకీర్తన చేస్తూ ఇంటింటికీ తిరిగే హరిదాసులు ఇప్పటికీ మరికొన్ని చోట్ల కనిపిస్తూనే ఉంటారు. గుంటూరుజిల్లాలోని కొన్ని పల్లెటూళ్ళలో పొట్టేళ్ళ పందేలతో ఒకటే సందడి. ఈడుపుగల్లు, గొడవర్రు గ్రామాల్లో పోటీలకు హైదరాబాద్‌తో పాటు ఇతరత్రా తొమ్మిది రాష్ట్రాలనుంచి పొట్టేళ్ళు రావడం మునుపటి ముచ్చట. రెండేళ్ళనాటి పందేల్లో కర్ణాటక పోటీదారు ప్రథమస్థానంలో నిలిచింది (మరో ముఖ్యాంశం : మకర సంక్రాంతి తరుణంలో ఎడ్లను మంటల్లోకి దూకించి పరుగులు తీయించే క్రీడోత్సాహం నేటికీ కర్ణాటకలో కనిపిస్తుంది). నెల్లూరుజిల్లాలో రంగవల్లుల కళానైపుణ్యం తొణికిసలాడుతుంటుంది. తూర్పు గోదావరిజిల్లా విలసవిల్లి పరిసరప్రాంతంలో రెండేళ్ళకిందట 750 అడుగులు పైగా భారీ భోగి దండ (గోమయం, ముద్ద కర్పూరం, సాంబ్రాణి సమ్మిళితం) ఊరేగింపు జరిపారు. సంప్రదాయ రీతిలో పడవల పోటీల నిర్వహణకు విజయవాడ పరిసరాల్లోని నాగాయలంక వేదికగా ఉంటోంది. ఇదీ పర్వదిన ప్రాభవ వైభవమే.

గంగిరెద్దుల విన్యాసాలే కాక – హరిదాస, జంగమదేవర, బుడబుక్కల కళాప్రావీణ్యానికి కాణాచి హైదరాబాద్ లోని శిల్పారామం. సత్సంప్రదాయ జానపద కళా రూపాలతో పాటు విభిన్న నృత్యరూపకాలతో ప్రాంగణమంతా తళుకులీనుతూంటుంది. చేనేత హస్త కళాప్రదర్శనలు అదనపు ఆకర్షణలు. అంబరాన్నంటే సంబరంగా పతంగులతో పెరేడ్ మైదానం అలరిస్తుంటుంది. అందులో ఇదివరకు చైనా, ఫ్రాన్స్, వియత్నాం, దక్షిణాఫ్రికా, శ్రీలంక సహా అనేక దేశాల ఔత్సాహికులు పాల్గొన్నారు. నోరూరించి మదిని దోచి మురిపించే తీపి మిఠాయి ఉత్సవంలో పాతిక రాష్ట్రాల నుంచి ప్రతినిధులు భాగస్వామ్యమయ్యారు. కేరళ చపాతీ, అసోం రొట్టె, గుజరాతీ లడ్డూ, ఒడిశా ద్రావణం, తమిళనాడు హల్వా, పంజాబీ పిండిముద్ద మిశ్రమం... ఓహ్ అంతటా తీపిదనమే! రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కొన్నిచోట్ల ప్లాస్టిక్ గాలిపటాలు, రసాయనిక



ముగ్గులు కానవస్తున్నా - పర్యావరణ ప్రేమికులకు, సర్వప్రాణి హితాభిలాషులకు కొదవే లేదు. మన దేశంలోని అనేకానేక ప్రాంతాల్లో పలురకాల పేర్లతో విభిన్న తీరుతెన్నులతో సంక్రాంతి ఉన్నా - ఆ క్రాంతిలో అంతర్లీనంగా నిండిందొక్కటే... ఆశావహ ఆరోగ్యకర మార్పు కోసం సాధన. ప్రకృతి కాంతకు, సమాజ మాతకు సన్నిహిత సర్వం సంక్రాంతి పర్వం.

పుష్యమాసంలో అరుదెంచే సంక్రాంతి శోభ భాగ్యమయం, సౌభాగ్యప్రదం. పుష్యమంటే పోషణ శక్తి కలిగి ఉండటం. పరమాత్మ సంబంధిత అనుభవమే ఆత్మకు భోగం కాబట్టి ఆ రోజు భోగి. వత్సర ఆరంభంలో ఋషులు నిర్వహించే యజ్ఞం భోగభాగ్యదాయకం. అదే యాగంలోని 'హోమాగ్ని ప్రతిరూపమే భోగిమంట' అంటుంది శాస్త్రం. ఆ మంటను ఉత్తరాదిన 'లోడి'గా పిలుస్తారు. తెలుగునాట కొన్ని ప్రదేశాల్లో భోగినాడు గొబ్బి గౌరివ్రతం ఆచరించినట్లే, కర్ణాటకలో 'హళ్ళిరె' పేరిట పిల్లవాళ్ళకు భోగిపళ్ళు పోస్తారు. భోగిమంటలనేవి మహారాష్ట్రలో అంతగా లేకున్నా, సౌభాగ్యవతు లయ్యేలా వనితలు నిర్వర్తించే పూజాదికాలు అత్యంత ప్రత్యేకాలు. సజ్జలు విరివిగా పండేచోట్ల ఆ రొట్టెలకు నువ్వులద్ది స్వీకరించడమూ పండుగ ఆచారమే. చలిని తొలగించి వేడిమిని కలిగించేలా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో దుప్పట్ల, గొంగళ్ళ దానాలూ చేస్తుంటారు. ఇది కూడా సంక్రాంతి సంప్రదాయమే. హరియాణా, పంజాబ్ ప్రాంతీయులు చేసుకునే సంబరం తీరు దాని పేరు (లోహ్రీ) లోనే ప్రస్ఫుటమవుతుంటుంది. లోహ్‌కి అర్థాలు కాంతి, వెచ్చదనం. ఇనుము అనే భావమూ ఉంది. పండుగపూట ఇనుప మూకుళ్ళలోనే కదా పిండివంటలు చేస్తుంటారు! మన సంక్రాంతి వారికి మాఘీ. ముందురోజు వచ్చేదే లోహ్రీ. ఇక భోగిమంటల మాటకొస్తే - మనవాళ్ళు తెల్లవారుజామున, వాళ్ళు సాయంత్రాల్లో వేస్తుంటారు. మనలాగే వారి పాటల వెనకా సూర్యుడు, అగ్నిదేవుడు ఉంటారు కనుక వాటినే ఆలాపిస్తూ గీతనృత్యాలు కొనసాగిస్తారు. వచ్చిన కొత్తపంటతో ప్రత్యేక వంటకాలు చేసుకుంటారు. పవన యజ్ఞం పేరిట మైదానంలో కట్టెలతో మంటలు వేసి చెరకు గడలు, మొక్కజొన్న కండెల్ని అగ్నికి అర్పిస్తారు. ప్రసాదంగా నువ్వులను పంచిపెడుతూ, రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పరవశిస్తారు. తమిళనాట సంక్రాంతిపూట అరటిపిలకలూ

**పుష్యమాసంలో అరుదెంచే సంక్రాంతి శోభ భాగ్యమయం, సౌభాగ్యప్రదం. పుష్యమంటే పోషణ శక్తి కలిగి ఉండటం. పరమాత్మ సంబంధిత అనుభవమే ఆత్మకు భోగం కాబట్టి ఆ రోజు భోగి. వత్సర ఆరంభంలో ఋషులు నిర్వహించే యజ్ఞం భోగభాగ్యదాయకం. అదే యాగంలోని 'హోమాగ్ని ప్రతిరూపమే భోగిమంట' అంటుంది శాస్త్రం.**

చెఱకుముక్కల్ని పూజించి పొంగలి వండుతారు. రాత్రి అన్నం వండాక పాలుపోసి తోడుపెట్టి, మరునాడు కనుమ పండుగకు పొద్దున్నే ఇళ్ళముందు ఆకులు పరిచి మూడేసి ముద్దలు ఉంచుతారు. వాటిని కాకులు ముట్టుకున్న తదుపరి ప్రక్రియగా చిత్రాన్నం, పెరుగన్నం తయారుచేసుకుంటారు.

కర్ణాటకలో పంచదార, బెల్లం, వేరుశెనగ కలిపి వనితలకు పంచడం పరిపాటి. ఆడపిల్లలకు నువ్వులతో పాటు బెల్లం కలిపి పంచిపెట్టడం మహారాష్ట్రీయుల అలవాటు. మలయాళీయులకు సైతం సంక్రాంతి ఒక వ్యవసాయ పర్వదినం (పంటలకు సంబంధించి సజ్జలూ, నువ్వుల రొట్టెలు, పప్పూ, బియ్యం కలగలుపు పులగాల తయారీ తెలుగునాట కొన్ని చోట్ల కనిపిస్తుంటుంది) ముగ్గులతో ఇంటా బయటా అలంకరణ కేరళలోనే కాక రాజస్థాన్, బెంగాల్ ప్రాంతాల్లోనూ పండుగ ప్రసిద్ధి. రంగుల రంగవల్లికలు శుభప్రద సూచికలు – కళా నైపుణ్య ప్రదర్శకాలు. గృహాల లోపల సుద్ద, సున్నాలతో చిత్రీకరణలు. వెలుపల పిండితో రూపచిత్రణలు సంక్రాంతి ప్రత్యేకతలు. వృత్తాలతో పాటే పలు కోణాల ముగ్గులకు పసుపు కుంకుమలనూ వాడటం ఆయా ప్రాంతాల విలక్షణత. చుక్కలు (బిందువులు) పెట్టినా గీతలు (రేఖలు) వేసినా ఆ ముగ్గుల సొగసు సోయగాల చూడతరమా? ఇక సంబర వీరోచిత సంప్రదాయాల గురించి వివరించాలంటే – తమిళనాడు సహా మరికొన్ని ప్రదేశాల్లో జల్లికట్టు(ఎడ్లతో పోరు) ఉండనే ఉంది. మదురై జిల్లా అలంగానల్లూరు పోటీలైతే జగద్విఖ్యాతి.

దానాలకే కాదు, సూర్యారాధనకీ – ప్రఖ్యాతం సంక్రాంతి మహోత్సవం. ఈ విశిష్టత ఒడిశాలో కనువిందు చేస్తుంటుంది. ఇరుగు పొరుగు వివాహితలను సాదరంగా పిలిచి వస్త్రాల ప్రదానం చేయడమన్నది గోవా ప్రాంతంలోనూ అగుపిస్తుంటుంది. దేశంలోని ఎన్నోప్రదేశాల్లో పర్వదిన దేవతార్చనలు, జపతప నిర్వహణలు నాటికీ నేటికీ తరతరాల విధి విధానాలే మరి. నలుగుతో చేసే పుణ్యస్నానాలు వెన్నులోని కుండలినీ శక్తిని ప్రదీప్తం చేస్తాయి. ఎరుపు పూలు, నీళ్ళు కలిపి ప్రభాకరుడి ఎదురుగా నిలబడి సమర్పించే అర్ఘ్యం ఆరోగ్యభాగ్య ప్రదాయకం. చలిమిడి, పానక నివేదనలూ ఆయుర్ వృద్ధి సాధకాలు. తాను తిని తోటివారికి ఇంతో అంతో పెట్టే ఏ వ్యక్తికీ భుక్తికి లోటు ఉండదంటుందీ పండుగ. సంక్రమణ వేళ గోపూజ దృశ్యాలూ వివిధ ప్రాంతాల్లో రివాజు. ఎడ్లను కూడా ఆదరించడం కనుమ సంబర సారాంశం. అదేరోజున గొబ్బెమ్మలు (గోమయ పిండాలు) చుట్టూ తిరుగుతూ దైవగానం చేసేవారిని సంక్రాంతి లక్ష్మి అనుగ్రహిస్తుందని పెద్దల మాట. విద్య ఉద్యోగ వ్యాపారాల కోసం ఇతర దేశాలకు వెళ్ళి ఉంటున్న ప్రవాస భారతీయులకు మరీ ముఖ్యంగా సంక్రాంతి అంటే మక్కువ ఎక్కువ. అందుకే ఈ పండుగ సందడి ఏనాడో ఖండాంతరాలు దాటి అణువణువునా కళాకాంతులు నింపుతోంది. నిజానికిది సర్వకళల సకల శాస్త్రాల మేళవింపు. ఆ కారణంగానే అమెరికా, ఆస్ట్రేలియా సహా ఐరోపా దేశాల్లోని తెలుగు సంఘాలు –



సంస్థలు ఏటా వీటిని అనురక్తితో నిర్వర్తిస్తున్నాయి. పలు రాష్ట్రాల నుంచి విదేశాలకు చేరినవారెందరో అక్కడ సంక్రాంతి నిర్వహణకు ముందువరుసలో ఉంటున్నారు. భారతీయ సంస్కృతీ సుమ సౌరభాలు నలుదిశలా గుబాళించేలా చేస్తున్నారు. వీధులన్నింటినీ విద్యుద్దీపాలతో ధగధగలాడించడం, సాంస్కృతిక వేడుకల ఏర్పాటుతో భారతీయతను గౌరవించుకోవడం.... వారిని చూసే ఎవరైనా నేర్చుకోవాలి. వాడుకగా ఉమ్మడి పండుగగా చేసుకోవడంలో సింగపూర్‌లోని 'లిటిల్ ఇండియా' ప్రాంతం పేరుపొందింది. అక్కడ ఇళ్ళముందూ కార్యాలయ భవనాల ఎదుటా రంగుల ముగ్గులను తీర్చిదిద్దుతారు. పర్వదిన వస్తు సామగ్రితో పాటు చీరలు, గాజులను కాంప్‌బెల్ రోడ్డు ప్రాంతంలో ప్రదర్శనగా ఉంచి విక్రయిస్తుంటారు. మట్టికలశాల్లో పొంగలి వండటం వంటి ఆచారాలను తు.చ. తప్పక పాటిస్తారు.

ఇంతకుముందే మనం అనుకున్నట్లు – దేశమైనా విదేశమే అయినా సంక్రాంతి అంటే భారతీయ ఆత్మ. ఉత్తరప్రదేశ్‌లో 'కిచెరి' అనే పేరున్నా, గుజరాత్‌లో 'ఉత్తరాయణ్'గా పిలుచుకున్నా, అసోంలో "భోగాలి బిహు' అని నామకరణం చేసుకున్నా, కర్ణాటకలో తినుబండారాలను కంచాల్లో ఉంచి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ 'ఎల్లు బిరోదు' అనుకున్నా ఈ అన్నీ సంబరాల్లోని భాగాలే. పువ్వుల తావిలో, పసిబుగ్గల నిగ్గుల్లో, చంటిపాపల చిరునవ్వు మోముల్లో, రసరాగిణి పిల్లనగ్రోవిలో కనిపించి వినిపించే అందాలూ ఆనందాలన్నీ సంక్రాంతిని తలుచుకున్నా అనుభవమవుతాయి. పైడిపంటల భూమాతను, పాడిపంటల గోమాతను సంభావించి ఆరాధించుకునే ఈ పర్వదినం బొండుమల్లెలు గుప్పెడు... చప్పున మన గుండెమీదుగా జారినంత సదానుభూతిమయం, అంతకుమించి మహా అనుభవైక వేద్యం. ఎప్పటికీ ఇది బహు పెద్ద పండుగే!



# గురజాడపై వ్యాసాలు

గురజాడపై వ్యాసాలు

# కన్యాశుల్కంలో గిరీశం



ఆర్.ఎస్.
వెంకటేశ్వరన్

సంస్కృతభాషలో గొప్ప నాటకరచయితలుగా పేరొందిన భాసుడు, భవభూతి, కాళిదాసు నాటకాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని సంస్కృతరచయితల నాటకాలతో సరిపోలుస్తూ గురజాడ వారి కన్యాశుల్కం నాటకమే కాదుపొమ్మన్నారు. అయినాసరే ఈనాటికీ కన్యాశుల్కం పాఠకులు చదువుతూనే వున్నారు. అడపా దడపా దానిగురించి కొత్తకోణాల్లో విశ్లేషిస్తున్నారు. తెలుగు కథాసాహిత్యంలో కాళీపట్నం రామారావుగారు రాసిన "యజ్ఞం" కథ గురించి జరిగిన చర్చ ఏ యితర కథ గురించి జరగలేదు అలాగే కన్యాశుల్కం నాటకం గురించి జరిగినంత విశ్లేషణ, పరిశోధన యింతవరకు ఏ నాటకం గురించి జరుగలేదు. బహుశా జరగదేమో కూడా.

మహాకవి శ్రీశ్రీ కన్యాశుల్కం నాటకం గురించి మాట్లాడుతూ ఆ నాటకంలో జీవితానికి సంబంధించిన ఏ సందర్భానికైనా సరిపోయిన వాక్యాలు వున్నాయని అన్నారు.

కన్యాశుల్కం నాటకం గొప్పతనానికి గల కారణాలు ఎన్నో వున్నాయి. ముఖ్యంగా చెప్పుకోవాల్సిన పాత్ర గిరీశమే. ప్రముఖ సాహితీవిమర్శకుడు ఆర్.ఎస్.సుదర్శనంగారు ఈ పాత్రని విశ్లేషిస్తూ "గిరీశం పాత్రలో హాస్యరసానుభూతి పొందాలంటే నీతి అనే కొలబద్దను తాత్కాలికంగానైనా అవతలపెట్టాలి. అప్పుడే గిరీశం మాటలూ, సమయస్ఫూర్తీ, అతను పొందే విజయాలూ మనకు ఆహ్లాదకరంగా వుంటాయి" అన్నారు.

ప్రొఫెసర్ బ్రాడ్లే మూడు షేక్స్పియర్ నాటకాల్లో కనిపించే ఫాల్ట్స్ ఆఫ్ పాత్రకు చేసిన విశ్లేషణ గిరీశం పాత్రకూ అన్వయించుకోవచ్చు అన్నారు. బహుశా అసంపూర్తిగా వుండిపోయిన గురజాడ నాటకం కొండుభట్టీయంలో కూడా గిరీశంపాత్ర కనిపించడం వలనేమోకానీ ఈ పోలిక సరికాదు.

గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని రాయకముందే బాల్యవివాహాల, విధవా వివాహల గణాంకవివరాలు పరిశీలించిన దాఖలా వుంది. ఆ వివాహాల్లో తలెత్తే సమస్యల గురించి అవగాహన వుంది. రాచమల్లు రామచంద్రారెడ్డిగారు కన్యాశుల్కం నాటకం గురించి రాస్తూ పైసమస్యలపై గురజాడకు వున్నంత అవగాహన ఆనాటి

"I wrote it to advance the cause of social reform and to combat a popular prejudice that the Telugu language was unsuited to the stage"

–***Gurajada***



సంఘసంస్కర్తలకి కూడా లేదేమో అన్నారు. అంతేకాదు వీరేశలింగం వంటివారు చేపట్టిన వితంతు వివాహఉద్యమం మంచిదైనా ఆచరణలో ఊహించినంత సత్ఫలితాలు యివ్వకపోవడం వలన గురజాడకు అసంతృప్తి ఏర్పడివుంటుందని అభిప్రాయపడ్డారు. ఆ ఉద్యమంలో గిరీశంలాంటి వ్యక్తులను గమనించాకే ఆ పాత్ర సృష్టి గురజాడ చేసివుంటారు. కన్యాశుల్కం తొలికూర్పు మలికూర్పుల మధ్య పన్నెండు సంవత్సరాల వ్యవధి వుంది. తొలికూర్పు ముందుమాటలో...

"I wrote it to advance the cause of social reform and to combat a popular prejudice that the Telugu language was unsuited to the stage" అని తన ఉద్దేశం స్పష్టంగా గురజాడవారు తెలిపారు.

## తొలికూర్పులో గిరీశం పాత్ర:

విజయనగరంలో ట్యూషన్లు చెబుతూ సంపాదనతో పూటకూళ్ళమ్మ భోజనం, వేశ్య మహాలక్ష్మిని వుంచుకోవడం, దానితో ఫొటోలు దిగాక ఫొటోగ్రాఫరుకు డబ్బులు చెల్లించలేక శిష్యుడు వెంకటేశంతో కృష్ణరాయపురం అగ్రహారం చేరుకుంటాడు. ఆంగ్లభాషాప్రవీణుడనని అగ్నిహోత్రావధానులను భ్రమింపజేసి, కోర్టువ్యవహారాలు తెలుసని నమ్మించడం, విధవావివాహం శాస్త్రసమ్మతమని బుచ్చమ్మని నమ్మించటం, కోర్టువ్యవహారం సందర్భంగా విశాఖలో సౌజన్యారావుని కలుసుకోవటం, అక్కడే లుబ్ధావధానుల్ని కలిసి ఆస్తి దక్కించుకోవాలని విఫలం కావడం, అబద్ధాలాడి సౌజన్యారావు అభిమానం కోల్పోవడం, బుచ్చమ్మతో పెళ్ళి తప్పిపోవడం, గిరీశం కంటబడితే తలలు పగుల్తాయని తనని చదువుకోమని సౌజన్యారావు రాజమహేంద్రవరం పంపడం, దానితో "డామిట్" వ్యవహారం అడ్డంతిరిగిందని గిరీశం నిష్క్రమించడంతో పాత్ర ముగుస్తుంది.

## మలికూర్పులో గిరీశం :.

మలికూర్పులో గిరీశం ఆంగ్లవిద్యావిధానంలో చదువుకున్నా డిగ్రీ లేనివాడు. కానీ వచ్చిన ఆంగ్లంతోనే తనతో మాట్లాడ్డమే ఓ "ఎడ్యుకేషన్" అని అందరినీ బోల్తా

కొట్టించగల చతురుడు. శిష్యుడు వెంకటేశం అమాయకత్వాన్ని ఆధారం చేసుకుని అప్పుల బారినించి తప్పించుకోవడానికేకాక "కంట్రీలైఫ్" హాయిగా అనుభవించవచ్చని ఎత్తుగడ వేస్తాడు. గిరీశానికి వచ్చిన ఆంగ్లభాషముక్కలకే భ్రమపడి తనకు అల్లుడైతే బాగుండేది అని అగ్నిహోత్రావధానులను అనుకునేలా ప్రవర్తిస్తాడు. ఓ పక్క కన్యాశుల్కం, బాల్యవివాహాలని అగ్నిహోత్రావధాన్లముందు సమర్ధిస్తూ మరోపక్క బుచ్చమ్మ అందానికి మోహితుడై ఆస్తినీ ఆశిస్తూ విధవలు పునఃవివాహం శాస్త్రసమ్మతమేనని నమ్మిస్తాడు.

పాశ్చాత్యరచయితల పేర్లూ, వేదాలూ తెలిసినట్లుగా మాటలమధ్యలో చెబుతాడు. ఇతరులను బోల్తా కొట్టించడానికి ఆంగ్లపదాలు తరచుగా వాడతాడు. ఆనాడు జరుగుతున్న సంస్కరణోద్యమాల గురించి, జాతీయఉద్యమాల గురించి చెబుతాడు. వాస్తవానికి వాటిపైన తనకు ఏ విధమైన విశ్వాసం లేదు.

గురజాడగారు ఒక బెంగాలీ మిత్రునికి రాసిన అసంపూర్తి వుత్తరంలో గిరీశంలాంటి వ్యక్తుల గురించి రాస్తూ యిలా అంటారు. "కొందరు పాశ్చాత్యభావాలు మూలతత్వాన్ని సరిగ్గా అర్థంచేసుకోవడం లేదు. వస్తువుల బాహ్యస్వరూప మిడిమిడిజ్ఞానంతో తాము విద్యాసంపన్నులమనుకుంటున్నారు. సంస్కృతిపరులమని అనుకుంటున్న భారతీయులలో చాలామంది ఇంతేనని నా నమ్మకం." అయితే గిరీశం వ్యక్తిగతంగా ఎటువంటి మూఢనమ్మకాలు లేనివాడు. బాల్యవివాహాలు, కన్యాశుల్కం దురాచారాలని సమయానుగుణంగా వాటిని సమర్థించడమో ఖండించడమో తెలిసిన నేర్పరి. ఆ నేర్పుతోనే అగ్నిహోత్రావధానుల్నీ బుచ్చమ్మనూ బుట్టలోవేసుకోగలుగుతాడు. అలా అని మూఢవిశ్వాసాలకు గిరీశం ప్రతీకా కాడు. ఓటమిని ఎదుర్కొనలేడు. అందువలనే పూటకూళ్ళమ్మకు డబ్బులు యివ్వలేక విజయనగరం నించి శిష్యుడు వెంకటేశంతో ఉడాయిస్తాడు. ఫోటోగ్రాఫర్ పంతులుకి డబ్బులివ్వలేక చెవుడు నటిస్తాడు. మధురవాణిని పోషించలేక వదిలించుకుంటాడు. బుచ్చమ్మ కూడా తన మాటలకు పూర్తిగా పడి పోలేదని గ్రహించి నూతిలో పడిన వెంకమ్మని కాపాడి బుచ్చమ్మ హృదయంలో స్థానం సంపాదించుకుంటాడు. మిడిమిడి ఆంగ్లభాషాభేషజంతో అగ్నిహోత్రావధానుల్ని పడేస్తాడు.

గిరీశం పూర్తిగా చెడ్డవాడూ కాదు. ప్రతీ మనిషీ నూరుశాతం మంచివాడూ కాలేడు నూరు శాతం చెడ్డవాడూ కాలేడు. ఎంతో కొంత రెండు గుణాలూ ప్రతీమనిషిలో కలగలిసే వుంటాయని గురజాడవారు భావించారు కనుకనే సుబ్బిని లుబ్ధావధానుల కిచ్చి వివాహం చేయబోతున్నారని తెలియగానే రెండుతావుల ఆకాశరామన్నవుత్తరం గిరీశం రాశాడని చిత్రించారు. అయితే ఆ కాస్త చూపిన మంచితనాన్నీ తనకు ఉపయోగపడేలా మలుచుకుంటాడు. అప్పటికీ బుచ్చమ్మ తనతో రావడానికి పూర్తిగా సమ్మతించకపోయేసరికి, తనతో లేచిపోతే చెల్లెలి పెళ్ళి ఆగిపోవటం ఖాయమని దస్సా

విసురుతాడు. అప్పుడుగానీ బుచ్చమ్మ తనతో లేచిపోవడానికి సరే అనదు.

సౌజన్యారావు ముందు అబద్ధాలు చెప్పి కట్టిన పేకమేడలు అక్కడ మధురవాణి ఎదురైతే కుప్పకూలుతాయని గిరీశం ఊహించడు. ఎందుకంటే అబద్దాలాడి పబ్బం గడపడం తన నైజం. తను పూర్తిగా పట్టుబడీ అందరిముందు తనేంటో యిక దాచడం కుదరదు అన్న గ్రహింపు వచ్చాకే "డామిట్ కథ అడ్డం తిరిగింది" అనుకుంటాడు. అయితే మలికూర్పులో సౌజన్యారావు గిరీశంతో నువ్వు బుద్ధిగా డిగ్రీ పూర్తి చేస్తే బుచ్చమ్మతో పెళ్ళిజరిగేలా చూస్తానని చదువుకోడానికి పంపిస్తాడు. ఇది గిరీశం ప్రవృత్తికి విరుద్ధమైనా గురజాడ గిరీశంలాంటి వ్యక్తి మారే అవకాశమూ వుందనే అలా ఆ పాత్ర ముగించారనిపిస్తుంది.

## మలికూర్పులో గిరీశం పాత్ర విశిష్టతలు:

1) గిరీశం కన్యాశుల్కం నాటకంలో అన్నిపాత్రలతో ఒకసారైనా ఎదురెదురుగా రావడం జరుగుతుంది.
2) నాటకంలో వున్న అన్ని పాత్రల గుణగణాలూ గిరీశంలో కనిపిస్తాయి.
3) పాశ్చాత్యనాగరికతా ప్రభావానికి గురైనా అవసరమైతే అభివృద్ధినిరోధక భావనలను సమర్థించడానికి వెనుకాడని ద్వంద్వప్రవృత్తి మరింత స్పష్టంగా కనిపిస్తుంది.
4) తొలికూర్పుకీ మలికూర్పుకీ గిరీశం వాగ్ధాటీ, కవిత్వచాతుర్యం కూడా వటు డింతింతై అన్నంతగా పెరిగింది.

అయితే మధురవాణిపాత్ర కూడా మలికూర్పులో అంతగానూ పెరిగింది అందుకే కేవీ. రమణారెడ్డిగారు గురజాడ రచనలపై రాసిన "మహోదయం" లో ఈ రెండు పాత్రల గురించి "మరలో నుంచి బయల్పడ్డ వస్తువులాగా ఒక్కపెట్టున అప్పారావు 'మనఃకార్మికశాల" నుంచి తయారై రాలేదు" అంటారు.

అబద్ధాలు చెబుతూ, లేని జ్ఞానం వున్నట్టు నటిస్తూ, అందరినీ మోసగిస్తూ జీవనం సాగించే గిరీశం పాత్ర పాఠకులను యింత సమ్మోహపరచడానికిగల ముఖ్యకారణాలు రెండు. మొదటిది గిరీశం మోసగాడేకానీ హానితలపెట్టేవాడు కాకపోవడం. ఇది సాధారణంగా మధ్యతరగతి ప్రజల్లోవుండే మనస్తత్వం. రెండవది గిరీశం హాస్యప్రవృత్తి.

అందువలనే పాత్రల గుణగణాలు ప్రవర్తన దృష్ట్యా కాకపోయినా మహాభారతమంటే కర్ణుడి పాత్ర గుర్తొచ్చినట్లు కన్యాశుల్కమంటే గుర్తుకొచ్చేది గిరీశమే. అందుకే శ్రీశ్రీ శూద్రకుని "మృచ్ఛకటికం" తర్వాత అంత గొప్ప నాటకం తెలుగుసాహిత్యంలో వచ్చిన "కన్యాశుల్కం" అంటారు.

★ ★ ★

గురజాడపై వ్యాసాలు

# ఆలోచనల దారిలో..

## గురజాడ వెలుగు జాడలు

శ్రీనివాస రాజు
పెన్మెత్స
Ph: 9550 981 531

"కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి జేరెను మేని పసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా"
---మహాకవి గురజాడ

రెండు విలక్షణమైన ఆలోచనలలోని మంచిని ఒక చోట చూసినప్పుడు, అది...మన హృదయాంతరాల వెనుక అంతఃచేతనలోని లాలిత్యాన్ని తాకి, సున్నితమైన ఆత్మ ఔన్నత్యాన్ని జాగృతం చేసి, రహస్యంగా దాగిన వేదనలను క్షాళన చేసి అపురూపమైన మానవీయ పరిమళం వైపుకు మనల్ని నడిపించే... ఆ అక్షర సుగంధాన్ని మనమందరం గుర్తించగలమా?!

ఏది వైయక్తికం, ఏది సామూహికం? వైయక్తికంలోని విషాదం లేదా చైతన్యం విరాట్ రూపంతో తన బాహువులను విస్తృత పరచినప్పుడు లోకం కదులుతుంది. ఒక్కోసారి భూగోళపు సరిహద్దులు కూడా చెరిపివేయబడి, మనోనేత్రం విశ్వాంత రాళంలోని రహస్యాలను వెతికే దిక్కువైపుకు వికాసం చెందుతుంది. మహాకవి గురజాడ ఒక సాహితీకారుడిగా, సంఘసంస్కర్తగా, అభ్యుదయ కవిగా సరిగ్గా అదే పని చేశాడు.

1862 లో కౌసల్యమ్మ మళ్లీ రాముడికి జన్మనిచ్చింది. రాయవరం గ్రామం, విశాఖ సముద్రం, కళింగ రాజ్యం, గజపతి రాజులు, తెలుగు నాటకం....అన్నీ యుగ పురుషుడి కోసం ఎదురు చూశాయి.

మధురవాణి కళ్ళల్లో తడి. తన హృదయ ఔన్నత్యం లోకానికి తెలుస్తోంది అనే సంతోషంతో. గిరీశం ఎలాగూ కంగారు పడతాడు మనకు తెలుసు. It is the women that seduce all mankind అని ఇకపై అంత తేలిగ్గా అనలేడుగా! రామప్ప పంతులు, పూటకూళ్లమ్మ, లుబ్ధావధానులు... కళ్లు తిప్పి అటుచూశారు.

లోకం అంతా సౌజన్యరావులతో నిండే ఒక రోజు వస్తుంది అని లోకం అంతా ఎదురు చూసిన పుట్టుక అది.

యువతరం ఆలోచనల దారిలో గురజాడ వెలుగు జాడలు ఎన్ని ఉన్నాయని చూస్తే...., చాలా మంది పేరు తెలుసు అన్నారు. ఇంకొందరు... "దేశమంటే మట్టి కాదు" అన్నాడు కదా, తలపాగా, మీసం ఆయనే కదా! అన్నారు...

నేటి యువతరం ఎక్కువగా వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదువుతోంది! జీవితంలో తొందరగా ఏం సాధించాలి. అమెరికా వెళ్లాలి, సముద్రాన్ని ఈదాలి, ఎవరెస్ట్ ఎక్కాలి.... అత్యంత ధనవంతుడుగా మారాలి.....

చూద్దాం, ప్రపంచ జాతీయ గీతాన్ని అందించిన గురజాడ ఎన్నో తరాలకు ప్రతినిధి! అతని దిద్దుబాటు ఎన్నో కుదుపులతో అద్భుత సర్దుబాటులను లోకంలో చేస్తుంది.

ఇదిగో 1896 లోని "ప్రకాశిక" కొత్త కాంతులు అద్దుకుని మళ్లీ ఉదయిస్తోంది!

రాముడు ధర్మం కోసం నిలబడితే..., వేంకట అప్పారావు తన అక్షరాలతో ధర్మరాజ్యం రావాలని ఆకాంక్షించాడు.

ఆ ఆలోచనల దారిలో వెలుగు జాడలు మళ్లీ మళ్లీ వెతుక్కుందాం, మన కోసం.

> రాముడు ధర్మం కోసం నిలబడితే..., వేంకట అప్పారావు తన అక్షరాలతో ధర్మరాజ్యం రావాలని ఆకాంక్షించాడు. ఆ ఆలోచనల దారిలో వెలుగు జాడలు మళ్లీ మళ్లీ వెతుక్కుందాం, మన కోసం.

"ఆకులందున అణగి మణగీ
కవిత కోయిల పలక వలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్త వలెనోయి"

తెలుగు ప్రజల అదృష్టం కాదూ ఈ కవిత్వం చదవడం!?

మనం ఎన్నుకునే ప్రధానాంశాల (product of the choices we make) మిశ్రమంగా మన ఉన్నత వ్యక్తిత్వం రూపాంతరం చెందుతుంది. అలాగే దృక్పథం(Attitude), ప్రేమ, దయాగుణం, సామాజిక బాధ్యత గురించి ఆలోచనలు కూడా.

యువతరం గురజాడను వెతుక్కుని అభ్యుదయం వైపుకు నడిచి తీరుతుంది! శ్రీశ్రీ, వేమన, గురజాడ, మహాకవి పోతన అన్నీ చదివి..."తుదనలోకంబగు పెంజీకటి కవ్వల..." వెలుగు జాడలు ప్రసరించే వైతాళికులై ముందుకే నడుస్తారు. ముత్యాల సరాలతో వజ్రాల హారాన్ని కట్టగలరు.

అవును, కృష్ణశాస్త్రిగారు, "గురజాడ 1915 లో చనిపోలేదు, అప్పుడే అతను జీవించడం ప్రారంభించాడు" అన్నారు కదా.

ఇదిగో "ప్రకాశిక" మళ్లీ సాక్ష్యమై నిలవబోతోంది!

★ ★ ★

**గురజాడపై వ్యాసాలు**

## గురజాడ రచనలపై పరిశోధన


# నా అనుభవాలు–జ్ఞాపకాలు



డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

1985–90ల మధ్యలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం లో తెలుగు శాఖలో గురజాడవారి రచనలపై ఎం.ఫిల్., పిహెచ్.డి. లకై పరిశోధనలో చేరాను. పర్యవేక్షకులు ప్రొఫెసర్ పి.సి. నరసింహా రెడ్డి గారు. చేరిన వెంటనే వారు గురజాడ అప్పారావు రచనలన్నీ పరిశోధనా దృష్టి తో క్షుణ్ణంగా చదవమన్నారు. అర్థంచేసుకోమన్నారు. తరువాతనే గురజాడపై వచ్చిన వ్యాసాలు, పుస్తకాలు చదవాలనిచెప్పారు. నేను రచనలు చదువుతుండగానే, మా సర్ గురజాడ పుట్టిపెరిగిన, ఉద్యోగం చేసిన ప్రదేశాలన్నీ చూసి రమ్మని చెప్పారు. ఎక్కడకీ ఒంటరిగా వెళ్ళటం, ప్రయాణాలు చెయ్యటం అలవాటు లేని నన్ను మా ఇంట్లో తిరుపతి నుంచి విజయనగరం, అంత దూరం వద్దన్నారు. నాకేమో తప్పకుండా వెళ్ళాలనుంది. మొత్తం మీద ఒప్పించి, ప్రయాణమయ్యాను.

ఆరోజుల్లో, 1985లో, మా లాంటి అతిదిగువ మధ్యతరగతి కుటుంబాలకు లాండ్ ఫోన్ తెలియదు. ఉత్తరాలే ప్రసారమాధ్యమాలు! తిరుపతిలో మాకు తెలిసిన వాళ్లకు విజయనగరంలో దూరపు బంధువులుంటే వాళ్ల అడ్రస్ తీసుకుని వాళ్ళింటికి వెళ్ళాను. ఆమె యమున. ప్రభుత్వ పాఠశాలలో టీచర్. నా పనులయ్యేదాకా వాళ్ళింట్లోనే ఉన్నాను. చాలా బాగా సహాయం చేశారు నాకు.



మొదట, గురజాడ అప్పారావు గారు పుట్టిన విశాఖ జిల్లా యలమంచిలి తాలూకా రాయవరం ఊరికి వెళ్ళాను. మాతామహులు గొడవర్తి కృష్ణయ్య గారింట అప్పారావు గారు 1862 సెప్టెంబర్ 21 న జన్మించారు. వెంకట రామదాసు,కౌసల్యమ్మ తల్లిదండ్రులు. కృష్ణయ్య గారు రాయవరం జిల్లా మున్సిఫ్ కోర్టులో శిరస్తదారుగా చేశారు. అప్పారావు గారు సెలవుల్లో తాతగారింటికి వెళ్ళినప్పుడు ఒకసారి, తోటిపిల్లలతో కోర్టుకి వెళ్లారట. కోర్టు హాలు తలుపుపై జి. వి. అప్పారావు బి ఏ. బి. ఎల్. డిస్ట్రిక్ట్ మున్సిఫ్ అని రాశారుట. మర్నాడు మున్సిఫ్ గారు చూసి ఎవరు

రాశారు ఇది అని అడిగితే కృష్ణయ్య గారు తన మనవడే అయి వుంటాడని అప్పారావుగారిని పిలిపించారుట. అప్పారావుగారు తనే అలా రాశానని చెపితే మున్సిఫ్ గారు ఆ ధైర్యాన్ని మెచ్చుకున్నారట. ఆ కోర్టు, రాయవరం గ్రామ వీధుల ఫోటోలు థీసిస్‌లో పెట్టాను. రాయవరం లో గురజాడ స్మారక గ్రంథాలయం ఉంది. అందులో వారి నిలువెత్తు విగ్రహాలు రెండు హుందాగా ఉన్నాయి.నేను ఒకసారి, రాయవరం, విజయనగరం, విశాఖపట్టణాలలో అవసరమైనవి చూసేశాక, తిరుపతినుంచి మా కుటుంబ మిత్రుడు, సోదరతుల్యుడు చిత్రపు హనుమంతరావు సొంత కెమెరాతో వచ్చి గురజాడకు సంబంధించిన ఫోటోలన్నీ తీశాడు.

విజయనగరంలో గురజాడవారు చదువుకున్న, చదువు చెప్పిన మహారాజా కళాశాలలో అడుగు పెట్టినప్పుడు నా ఆనందం మాటలలో వర్ణించలేనిది. కాలేజి అంతా తిరిగి చూశాను. అక్కడ కొందరు లెక్చరర్లతో మాట్లాడాను. ఫోటోలు తీసుకున్నాను. విజయనగరంలో గురజాడ అప్పారావుగారింటికి వెళ్ళాను. ఆ ఇంట్లో వారి వంశీయులే ఉన్నారప్పుడు. పేర్లు గుర్తుకు రావట్లేదు. ఇల్లంతా చూపించారు. అప్పారావుగారు చదువుకునే గది చూసి పులకించిపోయాను. ఎందుకంటే, వారు ఎన్నో పుస్తకాలు చదివారు. పుస్తకాలను చదివేటప్పుడు అందులోనే పక్కన మార్జినల్ నోట్స్ రాసుకునేవారు. ఒక పుస్తకాన్ని ఎలా చదవాలో వారు చదివే పద్ధతి నుండి గ్రహించాను. అది నేటియువతకూ పాఠమే. పఠనం, పరిశీలనం రెండు అవసరమని వారు చెప్పిన మాటలు ఎప్పటికీ అందరికీ అనుసరణీయమైనవి.

గురజాడ అప్పారావు గారు ప్రతి చిన్నవిషయాన్ని నిశితంగా పరిశీలించేవారు. ద్రౌపది వస్త్రాపహరణం, ప్రహ్లాద, శకుంతలవంటి నాటక ప్రదర్శనలను చూసినప్పుడు వాటిపై రాసుకున్న అభిప్రాయాలు వారి సునిశిత పరిశీలనా శక్తిని వ్యక్తం చేస్తాయి. కన్యాశుల్కం తొలి కూర్పు రచన తర్వాత నాటక ప్రదర్శనలు చూడటమే కాక, నాటక సాహిత్యం విస్తృతంగా చదివారు.

విజయనగరంలో వసంతరావు బ్రహ్మాజీరావు గారి కుమారుడు ధాతారావు గారున్నారు. వారి ఇంట్లో గురజాడ వారి పుస్తకాల బీరువా ఉంది. అందులో పుస్తకాలన్నీ పట్టికగా రాసుకున్నాను. అనేక విభాగాల పుస్తకాలు! వాటిలో గురజాడ వారు పేజీలలో పక్కన స్వదస్తూరీతో రాసుకున్న అభిప్రాయాలు! వారు స్వయంగా చేతులతో పట్టుకుని చదివిన పుస్తకాలవి! వాటిని చూస్తుంటే ఎంతో ఆనందం కలిగింది. గురజాడ వారు చదివిన పుస్తకాలలో ప్రాచ్య, పాశ్చాత్య గ్రంథాలు, ఇంగ్లీష్ ఫిక్షన్ కథలు, అలంకార శాస్త్ర గ్రంథాలు, శైలికి, అనువాద విధానానికి సంబంధించిన గ్రంథాలు, వ్యాకరణాలు, చరిత్ర, మనస్తత్వ, సామాజికశాస్త్రాలు, విద్యా విధానానికి సంబంధించినవి, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు ఎలా ఏర్పడతాయో తెలిపే గ్రంథాలు, నాటక సాహిత్యం, ఇలా భిన్న అధ్యయన రంగాలకు సంబంధించిన గ్రంథాలున్నాయి. ఆ పట్టికనంతా నా థీసిస్‌లో ఇచ్చాను. ధాతారావు

గారింట్లో గురజాడ అప్పారావు గారు ఉపయోగించిన టేబుల్ ఉంది. దానిని కూడా ఫోటో తీసుకున్నాం. నాకు ఆ టేబుల్ చాలా అపురూపంగా కనిపించింది. "సర్, నాకు ఇచ్చేయండి, తీసుకెళ్తాను" అనడిగాను. ఆయన నవ్వేసి, నీలాంటి భావి పరిశోధకులు ఎందరో వీటిని చూడటానికి వస్తారు. ఇవి గురజాడ వారు మనకు వదిలి వెళ్ళిన సంపద, అన్నారు . నిజమే కదా! వసంతరావు బ్రహ్మాజీరావు గారు రచించిన గురజాడ జీవితచరిత్ర రాతప్రతి ఒకటి ధాతారావు గారు చూపించారు. పరిశోధనలో రాత ప్రతులకు విలువెక్కువని మా పి.సి. నరసింహారెడ్డి సర్ చెప్పారు. అందులో నుంచి కొన్నివాక్యాలు రాసుకున్నాను.అప్పటికి అది అచ్చు కాలేదు. తరువాత అయిందో, లేదో నాకు తెలియదు. గురజాడ వారికి పుస్తకాలంటే చాలా ఇష్టం. వాళ్ళ నాన్నగారు అప్పుడప్పుడు ఇచ్చే డబ్బులతో విజయనగరం గంటస్తంభం దగ్గర అమ్మే సెకండ్ హాండ్ పుస్తకాలు కొని చదివేవారు. ఆ గంట స్తంభం ఫోటో కూడా తీసుకున్నాను. ఆ సమయంలోనే విజయనగరంలో గురజాడ స్మారక గ్రంథాలయం నిర్మాణం జరుగుతోంది. కూలీలు పనిచేస్తున్నారక్కడ. అది కూడా ఫోటో తీసుకున్నాను. 1985 లోనే "అస్తమించని సూర్యుడు" గురజాడ జీవితచరిత్ర డాక్యుమెంటరీ చిత్రీకరణ జరిగింది. అబ్బూరి గోపాలకృష్ణ గారు కథను సమకూర్చారు. సుగమ్ బాబు దర్శకత్వం. అందులో లెక్చరర్ గురజాడ అప్పారావుగా వారి మునిమనవడు ప్రసాద్ నటించారని, మిగతా పాత్రధారుల వివరాలతో ఓ వారపత్రికలో సమాచారం వచ్చింది. అది కూడా నా దగ్గర ఉంది. కన్యాశుల్కంలోని బొంకుల దిబ్బను కూడా చూశాను. విజయనగరంలో, విశాఖపట్నంలో గురజాడ విగ్రహాలు ఫోటోలు తీసుకున్నాను.

విశాఖపట్నంలో గురజాడ రవీంద్రుడు గారు, అప్పారావు గారి మునిమనవడు, గురజాడ వారి కళ్ళజోడును చూపించారు. అంతేకాదు, రవీంద్రుడుగారు రెండు అపురూపమైన ఫోటోలు తరవాత పోస్టులో నాకు పంపారు. ఒక ఫొటోలో, అప్పారావు గారి కుమారుడు రామదాసుగారు, ఆయన కుమారుడు శ్యామలరావు గారు, కోడలు సుగుణమ్మ గారు, రామదాసు గారి చెల్లెలు కొండాయమ్మ గారు, కుమార్తె శకుంతలమ్మ వున్నారు. ఇంకో ఫొటోలో రామదాసుగారు,పక్కన రవీంద్రుడు గారు, శ్యామలరావు గారు ఉన్నారు. అంతే కాక, రవీంద్రుడు గారు గురజాడ అప్పారావు గారి తరవాతి తరాల వారి గురించి మనుమలు, మునిమనుమలు పేర్లతో, వరసలతో వివరణాత్మక మైన సమాచారాన్ని ఇచ్చి గురజాడ వంశవృక్షాన్ని రూపొందించడానికి పూర్తి సహకారాన్ని ఇచ్చారు. ఎంతో ఓపికగా వివరాలన్నీ ఉత్తరంలో రాశారు. వారు నా క్షేత్ర పర్యటన (field work)అయి తిరుపతికి వచ్చేశాక ఈ లేఖ రాశారు. అది నా దగ్గర ఉంది.

విశాఖపట్నంలో అబ్బూరి గోపాలకృష్ణ గారు కన్యాశుల్క నాటక ప్రదర్శనల గురించి చాలా విలువైన విషయాలు చెప్పారు. రాజమండ్రిలో గౌతమి గ్రంథాలయంలో ఎన్నో పాత దిన పత్రికలలో గురజాడకు సంబంధించిన సమాచారాన్ని సేకరించ




గలిగాను.

ఇంతటి సాంకేతికత, ఇన్ని సౌకర్యాలు లేని ఆ రోజుల్లో కేవలం ఉత్తరాలతోనే చాలా సమాచారాన్నిచ్చి ప్రోత్సహించారు సెట్టి ఈశ్వరరావు గారు. ఎన్నో ఉత్తరాలు రాశారు నాకు. మద్రాసులో ఒక సాహితీ సంస్థ నిర్వహించిన సమావేశంలో 'గురజాడ రచనలలో సంఘ సంస్కరణ భావాలు' అనే అంశం మీద పేపర్ చదవటానికి నేను వెళ్ళినప్పుడు ఈశ్వరరావు గారు అక్కడకు వచ్చారు. చాలా విషయాలు గురజాడ గురించి మాట్లాడారు.

కావలిలో కె. వి. రమణారెడ్డి గారింట్లో నాలుగు రోజులుండి గురజాడకు సంబంధించిన విషయసేకరణ చేశాను. నన్నో విద్యార్థినిలా చూసి, చాలా ప్రోత్సహించారు. విషయ సేకరణ అంతా జరిగిన తరువాతే, అధ్యాయ విభజన చేసుకుని రాయటం మొదలుపెట్టాను.

ఎం. ఫిల్ లోవున్నప్పుడే ఒక సెమినార్ సందర్భంగా ఎస్. వి.యూనివర్శిటీ కి వచ్చిన కొత్తపల్లి వీరభద్రరావు గారిని వారు విడిది చేసిన అతిథి గృహంలో నేను, మా సర్ వెళ్లి కలిశాము. నేను ముందుగానే రాసుకుని వెళ్లిన ప్రశ్నలన్నింటికి ఎంతో ఓపికగా చెప్పి సందేహాలు తీర్చారు వారు. ఆరుద్రగారు కూడా ఈ పరిశోధన విషయంగా నేను అడిగిన సందేహాలకు లేఖ రాశారు. తరవాత వారు తిరుపతి వచ్చినప్పుడు మాట్లాడాను కూడా!

నేను విజయనగరం, విశాఖపట్నం వెళ్లి వచ్చాక కన్యాశుల్కం నాటక ప్రదర్శనల గురించి వ్యాసాలు చదవటం, పలువురు పెద్దల ద్వారా వినటం జరిగి నాకూ ఒక ఆలోచన వచ్చింది. కన్యాశుల్కం నాటకాన్ని ముఖ్యమైన సంఘటనలతో ముప్పై పేజీలకు కుదించి, తిరుపతిలో మేము వుండే ఇంటి దగ్గరున్న చిన్న రామాలయం ముందు, శ్రీరామ నవమి ఉత్సవాలు జరుగుతున్నప్పుడు స్టేజి మీద నాటకం వేయించాను. విజయనగరం మాండలికంలోఉన్న కన్యాశుల్కం నాటకాన్ని

రాయలసీమ విద్యార్థులతో! కుదించిన నాటకాన్ని మా సర్ చూసి, కొన్ని సూచనలు చేసి,ప్రదర్శనకు బాగుంటుందన్నారు. కె. వి.రమణారెడ్డి గారు అంత తక్కువ పేజీలకు కుదించడం గొప్ప విషయమే అని ఉత్తరం రాశారు. ఈ ప్రదర్శనకు మా సర్, కె.వి. ఆర్ గారు వస్తామన్నారు గాని కారణాంతరాల వల్ల రాలేకపోయారు .ఈ నాటక నిర్వహణలో, చిత్రపు హనుమంతరావు, ఫోటోలు తీసిన వ్యక్తి సహకరించారు. అతను అగ్నిహోత్రావధాన్లుగా వేశాడు. అందరూ మగ పిల్లలే! పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులు. మధురవాణి, బుచ్చెమ్మ, మీనాక్షి పాత్రలకు ఆడ వేషం వేసుకున్నారు. సంభాషణలు కష్టపడి నేర్చుకున్నారు. అదొక మరచిపోలేని జ్ఞాపకం నాకు.

నేను సేకరించిన ఫొటోలతో,1985లో ఆంధ్రజ్యోతి వార పత్రికలో మహాకవి గురజాడ అప్పారావు అనే వ్యాసాన్ని అప్పారావుగారి జీవిత విశేషాలను చెపుతూ రాశాను. అదే అచ్చయిన నా మొదటి వ్యాసం. అలా నా రచనా వ్యాసంగం కూడా గురజాడను గురించిన వ్యాసం తోనే ప్రారంభమైంది.

ఈ పరిశోధన జరుగుతున్న సమయంలోనే గురజాడ వారి గురించి అప్పటి వరకు జరిగిన కృషి పరిశీలించాక, 'గురజాడపై ఇంకా జరగవలసిన పరిశోధన' అనే వ్యాసం రాశాను. అది 'తెలుగు'మాస పత్రికలో అచ్చయింది.

గురజాడ కన్యాశుల్కం నాటకంపై వివిధ కోణాలలో అనేక వ్యాసాలు వచ్చాయి.అవి పుస్తక రూపంలో ఒకే దగ్గర దొరుకుతున్నాయిప్పుడు. కానీ, ముప్ఫై ఏళ్ల కిందట విషయ సేకరణకి గ్రంథాలయాలలో పాత పత్రికలే ఆధారం. ఒక యజ్ఞంలా సాగిందప్పుడు సేకరణ కార్యక్రమం! తెలుగుశాఖలో మా ప్రొఫెసర్ గారి గదికి వచ్చే వెల్చేరు నారాయణరావు గారి లాంటి పెద్దలతో చర్చలు జరిగేవి. అదో అపూర్వమైన కాలం! తిరిగి రాని కాలం! ఆ జ్ఞాపకాలు,అనుభవాలు నాలో ఇంకా పచ్చగా అలాగే ఉన్నాయి.

'ప్రకాశిక' అనే పక్ష పత్రికకు గురజాడ వారు సంపాదకత్వం వహించారని నేనూ థీసిస్ లో చెప్పాను కానీ చూడలేదు. ఎవరూ చూసినట్లు చెప్పలేదు. అంతేకాక, గురజాడ 'సారంగధర 'తరువాత 'చంద్రహాస' అనే ఐదువందల పంక్తుల ఇంగ్లీషు పద్య కావ్యాన్ని రచించినట్లు తెలుస్తోంది. దానినీ ఎవరూ చూడలేదు .

ఎం.ఫిల్.అంశం ''గురజాడ అప్పారావు రచనలు-భాషా సాహిత్య ప్రమేయ దృక్పథం''లో గురజాడ వారి జీవితవిశేషాలు, భాషా సాహిత్యాల పట్ల వారి దృక్పథాన్ని చెప్పటం జరిగింది.

పీహెచ్‌డీ అంశం ''గురజాడ అప్పారావు రచనలు-భాషా, సాహిత్య సామాజి కాంశాల పరస్పరసంబంధం''లో వారి రచనల్లో భాషా సాహిత్య సామాజికాంశాల సమన్వయాన్ని విపులంగా, విస్తృతంగా చెప్పటం జరిగింది.

ఇవీ గురజాడ వ్యక్తిత్వ, సాహిత్య అధ్యయనాలలో నేను గ్రహించిన విషయాలు, నా అనుభవాలు, జ్ఞాపకాలు.

★ ★ ★


గురజాడపై వ్యాసాలు

# గురజాడ జీవిత గమనం, భాషా విప్లవం

ఆచార్య నేమాని కృష్ణమూర్తి
nemani70@yahoo.com

గురజాడకి తండ్రంటే ఎంతో భక్తి గౌరవాలు. తండ్రికీ కొడుకంటే అపరిమితమైన వాత్సల్యం. మొదట 10 ఏళ్ళ వరకు చదువు చీపురుపల్లి, తరువాత రంగం విజయనగరం. ఇక్కడనే మహాకవి విద్యాభ్యాసం, సాహిత్య రచన, ఉద్యోగం, మిగిలిన జీవితం అంతా గడిచింది. చిన్నప్పటినుండీ చిలిపి ప్రశ్నలే, వాద– ప్రతివాదాలే, 'తర్కవితర్కాలే'. అయినా ఎక్కువకాలం చదువుమీదే ధ్యానం, దీక్ష. పట్టిన పుస్తకం పూర్తయ్యేవరకూ విడిచేది లేదు. చిన్నతనం నుండి పరిశీలనా, విమర్శనా దృష్టే. పుస్తకాల్లోని మాటలు రామచిలకల్లా పలికితే లాభం లేదు. చదవాలి. చదువుకంటే ఎక్కువ– చూడాలి. చూసి కనిపెట్టాలి. ప్రకృతి అనేది అన్ని పుస్తకాలకంటే గొప్పది. అది చదవటమే పరమావధి అన్నట్లు ఉండేవారు.ఆయనకి రెండు 'దురలవాట్లు' అని గిడుగు రామ్మూర్తి పంతులు అనేవారు. 1. కనిపించిన ప్రతి పుస్తకాన్నీ చదవటం 2. ప్రకృతి అనే గ్రంథాన్ని పరిశీలించటం.

గురజాడ స్వతంత్ర యోచనాపరులు. బి. ఎ.పరీక్షల్లో ఫిలాసఫీ సబ్జెక్టులో అడిగిన చుప్పనాతి ప్రశ్నలకు ముక్కు, చెవులు కోసి విమర్శించినవారు! పరీక్ష పాసయిన పెద్దబట్ల శాస్త్రి "నువ్వు మా అందరికన్నా చురుకుపాలున్న వాడివి కదా, పరీక్ష ఎందుకు పోయింది" అని అడిగితే "మనలో చురుకుపాలు హెచ్చయిందోయ్" అని వీరజవాబు!! పాతికేళ్ళ వయస్సుకి గురజాడ 1886లో పట్టభద్రులయ్యారు. తత్వశాస్త్రం అభిమాన విషయంగా, సంస్కృతం రెండవ భాషగా బి.ఎ. పాసయ్యారు. పెద్ద పదవులు కావాలని కలలు కనలేదు. ఒక కుర్చీలో కూర్చుని పిల్లల్ని చుట్టూ చేరదీసి వాళ్ళతో అచ్చట్లు, ముచ్చట్లు చెప్పుకొంటూ "మాస్టారు ఉద్యోగం చేయాలని



నా మొట్టమొదటి కోరిక. తీరా అయ్యాక అందులో ఆనందం లేదనిపించింది. కోర్టు మునసబు అయితే బావుణ్ణనిపించింది, కానీ కాలేదు. లాయరునవుదామని ఉత్సాహం. అదీ కాలేదు. కాకపోయినా ఎన్నో కేసులను కోర్టులో నడిపాను" అని చెప్పేవారు. ఆయనే గనక కేవలం లాయరయితే ఈ ఆంధ్ర సాహిత్యం ఏమైపోను?

విజయనగరం కళాశాలలో లెక్చరరుగా...నెలకు వంద జీతం. గట్టిగా విషయ సేకరణ చేసి ఎఫ్.ఎ; బి. ఎ.లకు ఇంగ్లీషు, వ్యాకరణం, సంస్కృత సారస్వతం, అనువాదం, రోమన్ చరిత్ర క్లాసులకు వెళ్ళేవారు. బహు విధాలా వివిధ విషయాలను బేరీజు వేసి నిగ్గుతేల్చడం ఆయనకు అభ్యాసం.విద్యావేత్తగా,సాహితీ యుగపురుషుడిగా, మహాకవి, తత్వవేత్తగా పరిణతి చెందారు. సమాజ చైతన్యాన్ని కలిగించే మనోబలాన్ని, ధైర్యాన్ని, సాహసాన్ని, నూతన దృష్టినీ ఆయనకిచ్చిన దశ ఇదే.చదివిన గ్రంథాలు, లెక్కకి మించినన్ని పరిశోధనలు, ఎప్పుడూ విద్వద్గోష్ఠులు. చుట్టూ స్నేహితులే, అంటే పండితులే. కిళాంబి రంగాచార్యులు, యనమండ్ర నారాయణమూర్తి, లింగం లక్ష్మీజీ పంతులు, అనాసపురపు రామ్మూర్తి పంతులు– ఒక్కొక్కరూ ఒక్కో భాషలో మహాపండితులు, అనేక భాషలతో పరిచయం గ లవారు. సంస్కృత, ఆంగ్ల, ఆంధ్ర భాషలలో ఘనులు. గురజాడ అనేవారు "నా అదృష్టం ఏమిటో గానీ– నాకు పరిచయం కలిగే మనిషల్లా వేలలో,కోట్లలో ఎన్నదగినవాడై ఉంటాడు'. ఆ మాట అక్షరాలా నిజం. ఆనందగజపతి విజయనగరం మహారాజు 'వ్యసనం' విద్యాగోష్ఠి. అక్కడే చర్చలు. అపార గ్రంథపఠనా కావ్యాలు, విమర్శలు, నాటకం మీద ప్రత్యేక కృషి.

తెలుగులో నాటకాలే కాకుండానవలలు కూడా రాయాలనే కుతూహలం గురజాడకు కలిగింది. 1896-97 మధ్య రచించినట్లు తెలుస్తోంది. మహారాజు మరణానంతరం, ఆయన సోదరి రీవా మహారాణికి కార్యదర్శిగా నియమి తులయ్యారు. ఈ కాలంలోనే ఎన్నో రచనలు చేశారు. కొండుభట్టీయం, కన్యాశుల్కం రెండవకూర్పు, దేశభక్తి, కన్యక, బిల్హణీయం, లవణరాజుకల, పూర్ణమ్మ. ఆంధ్ర సాహిత్యంలో ఇదొక అపూర్వ విప్లవదశ. గురజాడే దానికి నాయకుడు. "నాది ప్రజల ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికీ వదులుకోలేను" అన్నారు. ఈ ప్రజాస్వామికోద్యమ విజయసాధనకు వాగనుశాసనులు రామ్మూర్తి పంతులుగారు, మహాకవిగారు.

గురజాడ దుర్బల శరీరులు. ఒంటి పూట భోజనం. చారూ అన్నం. పాలూ రొట్టె. పిసరంత ఎండకీ గాలికీ శరీరం తట్టుకునేది కాదు. ఒంట్లో నిస్త్రాణ. కడుపులో భగభగ. నరాలూ పేగులూ తోడుకుపోవటం. కార్యభారం మోయలేనిది. అయినా బహుముఖ కార్యకలాపాలు, విద్యాసమస్యలపై చర్చలు, పండిత గోష్ఠులు, వివిధ దేశాల సారస్వత ఉద్యమాల సమీక్ష, వ్యావహారిక భాషావిజయం కోసం ఇటు విశ్వవిద్యాలయాల్లో అటు పండితులతో 'యుద్ధం'.కోర్టు కేసులు, మేధస్సుకి శ్రమ. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమంటే "అది నావల్ల కాదు. పని... పనిచేయటమే నాకెంతో ఉత్సాహం, దానిమీదనే పరిపూర్ణ

**ఒక అపరిచిత వ్యక్తి చూసి చూడగానే అతని గుణశీలములను ఇట్టే పోల్చుకోగల ప్రతిభ అప్పారావు గారిది. తాను చూసే దానిని, వినేదానిని ప్రతి విషయాన్ని పరిశీలన చేసి, బాగోగులు నిర్ధారించుకొని వస్తు తత్వంలో మెరుగులు గ్రహించేటి అప్పారావుగారి ప్రతిభ. రీవారాణి అనేవారట, అప్పారావు చూస్తుండగా రాయకు, దూరం నుండే ఏమి రాస్తావో నీకలం తిరుగుడులను బట్టే పోల్చేస్తాడు.**

విశ్వాసం. పనీపాటూ లేకుండా 'అభివృద్ధి రావాలి, అభివృద్ధికి రావాలి' అని పలవరించేవాళ్ళంటే మటుకు నాకు సుతరామూ సానుభూతి లేదు. పనిచేయటం నాకు ఒక అలవాటు, అదే ధ్యేయం. దానికదే పరమావధి" అనేవారు.

ఆయనకు క్రోధమనేదే లేదు. మీదపడి కొట్టవచ్చినా, నవ్వి ఎదుటివాడి కోపం చల్లార్చే స్వభావం. ఒక అపరిచిత వ్యక్తినైనాచూసి చూడగానే అతని గుణశీలతను ఇట్టే పోల్చుకోగల ప్రతిభ. తాను చూసేదానిని, వినేదానిని ప్రతి విషయాన్నీ పరిశీలన చేసి, బాగోగులు నిర్ధారించుకొని, వస్తుతత్వంలో మెరుగులు గ్రహించేంత శక్తి. రీవారాణి అనేవారట–'అప్పారావు చూస్తుండగారాయకు. ఏమి రాస్తావో దూరంనుండే నీకలం తిరుగుడునుబట్టే పోల్చేస్తాడు'. ఈ పరిశీలనాశక్తి, దృష్టి ఆయనకు అలవాటయిపోయింది. ఇతరులలో కనిపించే నవ్వు పుట్టించే అంశాలు(చప్పున పొడగట్టేవి) తనలో తాను చూచుకొని నవ్వుకొనే అంతర్ముఖుడు. తనపై తానే ఛలోక్తులు విసురుకునే సరసత. ఏ ఊరు వెళ్ళినా అక్కడ వీధులు, బజార్లు, పఠనాలయాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించి ఏ ఏ పుస్తకాలు ఉన్నాయో కనిపెట్టేవారు.

పెద్దకళ్ళు, సొగసైన ముక్కు, విశాలమైన నుదురు, ఆజానుబాహువు, తెల్లని అతిచక్కని మనిషి. ఉన్నిచొక్కా, దానిమీద కోటు, పైన శాలువా. మేజోళ్ళు, కాళ్ళకు బూట్లు, శీతాకాలంలో కూడా మీదను గొడుగే. ఆలోచనలను రేకెత్తించే చూపులతో, దారిన ఎదురయ్యే నేస్తులను నవ్వుతూ పలుకరించే మనస్తత్వం. వేషం పాత ఫక్కీ. సభలకు – రెండెడ్ల విశాలపు బండిలో పరుపులు,తలగడాలు వేసుకొని సుఖాసీనులై వచ్చేవారు. తన మాట చెల్లిన చోటనల్లా మన ఆంధ్రులకు, ఆంధ్ర సంస్థలకు సాయపడిన సిసలైన దేశాభిమాని. తన వద్ద ఉన్న తెలుగు సంస్కృత గ్రం థాలు, మన దేశంలోని శిలాశాసనాలు, రికార్డులు, నెల్లూరు జిల్లా శాసనాలు ఒంగోలు సుబ్రహ్మణ్యానికి సాయంచేసి విద్యాధికుడిని చేశారు."ముందురానున్న తరం– ఆ యువకులు అంటే నాకెంతో అభిమానం, ప్రేమ, ఆప్యాయత. నాజూకైన వచనంగల వాడుక భాషలో గ్రంథ రచన సాగించే సంప్రదాయం ఆరంభించాలంటే యువకులు నా ఉద్యమానికెంతో అవసరం' అనేవారు. సాటి, తోటి మానవుణ్ణి హృదయమిచ్చి ప్రేమించు. ఎల్లలోకము లొక్క ఇ ల్లయి, మతములన్నీ మాసిపోయేలా, అలా విశ్వమానవ కళ్యాణాన్ని ఆశించే యువకుల కోసం ఆయన హృదయం ఆరాటపడింది.ముత్యపు చిప్పలవలె



ఎదురుతెన్నులు చూస్తున్న ప్రజల హృదయాలలో కురిసిన స్వాతివాన గురజాడ సందేశం.'చిత్తా స్వాతి వాన జోడించి కురియగాచిప్పలోన బడె చినుకొక్కటి / ఆ చుక్క ముత్యమయి మునిగిపోయే ముందు చిప్పతో చెప్పింది మాటొక్కటి'. అదే చుక్క ముత్యంగా మారి ఆంధ్ర కవితామతల్లి మెడలో ముత్యాల సరాలుగా అమరింది.

దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్. అటువంటి దేశం, అందులో మనుషుల కోసం ఆయన కవిత్వమనే మబ్బులు స్వాతివాన జల్లులను కురిపించాయి. రంగు రంగుల ఇంద్రధనుస్సులనూ, తారలనూ, కాంతినీ ఆంధ్రకవితా గగన వీధిన అవతరింపజేసిన మహాకవి...53 సంవత్సరాల జీవితకాలం తేదీలనూ నెలలనూ సంవత్సరాలనూ దశలనూ నాటి చరిత్రనూ పూర్తిగా మార్చివేసింది. కాలగమనాన్ని ఇంకొక దిక్కుకు మళ్ళించింది.

అప్పారావుగారి గొప్పతనం చాటడానికి ఆయన భాష, శైలి, వ్యక్తిత్వమే రుజువు. కాలానుగుణం అయిన కవిత ఆయనది.మహానుభావులు, కవీశ్వరులు, జ్ఞాన సంపన్నులైనవారు ఏది రాసినా వైశిష్ట్యం ఉంటుంది. తెలుగును అభివృద్ధి చేయటమంటే– భాషను ఆరాధిస్తూ, దానిలో ఉన్నతి ఉన్నవారిని గౌరవించి ప్రోత్సాహమివ్వడం. అన్న దమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్ అని ఆయన ప్రబోధించారు. ఆ మహాకవికి జేజేలు అర్పించడం మనందరి విధి.

**గమనిక:** ఆచార్య నేమాని గారు కొన్ని దశాబ్దాల క్రితం గురజాడ పుట్టిన ఊరు, ఎస్. రాయవరంలో చేసిన ప్రసంగం ఆధారంగా రాసిన వ్యాసం ఇది. కాబట్టి ఈ వ్యాసం ప్రసంగ శైలిలో ఉంటుంది.

గురజాడపై వ్యాసాలు

# పెన్నేపల్లి గోపాలకృష్ణ చెక్కిన
# సజీవశిల్పం మధురవాణి



డా. జి. అరుణాదేవి
విశ్రాంత అధ్యాపకురాలు

"మధురవాణి ఊహాత్మక ఆత్మకథ"కు మూలం గురజాడ వారి కన్యాశుల్కం. ఈ నాటకంలో వైవిధ్యంగా మలచిన ఒక పాత్ర మధురవాణి. ఒక సామాన్యవేశ్య ఆత్మనిబ్బరంతో అన్యాయాన్ని ఎదిరించి, ధైర్యంగా ఎలా పోరాడగలదో చిత్రిస్తారు. ఆ పాత్రను చూసి, అబ్బుర పడిన గోపాలకృష్ణ గారు "మధురవాణి ఊహాత్మక ఆత్మకథ" వ్రాశారు 2007లో.




మధురవాణి భావాలను, అనుభవాలను, ఆలోచనలను ఆమె నోటివెంట ఆమె భాషలో పలికిస్తే, ఆమె కథను ఆమె మాటలతోనే చెప్పిస్తే ఎలావుంటుందన్న ఆలోచన – ఒక గొప్ప వినూత్నమైన ఊహ – గోపాలకృష్ణ గారి మనస్సులో మెదిలింది. ఆ ఆలోచనారూపమే ఈ ఊహాత్మక ఆత్మకథ! కేవలం నాటకంలోని కల్పిత పాత్రగా కాకుండా, మనసున్న మనిషిగా ఊహించుకొని, ఆమె కథకు శ్రీకారం చుట్టారు. ఆమె పాత్రను పూర్తిగా అర్థం చేసుకొని, తన జీవితంలో జరిగిన వివిధ సంఘటనలు, తనచుట్టూ చేరే మగవాళ్ళు, వారి కపటపూరిత మాటలు, నటనలు, తన మర్యాదలేని జీవితం – ఆమె మనోనేత్రంతో చూసి, ఆమె మనోభావాలను, మనస్తత్వాన్నీ ఊహించి కథ రాయటం అంత సులభతరం కాదు.

రచయిత తానే మధురవాణియై, ఆ పాత్రలో లీనమై జీవిత కథ చెప్పటం – ఒక అద్భుతమైన సృష్టి! ఇలాంటి ఊహాత్మక ప్రయోగం బహుశా తెలుగు సాహిత్యంలో

ఇదే ప్రథమం! ఆమెనొక అసాధారణ స్త్రీమూర్తిలా తలపోసినందునే ఒక సజీవశిల్పంగా పాఠకుల ముందు వుంచగలిగారు. చదువుతున్నంతసేపు మధురవాణి పాఠకుల కళ్ళముందు కదలాడుతూ ఉంటుంది. మనతో మాట్లాడుతూ తన భావాలు పంచుకుంటున్నట్లే వుంటుంది.

నాటి సామాజిక పరిస్థితులలో దేవదాసి పద్ధతి క్రమేపీ కాలంలో మార్పుచెందుతూ, డబ్బుకు శరీరాన్ని అమ్ముకొనే వృత్తిగా ఎలా మారిందో తెలుసుకున్నాక అందులో నుంచి ఎలా బయటపడాలన్న స్పృహ, ఆలోచన, వేశ్యావృత్తికి సాక్షిగా, కొత్తతరానికి ప్రతినిధిగా నిలిచిన ఆ సంఘర్షణను, కాలంతోపాటు ఆమె జీవనవిధానంలో కలిగిన మార్పును సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ఆమె నోటే వినాలి! అందుకే ఆమె ఆత్మకథ!!

"ఆత్మగౌరవం వున్న ఏ మనిషీ తాను బ్రతుకుతున్నది గంజిగుంటని గుర్తెరిగిన తరువాత కూడా అందులోనే హేయంగా ఎందుకు బ్రతుకు గడపాలనుకుంటుంది?" (పే. 115)

తన వృత్తి హైన్యతను తెలుసుకొని మారాలనుకున్న మధురవాణి ప్రశ్న. ఇకనుంచీ తను 'వన్నెల చిన్నెల వయ్యారి వగలాడి కాదు. ఒక గొప్ప శిల్పకారుడు మనస్సుతో, మేధస్సుతో శిల్పించిన సంపూర్ణ ప్రతిమ! సృష్టికర్తే మురిసిపోయి, ముగ్ధుడైనట్టి ముత్యాలసరం ఈ మధురవాణి!" ఎంత ఆత్మవిశ్వాసం! ఎంత గొప్పభావం మధురవాణి నోట పలికిస్తారు రచయిత!

సృష్టికర్తయేమో గానీ, ఆత్మకథతో మధురవాణిని శిల్పంగా మలచిన గోపాలకృష్ణ గారు మాత్రం మురిసిపోయి, ఉబ్బితబ్బిబ్బయ్యారు నిస్సందేహంగా! అందుకే, "మధురవాణి అనే సృష్టి జరక్కపోయివుంటే సాహిత్యలోకానికి ఎంతలోటు కలిగివుండును?" అంటారు. మధురవాణి, రచయిత ఊహకు కూడా అందనంత ఎత్తుకు ఎదిగిపోయింది ఆమె ఆత్మకథతో.

తన ఆత్మకథ ఎవరు రాశారని సరళ అడిగినట్లు, దానికి మధురవాణి, "నా ఆత్మ కథ రాసింది నేను కాదు. పెన్నేపల్లి గోపాలకృష్ణ రాసి పెట్టాడు. పేరు నాది. ఊహ, రాత అతనిది. అతనికి నాపై మమకారం మెండు!" అని చెప్పినట్టు కవరుపేజి మీద పుస్తకపరిచయం!

**మధురవాణి మనస్సెరిగిన పెన్నేపల్లి:**

మధురవాణి కథ కడపటి మజిలీ తన క్రొత్త జీవితంలోకి అడుగువేస్తున్నప్పుడు మొదలుపెడ్తుంది. అక్కడ నుంచి తన గత అనుభవాలను చెప్పుకుంటూ వెళ్తుంది. వేశ్యకు నాట్యం, సంగీతం, అందం – యివే జీవనాధారం. ఈ కళలను నమ్ముకొని కాక దేహాన్ని అమ్ముకొని జీవించమని శాసించినప్పుడు సమాజం మీద తిరుగుబాటు చేస్తుంది. సరియైన దారిలో గురజాడవారి ఉదాత్తభావాలే నడిపించాయంటుంది. వేశ్యావృత్తిని నిర్మూలించాలంటే ముందు వారిని మనుష్యులుగా చూడడం అవసరం

అని, గురజాడ వారు అన్నప్పుడు,

"ఆ ఎముకల పోగులాంటి బక్కపలచని మనిషిలో ఎంత గొప్ప ఆలోచనలో?" అని ఆశ్చర్యపోతుంది. (పే. 156)

తన జీవిత విధానాన్ని, తనలో కలిగిన మార్పులను చెప్పుకుంటుంది. తన వృత్తికి, పరిస్థితులకు మధురవాణి కట్టుబడి జీవిస్తుంది. ఆమెలో వున్న సంస్కారం, ఆలోచనలు ఉదాత్తమైనవి. కాలంతోపాటు హీనస్థితికి దిగజారిన ఈ వ్యవస్థపై తిరగబడాలని, తన కంటిన బురద తనే కడిగేసుకోవాలన్న కోరిక తనలో మార్పుకు నాంది. లోకం పోకడలు గమనించి, నిర్మలమైన అంతఃకరణతో మంచిచెడులు చూసింది. ఒక్కొక్క అనుభవం నుంచి ఒక్కోపాఠం నేర్చుకొంది. చెడ్డతో స్నేహంగా వుండటం తప్పకపోయినా కడవరకు దాన్ని ఓడించడానికే ప్రయత్నం చేస్తుంది. మనసుకు మలినం అంటనంత వరకూ తాను పవిత్రురాలనని చెప్పగలిగిన ఆత్మస్థైర్యం. వృత్తిరీత్యా వేశ్య అయినా ప్రవృత్తిరీత్యా మనసున్న మంచి మనిషి.

సంఘసంస్కర్తలమన్న ముసుగులో పెద్ద మనుషులు ఆడుతున్న కపటనాటకాలను సమయోచిత ఆలోచనతో ఎత్తిచూపి బుద్ధి చెప్పగలదు, నిలదీయగలదు. 'అంతా దైవనిర్ణయం, విధిరాత' అనే కరటక శాస్త్రుల్ని పట్టుకుని మనం చేసే వెధవ పనులన్నిటికీ దేవుడిమీద నిందలేయడమేమిటని దులిపి పారేస్తుంది.

**"మధురవాణి అనే నేను యిలాంటి జీవితం గడపటానికి ఎవరిది పూచి?**
**నా నుదిటి వ్రాత ఎవరు వ్రాశారు? మనుషులా? దేవుడా? భూమ్మీద పడిన శిశువు నుదిటిపై యిది సాని, యిది సంసారి అని రాసి వుంటుందా?" (పే. 13)**
**అన్న తర్కానికి కరటక శాస్త్రి దగ్గర ఏ సమాధానమూ లేదు.**

రంగనాధ అయ్యరు సానినుద్ధరించే నెపంతో భార్యను పుట్టింటికి పంపీ, గోపాలరావు సంఘ సంస్కరణకు, మీటింగులకు వెళ్తున్నానంటూ భార్యకు చెప్పీ సానివాడలకు వెళ్తూ వుంటారు. ప్రేమ సముద్రంలో పీకల వరకు మునిగిపోయిన వీళ్ళా తమను వుద్ధరించే సంస్కర్తలు? అంటూ ఎకసెక్కాలాడటం మధురవాణికే చెల్లు. ఇటువంటి పతిదేవుళ్ళ నీడలో బతికే ఆ మహాస్వాధ్వీమణులకన్నా తానే పవిత్రురాలనని, నిజాన్ని నిర్భయంగా మాట్లాడే తానే గొప్ప నీతిగలదాన్నని అంటుంది. తన వృత్తిలో రహస్యం లేదు, దాచుకోవడం లేదు. మర్యాద ముసుగులో వాళ్ళు చేసే అవినీతి వికృతచేష్టలకంటే ఎప్పుడూ అబద్ధమాడని తానే మర్యాదస్తురాలనంటుంది. ఈ పెద్దమనుషులంతా 'నిజాయితీపరులైన, తన వృత్తికి బద్ధురాలైన వేశ్యకంటే ఏవిధంగా మిన్న? (పే. 41) ఇలా తమ నిజాయితీ గురించి నిర్భయంగా చెప్పగలిగిన గుండె ధైర్యం ఈ పెద్దమనుషులకు వుందా? అని ప్రశ్నిస్తుంది.

రామప్పపంతులు తనను పొరుగూరు లేవదీసుకుపోయినప్పుడు, దర్జాగా గ్రామంలో ఇంటిలోనే మకాం పెట్టించాడు. అప్పుడు మధురవాణి, 'ప్రేమకు పెళ్ళాం,

మోహానికి వేశ్యా' అంటూ ఎగతాళి చేస్తూ యిదంతా పురుషకుట్ర అంటుంది. వేశ్యలంటే అంత చులకనా? అంటూ నిలదీస్తుంది.

"ఔరా! ఆడదాన్ని వేశ్యగా ఫిరాయింపు చేసి జాతిని ఎంత అనాడీ చేసిందీ పురుష ప్రపంచం?" (పే. 36) రామప్పపంతులంత చెడ్డవాడు ముల్లోకాలు కాగడావేసి వెతికినా వుండడంటుంది. అయినా అతని ఎడల మంచిగా వుండటానికే ప్రయత్నిస్తుంది.

సౌజన్యరావు పంతులకి వేశ్యలంటే చులకన. వాళ్ళకు మంచి ఉండదని నమ్ముతాడు. అందుకే వాళ్ళలో మంచితనం గుర్తించడానికి యిష్టపడడు. అతను వేశ్యలవైపు కన్నెత్తి చూడడని, అది అతని వ్రతమని కరటక శాస్త్రి చెప్పినప్పుడు, "అదేం వ్రతం? వేశ్యాతృణీకార ఛీత్కార వ్రతం కాబోలు! వేశ్యను చూడరాదు. తాకరాదన్న కఠోర నియమం తప్ప సంస్కరించాలన్న ఆలోచన ఆయనకు లేదా?" (పే 75)

ఇటువంటి చమత్కారమాట విరుపులు మధురవాణి నోటివెంట పలికిస్తారు రచయిత. ఇంత కఠోరమైన వ్రతం చివరకు మధురవాణి చేసిన సాయానికి షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు ఏమౌతుంది? మధురవాణి అడుగుతుంది నిస్సంకోచంగా, "ఏమిటి తాత్పర్యం? వేశ్యశరీరం తగిలితే తగిలిన శరీరం కోసేసుకుంటానన్న ఆదర్శం హాస్యాస్పదమని తానే గుర్తెరగడం! అవునా"?! (పే. 75)

ఈ మగవాళ్ళ తత్వాలు లోతుపాతులు పట్టి చూడగలిగింది కాబట్టి, వాళ్ళకు సమాధానం దొరక్కుండా, తన మాటల చమత్కారంతో వాళ్ళనోళ్ళు మూయించగలిగింది. గిరీశం అధునాతన భావాలున్న వాడినని గొప్పలుపోతూ బుచ్చమ్మలాంటి బాల్యవితంతువులను పెళ్ళిపేరుతో మోసం చేయడానికి సిద్ధపడ్డప్పుడు ఏకిపారేస్తుంది. యిదేనా సంఘసంస్కరణ అంటే? అని. గిరీశం సిగ్గు, ఎగ్గు వదిలేసిన వాడు కనుక అవమానానికి, ఓటమికీ ఎన్నడూ వగచడు. దూషణభూషణ తిరస్కారాలకు అతీతుడు. సంఘసంస్కర్తలంటూ జారిపడిపోతూ వుంటారని, చివరకు తనలాంటి వాళ్ళ చేయే ఆసరా అవుతుందని అంటుంది తరతరాలుగా ఆ వృత్తినే నమ్ముకొని బతుకుతున్న అభాగినులకు మరొక జీవనమార్గం చూపకుండా, వారి కడుపుగొట్టడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నిస్తుంది. "వేశ్యను చావగొట్టి వల్లకాటికి సాగనంపటానికి పంతులుగారు అందిపుచ్చుకోని ఆయుధం లేదు కదా?" (పే. 53)

వేశ్యలు నశించని సమాజం బాగుపడదని చెప్పడం, తమతో సంబంధం వున్న వారిని మాత్రమే ఉద్ధరించాలనటం – మధురవాణికి కోపం తెప్పిస్తుంది. "ఈ భూమి మీద వున్న యావన్మంది సానుల్ని కట్టగట్టి రాజమేంద్ర నడివీధిలో భోగిమంటవేసి వెచ్చగా చలికాచుకోరాదో?" (పే 57) అని సూటిగా ప్రశ్నిస్తుంది. నిర్భాగ్య వేశ్యావృత్తిని మట్టుకు నిప్పులుకురిసే మూడో కంటితో చూశారంటుంది. ఎదుటివాళ్ళు ఆత్మరక్షణలో పడేలా మాట్లాడగల నేర్పు తనది.

ఎంతమంది సంస్కర్తలు వచ్చినా ఎవరు ఏమి ఉద్ధరించగలిగారని ఆక్రోశిస్తుంది.



అభంశుభం తెలియని పసిపిల్లలను కన్యాశుల్కానికి ఆశపడి ముసలివాళ్ళకిచ్చి పెళ్ళిచేయటం, వాళ్ళు బాల్యవితంతువులుగా దుర్భరజీవితం గడపడం వేలెత్తి చూపుతుంది. అగ్నిహోత్రావధానులు రెండవ కూతురును ముసలాడికిచ్చి పెళ్ళి చేయాలనుకున్నప్పుడు, ఎంత చెప్పినా వినడు. ఎందుకంటే బుచ్చమ్మ వైధవ్యం దాని తలరాతట! 'ప్రాలుబ్ధం' చాలక ప్రాప్తించిందట. తలరాతను ఎవరూ, తప్పించలేరన్నప్పుడు, "ఎవరు రాసిన రాతో? స్వార్థచింతనతో తనలాంటి తండ్రులు రాసింది కాదూ? మన తలరాత ప్రాలుబ్ధం అని ఏ విషయాలు వదిలేస్తున్నారు?" (పే.89)

అవధానులు చేస్తున్నది న్యాయమేనా అని మధురవాణి ప్రశ్నిస్తే, తగిన సమాధానం చెప్పలేక మాట దాటవేస్తాడు. ఇటువంటి దురాశాపరులే ఆడవాళ్ళ శత్రువులంటుంది.

"ఆడదాని బ్రతుకు మట్టిపాలైనా మగవాడికేమిటి ఖాతరి?

ఎన్ని అనర్థాలు? ఎంత అక్రూరం?" (పే. 99)

నిస్సహాయులైన ఈ ఆడవాళ్ళంతా తిరగబడాలని కోరుకుంటుంది. వితంతువులకు తమ బ్రతుకులో అపశ్రుతిని సరిదిద్దుకునే అవకాశం వీరేశలింగం పంతులు గారు కల్పించి, పునర్వివాహాలు చేసినప్పుడు చాలా సంతోషపడుతుంది. ఈ దురాచారం తుదముట్టించే ప్రయత్నం కొంతమేర విజయవంతం అయినందుకు. ఈ విషయంలో ఆయన నిస్సంశయంగా మహాపురుషులు. ఇదే ప్రయత్నం, ఇంత కనికరం వేశ్యల విషయంలో ఎందుకు చూపరని బాధపడుతుంది.

అప్పుడప్పుడు తన పాట వినటానికి వచ్చే గురజాడ పంతులుగారంటే చెప్పలేని అభిమానం, భక్తి, గౌరవం. ఒకసారి మాటల్లో తనతల్లి, "వేశ్యకు మాత్రం నీతి వుండొద్దూ?" (పే.31) అంటుంది. పంతులుగారు ఒక్కక్షణం నివ్వెరపోతారు. తేరుకొన్నాక, "ఔరా! ఇంతకాలానికి వేశ్యనోట నీతి అనేమాట వినరావటం ఆనందంగా వుంది సుమా!" అంటారు. ఏ వృత్తికైనా ఒక నీతి, సంప్రదాయం వుండాలి కదా? మరి వేశ్యవృత్తికి కూడా నీతి వుండొద్దూ అని ప్రశ్నించడంలో, సానిదాని నీతి గురించి పంతులుగారు ఆలోచించేలా చేయగలిగిన వ్యక్తిత్వమున్న మనిషిగా మధురవాణిని రచయిత మలిచారు. మధురవాణి దృష్టిలో మానవీయదృష్టి కలిగి, వారిలోని మానవత్వాన్ని గుర్తించి, గౌరవించి, వారి కన్నీళ్ళకు కారణం ఎరిగినవారు పంతులుగారు ఒక్కరే. అట్టి సత్పురుషుని దయ సంప్రాప్తం కావడం మధురవాణి అదృష్టం కాదూ? అనుకొంటుంది.

రచయిత అప్పటి వాడుకభాష, మాండలీకాలు, పాత్రోచిత సంభాషణలు చక్కగా వ్యక్తీకరించారు. మధురవాణిలో నీతితప్పని, ఆత్మవంచన చేసుకోని జీవితం. అన్యాయానికి ఎదురొడ్డడం, చేతనయిన సాయం చేయటం, సమయస్ఫూర్తి, చమత్కారపు మాటలు, అవినీతి కూపంలోను మంచిని పెంచడం, అందరినీ ప్రేమించడం లాంటి గొప్ప లక్షణాలన్ని ప్రోదిచేసి మలచిన పాత్ర. ఆమెలో కలిగిన మార్పు మారుతున్న సామాజిక పరిస్థితులకు, చరిత్రకు దర్పణం.

ఆత్మకథా ప్రారంభంలో సౌజన్యరావు ప్రశ్నకు తన పేరు మధురవాణి అని, ఊరు విజయనగరం అని చెప్తుంది. ఇంటిపేరు అడిగితే 'కన్యాశుల్కం' అని చెప్పి వుండేదాన్ని అనటంలో ఎంత విరుపు, చమత్కారం! అలాగే కథ చివర్లో గురజాడ గారి మరణం హృదయానికి హత్తుకొనేలా రాస్తారు. పంతులుగారు పోయారని తెలియగానే 'మా గురువుగారు పోవడం ఏమిటి?' అనుకుంటూ గాల్లో తేలుతున్నట్లు నడచివెళ్తుంది. పంతులుగారి దగ్గర కూర్చోగానే మధురవాణిని చూసి, నవ్వి,

**'మధురం! వచ్చావా? కాస్త యిసుంటారా'**
**మీరు చనిపోయారంటగా? అన్నాను తలవంచుకొని.**
**'పిచ్చిపిల్లా! నే చనిపోవడమేమిటే!'**
**కాసేపు మౌనంగా ఉన్నారు....**
**'నీవు లేవూ? నేను అంతే!**

నీవు వున్నంతకాలం నేనూ వుంటాను సుమా!' చిరునవ్వుతో (పే. 157)

నువ్వున్నంత కాలం నేనూవుంటానని చెప్పించడంలో గురజాడ వారి కన్యాశుల్కం, మధురవాణి – సాహితీ ప్రపంచంలో శాశ్వతంగా వుంటాయని ఎంత హృద్యంగా చెప్పారు రచయిత!

'పాట పాడు మధురం నీకిష్టమైన పాట', అని పంతులుగారు అడిగినట్లు, ఆయనకు ఇష్టమైన 'దేశమును ప్రేమించుమన్నా....' పాట పాడడం మొదలెట్టినట్లు రాస్తారు. మధురవాణి పాట పాడుతూనే వుంటుంది. పంతులుగారిని సాగనంపే వరకూ. పాడుకుంటూనే యింటికి వస్తుంది. ఇంట్లో అడుగుపెట్టగానే ఎదురుగా గురువుగారు – కుర్చీలో కూర్చొని ప్రశాంతంగా చిరునవ్వు చిందిస్తున్నట్లు, తనతో పాటు ఆయనా గొంతు కలిపినట్లు అనిపిస్తుంది. పాడుతూ కాళ్ళమీద పడిపోతుంది.

ఒంటిమీద స్పృహవచ్చేసరికి తూర్పున తెల్లవారుతూ ఉంటుంది. కోకిల కూస్తూ ఉంటుంది. ఆమె జీవితంలో కూడా ఉషస్సు కొత్త జీవితానికి స్వాగతం పలుకుతూన్నట్లు ముగిస్తారు.

★ ★ ★

# సాహిత్య ప్రకాశిక



# స్వాగతము



శర్మానంద గారు

(భారతి పత్రిక తొలి సంచికలో “భారతి” కి శర్మానంద గారు పలికిన అపూర్వ పద స్వాగతాంజలి)

భావప్రకటీకరణ మసంభావ్యమైనచో, అగ్రాహ్యంబు లంతర్భూత మగుననియో, అకృత్రైచ్ఛికము లగుననియో, తలంచుట ప్రమాదము. ఆత్మప్రకటనమునకు, అలౌకిక భాషా ప్రయోగమును, ప్రాపంచికానుగతికంబులకు, సాధారణ భాషానియమమును, యాదృచ్ఛికములకు, ఉభయేతరేతర సంప్రదాయమును, అనుగమితము లగుట, విబుధాచారము. ఏది ఎట్లైనను, విషయావగాహనమగు భాషాప్రయోగప్రచారమే, సమంజసము. కావున ప్రమోదజనితంబులగు దోషలేశంబులం గైకొనక, ధారాళహృదయులరై, మా చదువరులు విషయగ్రహణం బొనర్తురుగాత.

అపూర్వప్రసంగంబుల, అఖిలభారత పూర్వాపూర్వ ప్రస్తావనంబుల, నైహికాముష్మికవిషయావబోధ విధానంబుల, సుప్రసిద్ధకథాకథితవ్యాసంగంబుల, సదమల విశద యశోవిరాజమానంబగు సుగంధ గంధిలప్రఫుల్ల హృదయ కుముదినియై, నవనవోద్బుద్ధ విబుధామోదిత భారతరహస్య విలసనామోఘ వ్యవసాయానుభూతతత్త్వ విమర్శనా కౌశల్యంబున, కుసుమవర్షంబులం గురియుచు, కోమల ప్రణయగీతామృత రసప్రవాహంబుల, నభ్రగంగయో యన, ఆత్మసంతానహృదయకలుషక్షాళన కుతూహలియై, విస్తృతవృత్తంబుల, పండితపామరారాధ్యయై, మృదుపదవచనరచనా శృంగారవిలాస లాలసియై, కమ్మదెమ్మెరల గమగమలతో, ఉత్తరాభిముఖియై, ఆంధ్ర సర్వస్వంబును పవిత్రంబొనర్ప, నిదే! మా నవ్య “భారతి" యీదెసనుండి ముద్దుగుల్కులేనడలతో, బయలువెడలినది.

విజయోస్తు, ‘భారతీ!’ విజయోస్తు. వర్ణత్రయీ! స్వాగతము. ‘భారతీ’మతల్లీ! సుస్వాగతము. అమ్మా! నీ పుత్రపుత్రికాసహస్రంబుల సానురాగదృక్కుల నను గ్రహింపుము. నీ చతురంతయానమును, వీథివీథికిం జననిమ్ము. నీ వింటింట విందవు కమ్ము. మా పరిచర్యల నామోదింపుము. మా స్తోత్రపాఠములకు తా విమ్ము. మా గీతా గానంబుల కామోదింపుము. హితబోధలొనర్పుము. తరణోపాయముం జూపుము. ధర్మతత్పరులం జేయుము. అభీష్టాభిసిద్ధి కాశీర్వదింపుము. వేయేల! మమ్మెల్లర నీ బిడ్డల మనిపింపుము. ఇదియ నా ప్రథమాంజలి.

★ ★ ★

సాహిత్య ప్రకాశిక

# కరుణశ్రీ గారి కావ్యత్రయ దర్శనం



డా. జంధ్యాల
జయకృష్ణ బాపూజీ
ఇర్వింగ్, టెక్సాస్

క్రౌంచపక్షుల వియోగాన్ని చూసి విచలితుడైన వాల్మీకి మహర్షి శోకం శ్లోకంగా మారినట్లు పాయిఖానాలు పరిశుభ్రం చేసే పాకీపిల్లను చూసి బాధపడిన నాన్న నోటి వెంట వెలువడిన పలుకులే పద్యంగా మారాయి –

**ఒక్క రోజీవు వీథుల నూడ్వకున్న**
**తేలిపోవును మా పట్టణాల సొగసు;**
**బయటపడునమ్మ ! బాబుల బ్రతుకులెల్ల;**
**ఒక క్షణమ్మీవు గంప క్రిందకును దింప.**

"సామాజికస్పృహ కవిత్వంలో ఉండితీరాలి'' అని గొంతు చించుకొనే విమర్శకులకు ఆనాడే తన తొలి పద్యం ద్వారా సమాధానమిచ్చారు ఆయన.

**"పాకీదానిగ నాడిపోసికొను ఈ పాపిష్టిలోకమ్ము నీ**
**బాకీ తీర్చుకొనంగలేదు జగదంబా! జన్మజన్మాలకున్"**
అని పాకీపిల్లను "జగదంబా" అని సంబోధించటం ఆయనకే చెల్లింది.

" పాకీదే కద మాకు మా జనని బాల్యమ్మందు సంజీవనీ !" అని ప్రతి తల్లీ మా చిన్నప్పుడు మాకు నీవు చేసిన పనే చేసిందని ఆ పవిత్రమూర్తికి నమస్సులర్పిస్తారు పన్నెండు పద్యాలలో.

ఆనాటి నుండి జీవితాంతం వరకు సమాజంలో ఏ చిన్న సంఘటన తనను కదలించినా, కరగించినా దానిని కవితా శిల్పంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. ఇలా శతాధికమైన అంశాలపై తాను రాసిన కవితలను ఐదు భాగాల ఉదయశ్రీ కావ్యంగా రూపొందించారు.

ఆయన దృష్టిలో " కవిత్వం ఒక కమ్మని అనుభూతి. మానవత్వంలో నవత్వం చూపించే అందాల ఆశాజ్యోతి. అది జీవిత విపంచి మేళవించి మ్రోగించిన కల్యాణ గాంధర్వగీతి. అది ఎదలో మెదులుతుంది. పదంలో కదులుతుంది. ఉదయాన్ని సృజిస్తుంది. అభ్యుదయాన్ని అందిస్తుంది. అది సత్యసనాతనం. నిత్యవినూతనం."

సమత, మమత, దయ, సానుభూతి, సంస్కృతి, జాతీయత, దైవభక్తి, దేశభక్తి వంటి

ఆదర్శగుణాలను రంగరించి ఆ కవితామృతాన్ని ఆంధ్రులకు అందించి ఆబాలగోపాలాన్ని ఆనందింపజేసిన నిజమైన ప్రజాకవి నాన్న. కరుణాసింధువైన బుద్ధుణ్ణి "కరుణశ్రీ"గా ఆయన భావించారు. అదే కలం పేరుగా గ్రహించారు. ఎందరెందరో "నామాంత శ్రీమంతుల"కు మార్గదర్శకులైనారు.

నాన్నగారి గ్రంథాలు చిన్నవీ పెద్దవీ మొత్తం 76. వాటిలో అత్యంత ప్రధానమైనవి మూడు– ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ. "ఈ కావ్యత్రయంలో మీ కిష్టమైన కావ్యం ఏది?" అన్న పాఠకుల ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం – "ఉదయశ్రీ నా హృదయం. విజయశ్రీ నా శిరస్సు. కరుణశ్రీ నా జీవితం."

## ఉదయశ్రీ

" సాంధ్యశ్రీ" అనే కవితలో – "సంజ వెలుంగులో పసిడిచాయల ఖద్దరుచీర కట్టి నారింజకు నీరువోయుశశిరేఖవె నీవు" అన్న పద్యంలో శశిరేఖ చేత ఖద్దరు చీర కట్టించటం కవికి స్వదేశీవస్తువైన ఖద్దరు మీద గల మమకారానికీ, గాంధీజీ బోధనల పట్ల ఉన్న ఆసక్తికీ తార్కాణం. అలాగే "ప్రాభాతి" అన్న కవితలో "లెమ్ము పోదము ప్రమోదముతో మన మాతృపూజకున్" అని నాయకుడు నాయికతో పలకటం భారతమాత పట్ల ఆయనకు గల భక్తిని తెలియజేస్తుంది.

"ధనుర్భంగం" అన్న కవితలో శ్రీరాముడు శివధనుస్సును విరచి వీరరాముడైన సందర్భాన్ని కవి ఎలా వర్ణించారో గమనించండి –

**ఫెళ్ళుమనె విల్లు; గంటలు ఘల్లుమనె; గు**
**భిల్లుమనె గుండె నృపులకు; ఝల్లుమనియె**
**జానకీదేహ; మొక నిమేషమ్మునందె**
**నయము జయమును భయము విస్మయము గదుర.**

ఇందులో ద్విత్వలంకారావృత్తితో కూడిన వృత్త్యనుప్రాసాలంకారం, త్రివర్ణావృత్తితో కూడిన అంత్యానుప్రాసాలంకారం చోటుచేసుకున్నాయి. ఇంకా విల్లు విరవటంలో నయం, గంటలు మోగటంలో జయం, రాజుల గుండె అదరటంలో భయం, సీతాదేవి దేహం గగుర్పొడవటంలో విస్మయం క్రమం తప్పకుండా వర్ణింపబడటం వల్ల క్రమాలంకారం వెల్లివిరిసింది. ఇవన్నీ ఒకేఒక తేటగీతిలో తేటతెల్లం చేయబడ్డాయి.

**చెల్లరే విల్లు విరచునే నల్లవాడు!**
**పదిపదారేండ్ల యెలరాచ పడుచువాడు!**
**సిగ్గు సిగ్గంచు లేచి గర్జించినారు**
**కనులు కుట్టిన తెల్లమొగాలవారు.**

అన్న పద్యంలో రాముణ్ణి నల్లవాడు – అనీ, వెలవెలబోయిన రాజుల్ని తెల్లమొగాలవారు– అనీ పేర్కొనటం వల్ల భారతీయులు, ఆంగ్లేయులు స్ఫురింపజేయబడటం విశేషం. శివధనుస్సు నెత్తటం స్వాతంత్ర్యఫలప్రాప్తిగా భావింపవచ్చు.

**విజయశ్రీ :**

విజయశ్రీ కావ్యంలో మొత్తం 205 పద్యాలూ, ఐదు విభాగాలూ ఉన్నాయి. మంత్రాలోచనం, స్కంధావారం, విషాదం, ప్రబోధం, విజృంభణం అనే శీర్షికలలో పంచ పాండవుల మనోభావాలు ప్రతిబింబిస్తాయి.

కురుక్షేత్రసంగ్రామంతోపాటు భారతస్వాతంత్ర్యసంగ్రామాన్ని కూడా స్ఫురింపజేస్తూ రాయబడిన ధ్వనికావ్యం విజయశ్రీ. రాయబారం విఫలమై – "ఐనవి సంధిసంబరము లాయుధము ధరియింపుడయ్య! దాపైనది వీరభారత మహారణరంగము" అని పలికిన శ్రీకృష్ణుడితో ధర్మరాజు ఇంకా శాంతివచనాలు వల్లిస్తుంటే ద్రౌపది తన పలుకుల ములుకులతో పాండవులలో రణోత్సాహాన్ని రగుల్కొలుపుతున్నది.

**భుజాగ్రముల్ పొంగ పురోగమింతురో?**
**ధ్వజాగ్రముల్ వంగ తిరోగమింతురో?**
**శరమ్ములన్ దాల్చి పరాక్రమింతురో?**
**కరమ్ములన్ మోడ్చి పరిక్రమింతురో?**

"ఉప్పొంగే భుజాలతో యుద్ధానికి సన్నద్ధం అవుతారా? కిందకు దించిన జెండాలతో పలాయనం చిత్తగిస్తారా? బాణాలు ధరించి విజృంభిస్తారా? చేతులు జోడించి వాళ్ల వెనక నడుస్తారా? తేల్చుకోండి." అన్న పాంచాలి పలుకులు అల్పాక్షరముల అనల్పార్థ రచనగా వెలువరించిన కవి ప్రతిభకు నిలువెత్తు నిదర్శనాలు. కొడుకులకూ కోడళ్లకూ మనుమళ్లకూ దూరమై ధృతరాష్ట్రుడి భవనంలో కాలం గడుపుతున్న కుంతీదేవిని కవి ఎలా వర్ణించారో చూడండి –

**విశ్వవిఖ్యాత భారతవీరమాత**
**కుంతి పడియుండె కురురాజు కొంపలోన;**
**అశ్రుధారలు తన లోచనాంచలముల**
**యమునలై గంగలై కృష్ణలై స్రవింప.**

ఇక్కడ గంగ– కృష్ణ – యమునలుగా మారిన కన్నీటితో కుమిలిపోతున్న కుంతీ మాతతోపాటు గంగ – కృష్ణ – యమున నదులతో నిండిన భారతమాత కూడా అప్రయత్నంగా మనకు దర్శనమిస్తుంది.

**కరుణశ్రీ :**

ఈ కావ్యంలో మొత్తం 43 శీర్షికలు ఉన్నాయి. అయితే కవి పేరు, కావ్యం పేరు, కావ్యనాయకుడి పేరు ఒక్కటే కావటం ఎంత విచిత్రం ! అదే కరుణశ్రీ కావ్యం విషయంలో జరిగింది. బుద్ధుణ్ణి తన ప్రభువుగా, తన ప్రేమమూర్తిగా, తన ఆదర్శజ్యోతిగా, తన ఆరాధ్య దైవంగా భావించిన నాన్న కరుణశ్రీ కావ్యాన్ని తన జీవితలక్ష్యంగా చేసికొని మొదటిభాగం రచించిన నలభై సంవత్సరాల అనంతరం రెండవభాగం రాసి సిద్ధమనోరథులైనారు.

సిద్ధార్థ రాకుమారుడు శ్రీనీ, శ్రీమతినీ, చిరంజీవినీ, సింహాసనాన్నీ పరిత్యజించి మహాభినిష్క్రమణం చేసి మర్రిచెట్టు నీడల్లో బుద్ధుడై ప్రపంచానికి అమరసందేశాన్ని అందించిన విషయం “కరుణశ్రీ” కావ్యంలో రసజ్ఞమనోజ్ఞంగా వ్యక్తీకరింపబడింది. అసూయాద్వేషాలతో, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలతో, అస్తవ్యస్త పరిస్థితులతో అలమటించే లోకానికి శాంతి, ప్రేమ, కరుణ, అహింసలను బోధించిన బుద్ధభగవానుడికి ఇలా పునరాహ్వానం పలికారు ఆయన –

**దయసేయంగదవయ్య శాక్యమునిచంద్రా! నీ పదస్పర్శచే**
**గయిసేయంగదవయ్య భారతమహీఖండంబు; దివ్యత్కృపా**
**మయమందారమరందబిందులహరీ మందస్మితాలోకముల్**
**దయసేయంగదవయ్య మానవ మనస్తాపంబు చల్లారగన్.**

“మహాభినిష్క్రమణం” ఘట్టంలో సతీసుతులను వీడి వెళ్లటానికి డోలాందోళిత హృదయుడైన సిద్ధార్థరాకుమారుడి పరిస్థితికి తగ్గట్లు సెమ్మెలలోని దీపాల కదలికను ఎంత సహజంగా చిత్రించారో కవి –

**పొమ్మనినట్లొ ! పోవలదు పోవలదంచనినట్లొ ! వెన్కకున్**
**రమ్మనినట్లొ ! రావలదు రావలదంచు వచించినట్టులో !**
**సెమ్మెలలోని దీపములు చిత్రముగా తలలూపె; రాజహ**
**ర్మ్యమ్మున వెచ్చనూర్చుచు నృపాత్మజుడిట్టటు సంచరింపగన్.**

జీవించినంత కాలం కవిత్వం రాసి, కవిత్వం రాసినంత కాలమే జీవించిన మహాకవి నాన్న గారు. తన కవిత్వాన్ని ప్రజల నాల్కలపైన నాట్యం చేయించిన ప్రజా హృదయాస్థానకవి ఆయన.

★ ★ ★


సాహిత్య ప్రకాశిక

# నవయుగాల బాట "నార్ల" మాట



మా శర్మ
ఫోన్: 9393102305

తెలుగు సంపాదక శిఖరం నార్ల వెంకటేశ్వరరావు. నిజానికి సంపాదకుడు అనే మాట ఆయనకు ఇష్టం ఉండదు. అందులో సంపాదన శబ్దం ధ్వనించడం వల్ల కాబోలు.ఎడిటర్ అనే పదమే ఆయనకు ఇష్టం.ముట్నూరి కృష్ణారావు,ఖాసా సుబ్బారావు తర్వాత తరంలో అంతటి ప్రభావం చూపించినవారు నార్ల తప్ప ఇంకొకరు లేరు. ఇంగ్లిష్ లో వీ.ఆర్ నార్లగా ప్రసిద్ధులు. నండూరి రామమోహనరావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ వంటి దిగ్గంత పాత్రికేయులపై కూడా వీరి ప్రభావం ఉంది. కేవలం ఒక ఎడిటర్ కోసమే ఒక వార్తాపత్రికను స్థాపించడం వీరి విషయంలోనే జరిగింది. బహుశా! అంతటి గౌరవం పొందిన ఏకైక పాత్రికేయుడు నార్ల. ఆంధ్రప్రభతో మనస్పర్థలు వచ్చినప్పుడు కేవలం నార్ల గురించి కె ఎల్ ఎన్ ప్రసాద్ వంటి పెద్దలు "ఆంధ్రజ్యోతి"ని స్థాపించారు. అప్పటికే ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ తెలుగునాట ఒక వెలుగు వెలుగుతున్నప్పటికీ, ఆంధ్రజ్యోతి స్థాపనతో కొత్త వెలుగులు వెలిగించిన ఘనత నార్లవారిదే. సుత్తి లేకుండా సూటిగా చెప్పడం ఆయన నైజం. చిన్న చిన్న వాక్యాలలోనే అత్యంత శక్తివంతంగా భావ ప్రకటన చేసే ఒరవడి ఈయన సొత్తు. మానవత్వం, హేతువాదం నీడలలో తాను నడుస్తూ సమాజాన్ని నడిపే ప్రయత్నం చేశారు. పత్రికా భాషలోనూ ఎన్నో సంస్కరణలు తెచ్చారు. వాడుకభాషకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ శైలి వల్ల తెలుగు పత్రికా లోకంలో పాఠకులు బాగా పెరిగారు. అదే సమయంలో సందర్భోచితంగా విలువైన శబ్దాలు వాడేవారు.



నార్ల కేవలం పాత్రికేయుడు కాదు, సాహిత్యజీవి. అందుకే అక్షరాన్ని అందంగా ఒడిసిపట్టుకునేవారు. ఎడిటర్ గా పత్రికలో బహుముఖంగా విహరించినట్లే, సాహిత్య సృష్టిలోనూ సృజనశీలంగా నార్ల బహుముఖీనంగా ప్రయాణం చేశారు.

నాటికలు, కథలు, కవితలు, పద్యాలు, వివిధ దేశాల చరిత్రలు, చారిత్రక పురుషుల జీవన చిత్రాలు పుంఖానుపుంఖంగా రాశారు. సవ్యసాచిలా అటు ఇంగ్లిష్ లోనూ సమప్రతిభ చూపించారు.ఎంత గొప్ప రచయితో, అంత గొప్ప చదువరి కూడా. ఆయన సొంత లైబ్రరీలో వేల పుస్తకాలు ఉండేవి. అవన్నీ అలంకార ప్రాయంగా కాక, ప్రతి పుట చదివినవే.ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ కంటే ముందు స్వరాజ్య, జనవాణి, ప్రజామిత్ర మొదలైన పత్రికల్లో అక్షరాలకు పదునుపెట్టి, పత్రికల శక్తి అంటే ఏమిటో లోకానికి చూపించారు. మూడు దశాబ్దాలకు పైగా ఎడిటర్ గా శిఖర సమానుడిగా ఖ్యాతికెక్కారు. సంపాదక రచనలో వీరిదే పైచేయి. పత్రికకు దర్పణంగా చెప్పుకునే సంపాదకీయాల స్థాయిని హిమవత్ పర్వత శిఖరంపై కూర్చోబెట్టిన ఘనత వీరిదే. కేవలం నార్లవారి సంపాదకీయాల కోసమే పత్రికలు చదివేవారంటే– అది నార్లవారికే చెల్లింది. ఆ అక్షరాలు, ఆ పదాలు సరికొత్త ఆలోచనలకు జీవం పోసేవి. తాను చెప్పాలనుకున్నది నిర్భీతిగా, నిర్మొహమాటంగా చెప్పేవారు. కలంయోధుడు అనే మాట అక్షరాలా నార్లకు సరిపోతుంది. తాను నమ్మిన సిద్ధాంతాలను, వ్యతిరేకించిన అంశాలను, అభిమానించిన విషయాలను ఒక క్యాంపెయిన్ లాగా నడిపేవారు. సి.రాజగోపాలాచారిని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవాలని మహాత్మాగాంధీ నిర్ణయించినప్పుడు దానికి వ్యతిరేకంగా పత్రికా ముఖంగా క్యాంపెయిన్ నడిపారు. ఆంధ్రప్రభను నిషేధించిన సమయంలోనూ, రజాకార్ల దురాగతాలపైన అక్షరయుద్ధం ప్రకటించారు.

కత్తి కంటే కలం శక్తివంతమైందని నార్ల అక్షరాలు అడుగడుగునా నిరూపిస్తాయి. మూఢ నమ్మకాలు, ఛాందస చాదస్తాలను నిలువెల్లా విమర్శించారు."తెలుగు పత్రికారచనలో వాడినీ, వేడిని సృష్టించి తెలుగు నుడికారంలో ఎంత కారం ఉందో తెలియజెప్పినవాడు నార్ల" అంటూ గోరాశాస్త్రి కితాబు ఇచ్చారు."విరామమెరుగని రాక్షసుడు నార్ల " అని ఖాసా సుబ్బారావు అనేవారు. పత్రికల ద్వారా వ్యావహారిక భాషా ఉద్యమానికి ఊపిరిలూదినవారు నార్ల వెంకటేశ్వరరావు.ఆంధ్రప్రభపై సెన్సార్ విధించినప్పుడు పత్రిక మొదట పేజీ మొత్తం నల్లరంగు పులిమి తన నిరసనను ఘాటుగా ప్రకటించారు. కమ్యూనిస్ట్ పార్టీకి వ్యతిరేకంగా, కాంగ్రెస్ కు అనుకూలంగా క్యాంపెయిన్ నడిపిన ప్రత్యేకత నార్లవారిదే. రెండుసార్లు రాజ్యసభ సభ్యత్వం పొందిన ఘనత కూడా నార్లవారిదే. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుడుగా ఉన్నారు. అకాడెమీలు రద్దు చేయడం మొదలైన సలహాలు వీరివే.కొందరి పట్ల వ్యక్తిగతంగా గౌరవం ఉన్నా, విషయం వచ్చేసరికి తీవ్రంగా విభేదించేవారు.టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, కళా వెంకటరావు, ఎన్ జి రంగా, కాసు బ్రహ్మానందరెడ్డి మొదలైన పెద్దలందరూ నార్ల కలంపోటుకు గురైనవారే. తేడా వస్తే, పతాక శీర్షికల్లో ధ్వజమెత్తేవారు. అంతటి ధైర్యశాలి. మొదట్లో ఎం ఎన్ రాయిని గుర్తించలేదు.ఆయన విలువ తెలుసుకున్న



తర్వాత, వారి రచనలన్నీ చదివి, ఎం ఎన్ రాయికి పెద్ద అభిమానిగా మారిపోయారు. విశ్వనాథ సత్యనారాయణకు, నార్లకు అస్సలు పడేది కాదు. విశ్వనాథ పట్ల వ్యక్తిగతంగా గౌరవం ఉండేది కానీ, ఆయన భావాలు ఏ మాత్రం నచ్చేవి కాదు. ఇందిరాగాంధీ పట్ల కూడా వ్యతిరేక భావంతో ఉండేవారు. కుటుంబ వారసత్వ రాజకీయాల పట్ల విముఖంగా ఉండేవారు. బౌద్ధం పట్ల ప్రత్యేకమైన ఆకర్షణ ఉండేది. చిత్ర, శిల్ప కళలంటే చాలా ఇష్టం. పత్రికా రంగంలో నార్లవారి ప్రభావం ప్రత్యక్షంగా కొందరిపైన, పరోక్షంగా ఎందరిపైనో ఉంది. కృష్ణాజిల్లా కాటూరు వీరి మూల పురుషుల గ్రామం. 1908 డిసెంబర్ 1వ తేదీనాడు జబల్ పూర్ లో జన్మించిన నార్ల ఫిబ్రవరి 15వ తేదీ 1985లో మరణించారు. మద్దూరి అన్నపూర్ణయ్య " కాంగ్రెస్ " అనే పత్రికను నడిపేవారు. స్వరాజ్యాన్ని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన తీర్మానంతో ఉత్తేజితుడై, కాంగ్రెస్ పత్రికకు 1927లో ఉత్తరం రాశాడు. ఇదే నార్లవారి మొదటి రచన. 1928లో వ్యాసం రాశారు. ఇదే వీరి తొలి వ్యాసం. ఉపేంద్ర, నరేంద్ర అనే పేర్లతో వ్యాసాలు రాస్తుండేవారు. చిన్న చిన్న ఉద్యోగాలు ప్రయత్నించినా పెద్దగా ఉపయోగపడలేదు. విజయవాడ నుంచి వచ్చే "ప్రజామత"లో వ్యాసాలు రాసినందుకు 5 రూపాయలు చొప్పున ఇచ్చేవారు. దీన్నే మొదటి ఆదాయంగా భావించాలి. భారతి పత్రికలో రాసిన వ్యాసానికి అప్పటి సంపాదకులు గన్నవరపు సుబ్బరామయ్య 25రూపాయల పారితోషికం ఇచ్చారు. అది ఆ కాలంలో చాలా పెద్ద మొత్తం. ఈ గౌరవానికి నార్లవారి తల్లి ఎంతో మురిసిపోయారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య నడిపే ఇంగ్లిష్ పత్రిక "జన్మభూమి"కి, కృష్ణాపత్రికకు కూడా నార్ల వ్యాసాలు రాసేవారు. ప్రభ, స్వతంత్ర భారత్ మొదలైనవాటికి కూడా రాసేవారు. బందరు నుంచి వచ్చే "జ్యోతి" పత్రికకు తొలిసారిగా సంపాదకుడుగా పనిచేశారు. ఇదే ఆ పత్రిక తొలి సంచిక కూడా.

ఇంగ్లిష్ జర్నలిజం పట్ల నార్లవారికి మక్కువ ఎక్కువ ఉండేది. దీని గురించే మద్రాస్ వెళ్లారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో చేరడానికి ప్రయత్నించారు, కానీ రాలేదు. జస్టిస్ పత్రికలో అవకాశం వచ్చినా ఎక్కువకాలం ఉండలేకపోయారు. టంగుటూరి ప్రకాశం పంతులు స్థాపించిన "స్వరాజ్య" పత్రికలో చేరి, వివిధ శాఖల్లో పనిచేసి చాలా మెలుకువలు నేర్చుకున్నారు. ఇది ఒక శిక్షణలా ఆయనకు ఎంతో ఉపయోగపడింది. ప్రూఫ్ రీడింగ్ నుంచి ఎడిటింగ్ దాకా అన్నీ అక్కడే నేర్చుకున్నారు. ఆ పత్రిక మూసివేయడంతో మళ్ళీ వెతుకులాట ప్రారంభమైంది. 1938లో తన 30వ ఏట రామనాథ్ గోయంకా తెలుగులో స్థాపించిన " ఆంధ్రప్రభ"లో న్యూస్ ఎడిటర్ గా

చేరారు. అప్పటి నుంచి పాత్రికేయ వృత్తిలో స్థిరపడిపోయారు. ఖాసా సుబ్బారావు, నారాయణమూర్తి సంపాదకులుగా తప్పుకున్న తర్వాత,1942లో ఆంధ్రప్రభ సంపాదకుడిగా బాధ్యతలు తీసుకొని గొప్ప ఒరవడి సృష్టించారు. కమ్యూనిస్టులు ఓడిపోవడానికి, కాంగ్రెస్ పార్టీ గెలవడానికి నార్లవారి సంపాదకీయాలే ప్రధాన పాత్ర పోషించాయని చెబుతారు. అదీ నార్లవారి కలంబలం. గోయంకాతో విభేదాలు రావడంతో బయటకు వచ్చారు.కె ఎల్ ఎన్ ప్రసాద్, నార్ల అభిమానులు కలసి కేవలం నార్ల వెంకటేశ్వరరావు కోసం ఆంధ్రజ్యోతిని 1960 జులై 1వ తేదీన స్థాపించారు. అదీ నార్లవారి గొప్పదనం. ఇటువంటి ఘనత చరిత్రలో ఎవ్వరికీ దక్కలేదనే చెప్పాలి. స్త్రీలకు, వ్యవసాయదారులకు ప్రత్యేక శీర్షికలు నడిపారు. గ్రామీణవార్తలు ప్రత్యేకంగా ప్రచురించేవారు. కళలు, సాహిత్యం, చరిత్ర, సంస్కృతికి పెద్దపీట వేశారు. పుస్తక సమీక్షలు ప్రవేశపెట్టారు. పుస్తక సమీక్షలను కూడా సంపాదకీయాలుగా రాశారు.ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టింది కూడా వీరే. వీటిని ఇంగ్లిష్ లో కూడా అనువాదం చేయించేవారు. దీనివల్ల ఎందరో తెలుగు రచయితలకు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వచ్చేవి.1975లో ఇందిరాగాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించారు. సంజయ్ గాంధీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు స్వాగతిస్తూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక సంచికను తెచ్చింది. ఈ విధానాలన్నీ నచ్చక, సంపాదకుడుగా రాజీనామా చేశారు. మరి కొన్ని నెలల్లో బయటకు వచ్చేశారు.

నార్లవారి పాత్రికేయ జీవితాన్ని పరిశీలిస్తే, తనకు నచ్చని సంఘటనలు జరిగితే, తెగదెంచుకొని సంస్థలను వదిలివేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆత్మగౌరవం, సిద్ధాంతం పట్ల గౌరవంగా వీటిని భావించాలి. గాంధీ, నెహ్రూ, బెర్నార్డ్ షా, గురజాడ, కందుకూరి, వేమన, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి– నార్లకు ఇష్టమైన రచయితలు. ఎన్నో విదేశీ పర్యటనలు కూడా చేశారు.తన రచనా జీవితంలో అనేక కొత్త పదాలను సృష్టించారు.ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు అంటే నార్లవారికి అమితమైన గౌరవం. నేడు జర్నలిజం ఇంత అభివృద్ధి చెందిందంటే, తెలుగులో ఇన్ని పత్రికలు వచ్చాయంటే, అంతా కాశీనాథునివారి చలువ అని చెప్పేవారు.నార్లవారు మెరుపు వేగంతో రాసేవారు. కదిలే విజ్ఞాన భాండాగారం నార్ల.జర్నలిజం ప్రపంచంలో నార్ల వినూత్న విరాట్ స్వరూపం. పత్రికా రచనకు ఆధునికతను అద్దిన సృజనశీలి, దార్శనికుడు. రాగద్వేషాలకు లోబడి జీవించినా.. సత్యానికి, ప్రతిభకు పెద్దపీట వేసిన మానవతావాది. తెలుగు పత్రికా ప్రస్థానంలో నార్ల యుగకర్త. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి పెద్దపత్రికలకు పెద్దదిక్కుగా నిలిచిన తేజోమయుడు.నార్ల వెంకటేశ్వరరావు వంటివారు న భూతో న భవిష్యతి.

**(ఫిబ్రవరి 15వ తేదీ నార్లవారి వర్ధంతి సందర్భంగా అక్షరాంజలి)**

సాహిత్య ప్రకాశిక

# పద్య సౌరభం



ఎన్. సీహెచ్. చక్రవర్తి
హైదరాబాద్.
93999 58069


తెలుగుసాహిత్యంలో శతకాలకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. శతకాల్లోని కొన్ని పద్యాలనూ అందులో ఉన్న మర్మాలనూ మనం క్రమంగా పరిచయం చేసుకుందాం.

సాధారణంగా మనకు జీవితంలో వివిధ మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు తారసపడుతూ ఉంటారు. అందులో కొందరు సన్నిహితులు అవుతారు. కొందరు కేవలం పరిచయస్థులుగా ఉండిపోతారు. కొందరితో ఆత్మీయానుబంధాలు పెనవేసుకుంటాయి. ఎవరిని మనం ఏ స్థాయిలో స్వీకరించాము అన్నది అనేకానేక కారణాలతో ముడివడి ఉంటుంది. ఒక్కొక్కమారు మన అనుకున్న మనకు ఉపకారం చేసేవాళ్లే తెలిసియో తెలియకయో లేదా మనం కొంత బలహీనులం అయినప్పుడో మనకు అపకారం చేస్తారు. ఇది అందరికీ అనుభవంలో ఉండేదే!! ఈ అంశానికి సంబంధించిన ఒక పద్యం చూద్దాం.

**బలయుతుడైనవేళ నిజబంధుడు తోడ్పడుగాని యాతడే**
**బలము తొలంగెనేని తనపాలిటి శత్రు,వదెట్లు పూర్ణుడై**
**జ్వలనుడుకానగాల్చు తరి సఖ్యము జూపును వాయుదేవుడా**
**బలియుడు సూక్ష్మదీపమగుపట్టుననార్పడె గాలి భాస్కరా!!**

(మారద వెంకయ్య రచించిన భాస్కర శతకం)

గాలీ అగ్నీ మంచి స్నేహితులు. అగ్నిని వాయుసారథి అంటారు మనవాళ్ళు.



ఎందుకంటే వాయువు మొయ్యకపోతే అగ్ని ఎక్కడికీ కదలలేదు. అడవిలో కార్చిచ్చు రూపంలో ఉన్న అగ్నికి వాయువు తోడైతే జరిగే నష్టం అంతాఇంతా కాదు. అగ్నికి వాయువు తోడైనట్లు అంటూ ఉంటాం కదా!! కానీ అదే అగ్ని చిన్న దీపంగా ఉన్నప్పుడు అదే వాయువు చిత్రంగా దాన్ని ఆర్పేస్తుంది. చిన్న దీపం అనే అగ్నిని నిల్వనివ్వదు. కొండెక్కిస్తుంది. ఇదే భాస్కర శతకంలో ప్రస్తావిస్తూ లోకరీతిని తెలియపరుస్తాడు.

**విశేషం:**

ఒక సామాన్య విషయాన్ని ఒక విశేష విషయంతో సమర్థించి చెప్పడం కవిత్వంలో ఒక అందం. అంతేకాదు మనకు సూటిగా అర్థమవుతుంది. మనంబలహీనులం అయితే --అది మానసికమో శారీరకమో లేదా ఆర్థికమో అది ఎలా అయినా- అప్పటిదాకా మన పక్కనున్నవాడే అపకారం చేయడానికీ వెనుదీయడు. కొందరు స్థిరంగా కష్టంలోనూ మనతో పాలుపంచుకుంటూ మనతోనే ఉంటారు. అదే వైవిధ్యం. ఇదే విషయాన్ని అగ్నీ వాయువుల స్నేహంతో కవి పోల్చిచెప్పడం వల్ల మనకు స్పష్టమైన అవగాహన వస్తుంది.

ఇంక ఆధునిక శతకాల్లో ఒకటి అయిన ఈ వ్యాస రచయిత చక్రవర్తి రచించిన మంచిమాటను ఒకదాన్ని చూద్దాం.

**తేటగీతి:** **నిన్ను శక్తిమంతునిగ మన్నించువారి,**
**యెంచిసాహాయ్యులై, ప్రోత్సహించువారి,**
**మెచ్చి,యెదుగగ, ప్రేరణనిచ్చువారి**
**మధ్యనున్న- సౌఖ్యము,శాంతి సాధ్యమగును.**

మన చుట్టూ ఎటువంటి వారు ఉంటే మన మనుగడ ఆనందంగా గడుస్తుందో ఇందులో ఉంది.మనను ఒక శక్తిగా, సహాయం చేస్తూ ప్రోత్సహిస్తూ మనకు ప్రేరణగా నిలిచేవారి మధ్యన మనం ఉంటే మనం హాయిగా శాంతిగా బతకగలుగుతాం. కనుక అవి అన్నీ ఎవరిద్వారా మనకు లభిస్తాయో వారే మనకూ, మనసుకూ ఆనందకారకులు. వారి సాంగత్యం వీడరాదు.

తెలుగుసాహిత్యంలో మరకతమణులు — తిక్కనభారతంలోని ఒక పద్యం:

**ఒరులేయవియొనరించిన**
**నరవర!యప్రియము తన మనంబునకగు దా**
**నొరులకునవి సేయకునికి**
**పరాయణము పరమధర్మ పథములకెల్లన్**

పరిమాణంలో చిన్నపద్యం. కానీ అనంత విశాలభావం.సాహిత్యలక్ష్యాల్లో హితప్రబోధం ఒకటి.సందర్భం దొరికినప్పుడల్లా కవి తన కవిత్వంలో ఒక లోకోపయోగ

ధర్మాన్ని ప్రస్తావనా వశంగా చెప్తాడు.

ఇతరులు ఏమిచేస్తే మన మనసుకు కష్టం కలుగుతుందో మనకు తెలుసు. తెలుసు కనుక అదే చెడు పనిని మనం చెయ్యకూడదు. ఎందుకని? దానివల్ల ఎదుటివాళ్ళు కష్టపడతారు కనుక ! ఆ అమానవీయ కృత్యాలను మనమెందుకు చెయ్యాలి?? మనకు కష్టం కలిగింది కనుక ఇతరులకూ అదే కష్టాన్ని కలిగించాలనుకోడం దుర్జనుల లక్షణం. ఆ బలహీనతను జయించి, మంచిని కాపాడాలి.ఒక చెంపపై కొడితే. నువ్వు తిరిగి కొట్టకు. రెండో చెంపకూడా చూపించు అన్న గాంధీ మాటకు ఇదే మూలం. అయితే కాలం మారింది. ఇప్పుడు ఆ రెండో చెంపనూ వాయించిపోతారేమో!!అనేటట్టు ఉంది పరిస్థితి.

భావరసాత్మకమైన ఆధునిక పద్యాల్లో కవికోకిల గుఱ్ఱం జాషువా గారి పద్య సౌందర్యాన్ని ఆస్వాదిద్దాం.

**తేలిక గడ్డిపోచలను దెచ్చి రచించెదవీవు తూగుటు**
**య్యేలగృహంబు, మానవుల కేరికి సాధ్యముగాదు, దానిలో**
**జాలరు, లందులోజిలుగుశయ్యలు నంతిపురంబులొప్పగా**
**మేలు!భళీ! పులుంగుటెకిమీడవురా గిజిగాడ! నీడజా!!**

(జాషువా గారి 'గిజిగాడు' ఖండికలోని పద్యం)

ప్రకృతి సౌందర్య చిత్రణ, మనకు కళ్ళముందు కనిపించే దృశ్యానికి అందమైన వ్యాఖ్యానం. మనం లోకంలో చిన్న జీవులనీ పెద్ద ప్రాణులనీ వింగడించుకుంటూ ఉంటాం. మళ్ళీ మనమే సృష్టిలో దేవుని దృష్టిలో చిన్నా పెద్దా లేదు అనుకుంటూ ఉంటాం. చిన్న అని మనమనుకునే జీవుల్లో ఎంత అద్భుత శక్తులు ఉన్నాయో జాషువా కవి ఇందులో చెప్తారు గిజిగాడు పిట్టను వర్ణిస్తూ. దీన్నే కొన్నిచోట్ల బంగారు పిచ్చుక అంటారు. ఊళ్లలో ఈ చిన్నపిట్ట చెట్లకు అందమైన గూళ్లను వెళ్ళాడదీసి నివాసం ఉంటాయి. ఆ గూళ్ళు గాలికి ఊగుతూ ఉంటాయి. అది పైకి మనకు కనిపించేది. ఖర్చులేని తేలికైన గడ్డిపోచలు నిర్మాణ సామగ్రి. కూలీలూ మేస్త్రీలూలేని గిజిగాడు నిర్మాణ కౌశలం.. అంతే !! డబ్బు ప్రస్తావన లేనే లేదు. ఆ గూటిలోపల ఎన్నో గదులు ఉంటాయిట. ఆ గదుల్లో మెరిసే పడకలు ఉంటాయట. అంతఃపురాలూ ఉంటాయట. అలాటి నిర్మాణం ఏ మనుషులూ చేయలేరు అంటూ నిజానికి ఈ గిజిగాడే పక్షుల రాజు(పులుంగుటెకిమీడు)అంటాడు కవి జాషువా!!పులుంగుఅంటే పక్షి, ఎకిమీడు అంటే ప్రభువు అని అర్థం. కవి ప్రత్యేకత ఏమంటే మనం నిత్యం చూచే వస్తువులనే నూతనంగా చెప్పడం! అందుకే కవికి సూక్ష్మ పరిశీలన ఉండాలి. నవనవోన్మేష ప్రతిభ ఉండాలి. అది ఉన్నప్పుడే ఆ కవిత్వం పదికాలాలపాటు నిలుస్తుంది.

★ ★ ★

విమర్శ

# తెలుగుసినిమా పాట – సాహిత్యసౌరభాలు



పాలమరశెట్టి కృష్ణారావు
Ph: 96765 44764

వర్తమానతెలుగు సినిమా పాటలలో సాహిత్య గుబాళింపులు క్రమేణా తగ్గుతోన్న వైనం కనిపిస్తోంది. తెలుగు పలుకే బంగారమైన పాటలలో తెలుగేతర పదాల అక్రమ చొరబాటు తెలుగుతనాన్ని పరిహసిస్తోంది. గీతరచనలో పాటించాల్సిన కనీస ప్రమాణాలను త్రోసి రాజని వింత పోకడలవైపు తెలుగు పాట పయనిస్తున్న తీరు భాషా ప్రేమికులకు ఆవేదన కలిగిస్తోంది. చలన చిత్ర నిర్మాణంలో పెరిగిన వేగం పాటల సాహిత్యాన్నీ దెబ్బ తీసినట్లు సినిమా రంగ విమర్శకుల అభిప్రాయం. సినిమా పూర్తిగా వ్యాపారదృక్పథంగా మారిన సమయంలో సంగీతం, సాహిత్యం వాస్తవికతను దూరం చేసుకోవడం అనివార్యం. సృజన స్థానాన్ని కృత్రిమత్వం కబళించడంతో ప్రస్తుత సినిమా ఒకనాటి సహజ సౌరభాన్ని కోల్పోయింది.

సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా వివిధ వనరులు అందుబాటులోకి వచ్చాయి. కథలు, కథనాలు, సంగీతం, సాహిత్యం సహా సినిమారంగానికి సంబంధించిన అన్నిప్రక్రియలను దిగుమతి చేసుకునే వీలు చిక్కింది. సినిమా రూపకల్పన కోసం వివిధ వనరుల నుంచి సేకరించిన (తస్కరణ కు పర్యాయ పదం) ముడిసరుకులకు ప్రాంతీయతను జోడించి వండి వార్చడంలో సిద్ధహస్తులన్న ముద్ర తెలుగు సినిమారంగంపై పడింది. సృజనకు తిలోదకాలిచ్చి అన్య భాషా చిత్రాలనుంచి అరువుతెచ్చుకున్న ఆలోచనలకు తెరరూపం ఇవ్వడానికి తెలుగు సినీ నిర్మాతలు వెంపర్లాడడం విస్తుగొలుపుతోంది. ఒకనాడు వెండితెరకు అపురూప చిత్రాలు అందించి ఇతర ప్రాంతాలవారికి ఆదర్శంగా నిలచిన తెలుగు సినిమా క్రమేణా ప్రాభవాన్ని కోల్పోవడం శోచనీయం.

1950దశకంలో వచ్చిన తెలుగు చలనచిత్రాలు స్వర్ణయుగాన్ని ఆవిష్కరించాయని సినీరంగవిశ్లేషకుల ఏకాభిప్రాయం. ప్రధానంగా తెలుగు పాటల మాధుర్యాన్ని ప్రేక్షకులకు అందించిన దశాబ్దంగా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. తేట తెనుగు పదాలతో రసరమ్య కావ్యాల స్థాయిలో తెలుగు గీతాలను సృజియించిన మహాకవుల కృషితో తెలుగువెండితెర పునీతమైంది. ప్రాతః స్మరణీయులు మల్లాది రామకృష్ణ శాస్త్రి,



పింగళి నాగేంద్ర రావు, సదాశివబ్రహ్మం, సముద్రాల ద్వయం, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి ప్రసిద్ధ కవుల కలాలనుంచి జాలువారిన గీతాలు తెలుగువెండితెరకు అక్షర హారతులై ప్రభాసించాయి. భక్త ప్రహ్లాద, మాలపిల్ల, రైతుబిడ్డ, పాతాళ భైరవి, మాయాబజార్, దేవదాసు, చిరంజీవులు, మల్లీశ్వరి, అనార్కలి, లవకుశ వంటి ఎన్నో అజరామర చిత్రాలకు హృద్యమైన పాటలతో అమరత్వం అందించిన ఆనాటి గీత రచయితలకు తెలుగుజాతి ఋణపడి ఉంది.

లలితమైన పదాలతో లోతైన భావాలను సృజియించడంలో ఎవరి ప్రతిభ వారిదే. నటీనటుల పాత్రోచిత సంభాషణలకు సమన్వయంగా పాటలు ఉండాలన్న జిజ్ఞాసతో మాటలు, పాటలు ఒక కవితోనే రాయించిన సందర్భాలు అనేకం. సన్నివేశాలకు అనుగుణంగా ప్రవేశించే పాటలు చలనచిత్ర గమనానికి దిశా నిర్దేశం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

మాయాబజార్, పాతాళభైరవి, గుండమ్మ కథ వంటి విజయావారి చిత్రాలకు పింగళి నాగేంద్ర రావు రచనచేయగా దేవదాసు చిత్రానికి సీనియర్ సముద్రాల, చిరంజీవులు సినిమాకు మల్లాది రామకృష్ణ శాస్త్రి మాటలు, పాటలు అందించారు. దశాబ్దాలు గడుస్తున్నా ఈనాటికీ పాత చిత్రాల గీతాలు ప్రజల హృదయ ఫలకాలపై చెరగని, చెదరని తీపి జ్ఞాపకాలుగా ఉండడం విశేషం.

వినసొంపైన సంగీతసాహిత్యాలతో తెలుగువారి మదిని దోచుకున్న సలలిత

సుస్వర గీతాలలో మచ్చుకుకొన్ని ప్రస్తావించుకుందాం. 'ఆడువారి మాటలకు అర్థాలే వేరులే', 'రావోయిచందమామా! మా వింత గాథ వినుమా! 'జగమే మాయ, బ్రతుకే మాయ', 'కుడిఎడమైతే పొరపాటు లేదోయ్', 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాలవారివిందు అహహ్హ నాకె ముందు', 'లాహిరి లాహిరి లాహిరిలో జగమే ఊయల ఊగెనుగా', ' కనుపాప కరవైన కనులెందుకో ', ' మది శారదాదేవి మందిరమే', 'మనసునమల్లెల మాలలూగెనే', 'రాజశేఖరా ! నీపై మోజు తీరలేదురా ' ... ఓపిగ్గా వెతికితే దొరికేవి ఆణిముత్యాలే. అమూల్య నవరసాల వర గీతికలే.

సన్నివేశాలకు అనుగుణంగా ప్రవేశించే పాటలు చలన చిత్ర కథన శిల్పానికి నిలువెత్తు భూషణాలై వీక్షకులను ఎంతగానో అలరించాయంటే అతిశయోక్తి కాదు. చలన చిత్ర నిర్మాణానికి ఆయువు పట్టయిన 24 కళలు నిష్ణాతులైన సమర్థుల సృజనలోంచి జీవం పోసుకునేవి. చిత్ర నిర్మాణాన్ని ఒకపవిత్ర యజ్ఞంలా స్వీకరించిన మహానుభావుల మేధోమథనంనుంచి కళాఖండాలుగా ప్రశంసలు పొందిన చలన చిత్రాలు వెండితెరపై దర్శనమిచ్చేవి. నైతిక విలువలు, నిబద్ధత, అంకితభావం పరమ లక్ష్యాలుగా చలన చిత్రాలలోఅంతర్లీనంగా ఆవిష్కృతమయ్యేవి. సినిమా అంటే కేవలం వినోద ప్రధానమైన ఆటవిడుపు సాధనంగానే కాక సమాజానికి ఎంతో కొంత మేలుచేసే స్పృహ కలిగి ఉండేవి. నిర్మాతలు నైతికధర్మాన్ని పాటించి సమాజ హితంకోసం సినిమాలు తీసేవారు. సమకాలీన సామాజిక రుగ్మతలను నిరసించే విధంగా చలన చిత్రాలు రూపుదిద్దుకునేవి. ముందడుగు, మాలపిల్ల, వందేమాతరం, వరవిక్రయం, కన్యాశుల్కంమొదలైన చిత్రాలు సామాజిక దృక్పథంతో నిర్మించినవే. ఆ సినిమాలలోని పాటలు కవుల తాలుకు భావుకతతో పాటు వారికి దేశంపట్ల ఉన్న భక్తినీ చాటిచెప్పడం విశేషం. తెలుగు పలుకుబడులు, నుడికారాలకు సినిమా పాటల ద్వారా గణనీయప్రాచుర్యం కల్పించి అమ్మభాషకు వారు చేసిన సేవ నిరుపమానం.

ఈనాటికీ జానపదులు పాడుకునే పాటలకు సినిమాబాణీలు ప్రామాణికంగా నిలుస్తున్నాయి. జోలపాటలు, లాలి పాటలు, పెళ్ళి తంతులో వచ్చే పసందైన పాటలు, బావామరదళ్ళ సరసగీతాలు, ప్రేయసీప్రియుల ప్రణయరాగాలు, జీవన సూత్రాలు తెలిపే సుభాషితాలు, బతుకు అర్థాన్ని విపులీకరించే తత్త్వ గీతాలు.... మానవజీవితలోని ప్రతీ పార్శ్వాన్ని తెలుగు సినీ గీతాలు స్పృశించాయంటే అతిశయోక్తి కాదు.

అనంతర కాలంలో లబ్ధప్రతిష్టులైన తెలుగు కవివరేణ్యులు సినిమా రంగానికి పరిచయమైనారు. శ్రీరంగం శ్రీనివాస రావు, దాశరథి కృష్ణమాచార్య, ఆత్రేయ, ఆరుద్ర, సి.నారాయణరెడ్డి, కొసరాజు, రాజశ్రీ, సహజ కవి మల్లెమాల, ఎం. గోపి, జాలాది మొదలైన గీత రచయితలు వైవిధ్యభరితమైన పాటలతో తెలుగు సినిమాకు అక్షరార్చన చేశారు. ఆణిముత్యాలవంటి పాటలను సృష్టించి తెలుగు సినిమాకళామతల్లికి కంఠాభరణాలై భాసిల్లారు. అల్పపదాలతో అనల్ప భావార్థాలను పలికించి తెలుగు

గీతాన్ని పరిపుష్టం చేశారు.

విప్లవ కవి శ్రీశ్రీ రాసిన సినీగీతాలు తెలుగు చిత్ర మణిపూసలు. అల్లూరి సీతారామరాజు సినిమా కోసం శ్రీశ్రీ కలం నుంచి దుమికిన 'తెలుగువీర లేవరా! దీక్ష బూని సాగరా' గీతం జాతీయస్థాయి పురస్కారం అందుకుంది. 'చల్లని రాజా ఓ చందమామా', 'పాడవేల రాధికా ప్రణయ సుధా గీతికా', 'దేవుడు చేసిన మనుషుల్లారా – మనుషులు చేసిన దేవుళ్ళారా', 'కలసి పాడుదాం తెలుగు పాట – కదలి సాగుదాం వెలుగు బాట' వగైరా సినీ పాటలను తెలుగు చిత్ర సీమకు శ్రీ శ్రీ అందించారు.

దాశరథి తెలుగు సినీ గీతాలు ఆనాటి యువ భావకవులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో – ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో', తనివి తీరలేదే – నా మనసు నిండలేదే', 'నన్ను వదలి నీవు పోలేవులే – ఇది నిజములే', 'గోదారీ గట్టుంది – గట్టుపైన పిట్టుందీ' ... అసంఖ్యాకమైన లలిత గీతాలు దాశరథి కలం నుంచి జాలువారి రస హృదయాలను రంజింపచేశాయి.

'మనసుకవి'గా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేక గౌరవం పొందిన ఆచార్యఆత్రేయ తెలుగు పాటకు అందమైన అక్షరాకృతిని కల్పించారు. లలిత పదాలతో సన్నివేశానికి పరిపూర్ణతను చేకూర్చే విధంగా ఆత్రేయ పాటలు తెరపై ఆవిష్కృతాలై ప్రేక్షకుల మనసుల్ని గెలుచుకున్నాయి. 'పాడుతా తీయగా చల్లగా', నాలుగు కళ్ళు రెండైనాయి – రెండు మనసులు ఒకటైనాయి', 'తేట తేట తెలుగులా –తెల్లవారి వెలుగులా', 'మనసు గతి ఇంతే – మనిషి బ్రతుకింతే', 'సిగలోకి విరులిచ్చి – చెలి నొసట తిలకమిడి', 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా', 'ఈనాటి ఈబంధమేనాటిదో – ఏనాడు పెనవేసి ముడివేసెనో'... అక్షరలక్షల్లాంటి మధుర తేనె ఊటల ఆత్రేయ పాటలు తెలుగు వారి నాలుకలపై నడయాడుతూనే ఉంటాయి.

సమగ్రాంధ్ర సాహిత్య గ్రంథ కర్త ఆరుద్ర తన సాహిత్యసేవతో తెలుగు సినీ రంగాన్నీ మెప్పించారు. అరుదైన పద ప్రయోగాలతో తెలుగు పాటను కొత్త పుంతలు తొక్కించి భాషా ప్రేమికుల మన్ననలను దక్కించుకున్నారు. ఆరుద్ర లిఖించిన తెలుగు సినీగీతాలు అచ్చతెనుగు భావుకతకు సజీవ రూపాలు. ఉదాహరణకు 'మనసే అందాల బృందావనం', 'శ్రీరస్తు శుభమస్తు శ్రీకారం చుట్టుకుంది పెళ్ళిపుస్తకం','అమ్మ కడుపు చల్లగా – అత్త కడుపు చల్లగా – బతకరా','అదిగో నవలోకం – వెలసే మనకోసం', 'పచ్చని చెట్టు ఒకటి – వెచ్చని చిలుకలు రెండు' మొదలైన పాటలు రస రమ్య గీతాలై తెలుగు ప్రేక్షకులను అలరించాయి.

వినసొంపైన పదచిత్ర వర్ణనలతో తెలుగు వారి మనసు దోచుకున్న సి. నారాయణ రెడ్డి రాసిన పాటలు పండిత పామరుల ఆదరణ చూరగొన్నాయి. వ్యవహార భాషకు పెద్దపీట వేస్తూనే, అవసరమైన చోట సరళ గ్రాంథికాన్ని పాటలలో చొప్పించి భళారే అనిపించుకున్న ఆచార్య సి.నారాయణరెడ్డి వర్ధమాన తెలుగు గీత రచయితలకు



మార్గదర్శి. చెణుకులతో పాటలకు రససిద్ధి కల్పించిన భాషావేత్త నారాయణరెడ్డి. ఆయన సృజియించిన పాటలు మచ్చుకు కొన్ని ప్రస్తావించుకుందాం. 'నన్నుదోచు కుందువటే వన్నెల దొరసానీ', 'తెలుగు జాతి మనది – నిండుగ వెలుగు జాతిమనది', 'నీ ధర్మం, నీ సంఘం, నీ దేశం నువు మరవొద్దు', 'ఈ నల్లని రాళ్ళలో ఏకన్నులు దాగెనో', 'తెలిసిందిలే, తెలిసిందిలే, నెలరాజ నీ రూపుతెలిసిందిలే'.... పనస తొనలవంటి, పంచదార గుళికలవంటి ఎన్నో పాటలను తెలుగుసినీరంగానికి అందించిన ఆచార్య నారాయణరెడ్డి నిజంగా మేరునగధీరుడు. ఏకవీర చిత్రానికి నారాయణరెడ్డి సమకూర్చిన సంభాషణలు ఆయన పాండిత్యానికి ఉత్తమోత్తమ నిదర్శనంగా భాషావేత్తలు ప్రశంసించారు.

తెలుగుసినీ గీత రచయితలలో కొసరాజు రాఘవయ్యది ఒక విలక్షణ శైలి. పొడి పదాలతో జానపదులకు సైతం తేలికగా అర్థమయ్యే రీతిలో రాసిన తేట తెనుగు పాటలకు పెట్టింది పేరు కొసరాజు. భాషా పాండిత్య ప్రదర్శనకు ప్రాధాన్యతను ఇవ్వకుండా సులభంగా సుబోధకంగా ఉండేలా పాటలు రచించిన కొసరాజు రసరాజుగా తెలుగువారి హృదయాలలో చిరస్మరణీయంగా ఉండగలరు. 'మత్తు వదలరా – నిద్దుర మత్తు వదలరా', 'ఏరువాకా సాగారో', 'మా ఊళ్ళో ఒక పడుచుంది – దెయ్యమంటె భయమన్నది',

'దులపర బుల్లోడా – దుమ్ము దులపర బుల్లోడా', 'మా ఊరు మదరాసు – నా పేరురాందాసు', 'భలే చాన్సులే, భలే చాన్సులే'...కొసరాజు కలం ఒలికించిన భావగీతాలు ఎన్నో.. ఎన్నెన్నో.

మల్లెమాల, జాలాది, ఎం. గోపి... ఇంకా ఎందరో తెలుగు సినీగీత కవులు చలనచిత్రసీమకు అమూల్యసేవలు అందించారు. అనివార్యమైతే తప్ప తెనుగేతర భాషా పదాలకు వారి గీతాలలో చోటివ్వకపోవడం గమనీయం.

అనంతర కాలంలో తెలుగు గీత రచయితలుగా వేటూరి సుందర రామమూర్తి,

సిరివెన్నెల సీతారామ శాస్త్రి, భువనచంద్ర, చంద్రబోస్, వెన్నెలకంటి, భాస్కరభట్ల, భారవి, జొన్నవిత్తుల, సుద్దాల అశోక్‌తేజ, రామ జోగయ్య శాస్త్రి, వనమాలి, అనంత శ్రీరాం మొదలైనవారు ప్రసిద్ధులైనారు. తెలుగు భాషపై ఉన్న పట్టును ప్రదర్శిస్తున్నా గీత రచనలో అలవోకగా వచ్చి చేరుతున్న తెనుగేతర పదాల ప్రయోగం నేటి తరం కవులపై తేలికభావాన్ని ముద్రించడం సహజం. పాశ్చాత్య బాణీలను అనుకరిస్తున్న సంగీత దర్శకుల పర్యవేక్షణలో తెలుగు పదాలకు ప్రత్యమ్నాయంగా తెనుగేతర పదాలు ఆక్రమిస్తున్నాయి.

తెలుగుభాష అంతర్ధానమవుతుందన్న భయంతో భాషా ప్రేమికులు ఆందోళన చెందుతున్న దశలో ఇటువంటి భాషాసంకరం మరింత చేటు కలిగిస్తుందన్న వాదం సహేతుకమే. ప్రస్తుత సినీ కవుల భాషా పటిమను హ్రస్వదృష్టితో అంచనావేయక వారి సమర్ధతను పూర్తి స్థాయిలో వినియోగిస్తే పాత తరం పాటల సరసన కూర్చోబెట్టగల పాటలు పుట్టుకొస్తాయనడంలో సందేహమే లేదు. వేటూరి, సిరివెన్నెల మొదలు నేటి తరం యువకలాలు విశ్వా, శ్రీమణి, కృష్ణ చైతన్య వంటి రచయితలు తెలుగు భాష సుసంపన్నం కోసం తమదైన ముద్రతో ఇంద్రధనువు వర్ణాలవంటి పాటలను అందిస్తున్నారు.

సమాజాన్ని అత్యంత వేగంగా ప్రభావితం చేయగల సినిమా మాధ్యమాన్ని తెలుగుభాష ఔన్నత్యం కోసం సక్రమ రీతిలో సాధనంగా వినియోగిస్తే తెలుగు పాట భావితరాలకు మధురభాండంలా చేరువకాగలదు.



విమర్శ

# సాహిత్యవాదాలు సామాజిక వైషమ్యాలకు ఆజ్యం పోస్తున్నాయా?



-కొండ్రెడ్డి
వెంకటేశ్వర రెడ్డి
Ph: 99487 74243

అభ్యుదయవాదాలు మానవాళి మనుగడకు ఉషోదయాలై, మానవీయతకు మహోన్నత మార్గాలై, దోపిడీని ఎదిరించే ఉద్యమాలకు ఊపిరై విలసిల్లాలి. ఎల్లవేళలా మనిషితనాన్ని పరిమళభరితం చేయాలి. అభ్యుదయాన్ని కాంక్షించే సమస్త కళలు సమాజానికి చైతన్య దీపికలు కావాలి. కళలన్నింటిలోనూ మకుటాయమానమై నిలిచే సాహిత్యం, సామాజిక విధ్వంసక మూలాలను, నవ నాగరికత వ్యామోహంతో రూపిస్తున్న సామాజిక రుగ్మతలను, ధ్వంసించేందుకు తోడ్పడే ఆయుధం కావాలి. మానవాభ్యుదయానికి ఆయువు పోయాలి. మానవత్వానికి మారాకు తొడగాలి.

సాహిత్యదృక్పథం ఎప్పుడూ వర్గ, వర్ణ, కుల, మతరహితంగా మనిషి మనుగడే ధ్యేయంగా సాగిపోవాలి. ఇలాంటి లక్ష్యాలతో, మార్గాల్ని అన్వేషిస్తూ సరికొత్త చూపుతో ముమ్ముందుకు పోవాల్సిన సాహిత్యంలో వివిధ వాదాలు పుట్టుకొచ్చాయి. మత, రాజకీయ, కవితోద్యమాల తరువాత 'జెండర్' ప్రాతిపదికగా స్త్రీవాదం; కులాల ప్రాతిపదిగ్గా దళితవాదం, బి.సి వాదం; మైనారిటీ వాదం; అస్తిత్వవాదంతో పాటు ప్రాంతాల వివక్షతను ఎత్తిచూపుతూ 'ప్రాంతీయవాదం' వెలుగులోకి వచ్చాయి. ఈ వాదాలన్నీ వారివారి మూలాలను తవ్వుకుంటూ, వారి ఆవేదనలను, అసమ్మతిని, అనుభవాలను, దోపిడీవైనాన్ని వ్యక్తీకరిస్తూ ముందుకొచ్చాయి. దోపిడీని నిలువరించే పోరాటపటిమను, దౌర్జన్యాలను అడ్డుకునే ఆరాటశక్తిని, ఆయా వర్గాల్లో నింపి ఎదుర్కొనే చైతన్యాన్నిచ్చే బంధనాశక్తిగా సాహిత్యం రూపుదాల్చింది. దీని ఫలితమే ఆయా వర్గాలకు సొంత గొంతుకతో, ఓ కొత్తచూపు, తిరుగుబాటు చైతన్యం, ఆర్థిక, రాజకీయ, పురోగామి దిశగా పయనించే మార్గాన్వేషణ అలవడి కొన్ని విజయాలను సాధించాయనే చెప్పొచ్చు. సామాజిక నూతన మలుపుకు ఈ వాదాలు దోహదపడినాయనడంలో ఎట్టి సందేహమూ లేదు.

తొలిదొల్తగా ఈ వివాదాల్లోంచి పుట్టుకొచ్చిన సాహితీవేత్తలు నిబద్ధత, నిజాయితీ, సంఘటిత శక్తి, ప్రతిఘటనాపటిమ, సృజనాత్మకత, విస్తృతి, గొప్ప కళాభివ్యక్తితో

కూడుకొని ఎంతో నిజాయితీగా పరిఢవిల్లారనే చెప్పుకోవచ్చు. క్రమేపి ఈ స్ఫూర్తి అన్నివాదాల్లోను, మసకబారి, వ్యక్తి స్వార్థంలోకి జారిపోతూ, కుహనామేధావి వర్గాల స్వార్థపరత్వానికి తాళంవేస్తూ, నానాటికీ నైతికంగా దిగజారిపోతున్న తీరు స్పృహతో ఉన్నవారెల్లరకు విదితమే! ఈ విధానాన్ని నిస్వార్థపరిశీలనతో, ఆయా వర్గాల కవులు, రచయితలు తమ సాహిత్యాన్ని పునర్ మూల్యాంకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు కనిపిస్తున్న వర్ణాగ్రహాలు, వర్గాగ్రహాలు, జెండర్ ఆగ్రహాలు, ధర్మాగ్రహాలుగా తలపించడం లేదు. ఇందులో ఏ కొత్తకోణం కనిపించడం లేదు. అధిక్షేపధోరణులన్నీ ఆగడాలుగానే, అన్యాయంగా వేపుకుతినే పోకడలుగానే, రూపుదాలుస్తున్నాయని బాధితులు వాపోవడం చూస్తూనే ఉన్నాం.

నేడు కొందరు కవులు, రచయితలు నడుస్తున్న కాలాన్ని, నేటి సామాజిక స్థితిగతుల్ని, కొత్తచూపుతో, సరికొత్త కోణాల్లో చూడకుండా, అవగాహనించుకోకుండా, గత మూడుదశాబ్దాల నాటి ముచ్చట్లనే, తిప్పితిప్పి రాస్తూ కుల, మతాల మధ్య చిచ్చురేపుతున్నారు. నిజాలను గుప్పిట పడుతున్నారు. సర్దుకుపోగల సమస్యలను పెద్దది చేసుకుంటున్నారు.

నిజం మాట్లాడాలంటే, నేటి సమాజంలో కాలానుక్రమముగా ఉద్భవిస్తున్న సరికొత్త సమస్యలను పట్టుకొని, అవి ఏవిధంగా వర్గాల్లో, వర్ణాల్లో విషాన్ని విరజిమ్ముతున్నాయో, వీటిమూలంగా మనుషులు ఏవిధంగా పరాయీకరణ చెందుతున్నారో లోతుల్లోకెళ్ళి కవులు, రచయితలు పసిగట్టటం లేదు. వస్తుదర్శనం ఈ కోణాల్లోంచి చేయడం లేదు. సమాజంలో తలెత్తిన విపత్కర సమస్యను ఒక చట్టమో, లేక ప్రజాగ్రహమో, రూపుమాపిందనుకుంటామేకాని, ఆ సమస్య, అడ్డుకొన్న అవరోధాల వల్ల తను రూపం, కోణం మార్చుకుంటుంది. సరికొత్త లక్షణాలతో సమాజాన్ని పట్టిపీడిస్తూనే వుంటుంది అనే విషయాన్ని సాహితీవేత్తలు ముఖ్యంగా పసిగట్టాల్సిన అవసరం వుంది. తదానుగుణ్యంగా సాహిత్యసారం కూడా మారాల్సిన ధర్మం ఉంది.



ప్రపంచీకరణ ఫలితంగా, కార్పోరేట్ వాణిజ్య విధానాల వలన, కుల, మత, భేదరహితంగా అన్నివర్గాల్లోకి బూర్జువా భావజాలం, పెత్తనందారీతనం, దోపిడీతత్త్వం, నీతినిజాయితీ లేమి, వారికి ఎరుక లేకుండానే ప్రవేశించడం ఈ కాలధర్మంగా భావించాల్సి ఉంది. సమా జంలో నాటుకుపోతున్న ఈ అదృశ్య అగాధాలను సాహితీ వేత్తలు పసిగట్టాలి; పూడ్చగలిగే భావాల్ని అందివ్వాలి.

ఆయా వాదాల్లో వర్గాల్లో కలంపట్టిన కవులు 'కమిటెడ్' కవులుగానే మిగిలిపోతూ, ఆయా వర్గాల్లోకి దూరుతున్న దుష్టభావజాలాన్ని నిశితంగా ఖండించలేకపోతున్నారు. 'ఏనాటినుండో అరిగిపోయిన, విరిగిపోయిన, శిథిలమైన, భావజాలానికి తాకట్టు వడుతూ వాటికే తానతందాన' అంటున్నారు. వీరు అనంతాన్వేషణకు తెరలేపరు, పునర్ మూల్యాంకనం పట్టించుకోరు. సమస్యల రూప పరిణామ క్రియల మీద వాదోపవాదాలు, చర్చలు జరుపరు. సెమినార్లకు తెరలేపరు.



ఒకపక్క కులవృత్తులు నశించిపోతున్నాయి, కులాల కద్దుగా గీయబడిన లక్ష్మణరేఖలు చెరిగిపోతున్నాయి. అంటరానితనం అంతరించిపోయింది.

ఒకపక్క కులవృత్తులు నశించిపోతున్నాయి, కులాల కద్దుగా గీయబడిన లక్ష్మణరేఖలు చెరిగి పోతున్నాయి. అంటరానితనం అంతరించి పోయింది. కానీ కుల మతాల మధ్య మాత్రం కుమ్ములాటలు అలానే కొనసాగుతున్నాయి. మనం మొత్తంమీద గమనిం చాల్సింది ప్రతిమనిషిలోను ఆర్థిక వేటగాడు మాటువేసి వున్నాడు. ఉద్దరిగా వీలుపడే ఆర్థికవేటకు విల్లంబులు ఎక్కుపెట్టే వున్నారు. ఎవడి పరిధిలో వాడు, ఎవడి స్థోమతను బట్టి వాడు, వీలైనంతవరకు దోపిడీకి సిద్ధపడుతూనే వున్నాడు. ప్రపంచవ్యాప్తంగా నయా దోపిడీ విధాన పరిజ్ఞానం ఎక్కడనుండి ఇంపోర్టవు తుందో, ఎట్లా ఎక్స్ పోర్ట్ అవుతుందో, కారకులెవరో కనిపెట్టి బహిర్గత పరచాల్సిన బాధ్యత సాహితీవేత్త లందరి మీద వుంది. మూఢాచారాల ముసుగుల్ని హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం, ఎంతవరకు చీల్చి పారేస్తుంది? వ్యక్తి స్వార్థానికి, పదవీకాంక్షకు, ధన దాహానికి, సాహిత్య సిద్ధాంతాలు నీరుగారిపోకుండా ఎంతవరకు నిలబడగలుగు తున్నాయో ఆలోచించాల్సి ఉంది. సంప్రదాయవాదాన్ని ఒక కులానికి అంటగట్టి, వారందరిని టార్గెట్ చేసి హింసించడం ఎంతవరకు సమంజసమో తేల్చాల్సి ఉంది.

ఏ సాహిత్యవాదమైనా మారేకాలంతో పాటు మార్పును ఆహ్వానించాల్సిందే. వేదాల్లాగా వాదాలు పూజనీయం అనుకోవడం సరికాదు. సాహిత్యవాదాలెప్పుడూ సామాజిక వైషమ్యాలకు ఆజ్యం పోయకూడదు. మనిషితనానికి మచ్చతే కూడదు.

★ ★ ★

విమర్శ

# నేటి యూరప్‌లోని విద్యావిధానాలు

(భారతి_1945_issue1Vol22)



శ్రీ డి. యస్. శర్మ

నేటి నవీనకాలంలో యూరోపునందలి విద్యావిధాన సూత్ర క్రమమందు విచిత్రమైన పరిణామం గోచరము కాజొచ్చింది. యూరోపుచరిత్రలో ఆధునిక యుగమన్నది 14వ శతాబ్దం నాటి సంప్రదాయ విద్యా పునరుద్ధరణతో ప్రారంభ మయినట్లు చెప్పవచ్చు. నాటి మొదలుకొని యింతవరకు వరుసగా (కావలసినంత కలగాపులగంగానే అనుకోండి) నాలుగు సూత్రపద్ధతులు చూపట్టాయి. వాటిని మనం మానవీయ సూత్ర పద్ధతి అనీ, వాస్తవిక సూత్ర పద్ధతి అనీ, ప్రాకృతిక సూత్రపద్ధతి అనీ, సామాజిక సూత్ర పద్ధతి అనీ నాల్గింటినీ నాలుగు పేర్లతో పిలవవచ్చు. ఆ చతుస్సూత్రి (Humanistic Theory; Realistic Theory; Naturalistic Theory; Sociological Theory.) ఊదిఉద్ఘాటిస్తూ వున్న విద్యావిశేషాలను సమ్యగ్విచారణ చేసి, వాటిని మన ప్రాచీన భారతదేశంలోని విద్యాసూత్రక్రమాలతోనూ, ఆచరణప్రచారణలతోనూ పోల్చి పరిశీలించడం అతి ఆహ్లాదకారిగా ఉండగలదని నా విశ్వాసం.

యూరపులో పైన చెప్పిన మానవీయ విద్యాసూత్రక్రమమన్నది సంప్రదాయబద్ధమైన కావ్యవిద్యా పునరుద్ధరణకు సాక్షాత్ ఫలితంగా ఏర్పడింది. ఈ పద్ధతి ప్రకారం గనక చూస్తే సలక్షణమైన వాఙ్మయాన్ని పిల్లలచేత లక్షణంగా చదివింపజేసి, వారి కవి చక్కగా బోధపడేటట్టు చేయడమే పిల్లల విద్యాబోధనకు ప్రశస్తమైన మార్గంగా ఏర్పడుతున్నది. ఎందుకంటారేమో! కావ్యవాఙ్మయమనేది మానవీయ మహిత అనుభవాలకు మహోత్తమమైన ఆకారం వంటిది. కావ్యవాఙ్మయంలో యుగయుగాల నాటి జ్ఞాన పుంజమంతా నిండి నిబిడీకృతమై వుంటుంది. ఏతావాతా ఏమి చేయవలసి వుంటుందంటే, పసిపిల్లలు చదువనూ రాయనూ నేర్చిన వెనువెంటనే వారు గ్రీకు లాటిను గ్రంథాలను చదివి అర్థం చేసుకొని సరిగా సమన్వయపరచుకొనేటట్టు వారికి నేర్పవలసి వుంటుంది. ఈ పని నెరవేర్చవలెనంటే, మరి వారికి ఆ భాషల వ్యాకరణ పరిజ్ఞానం అత్యవసరంగా ఏర్పడింది. దాని ఫలితంగా లెక్కలేనన్ని వ్యాకరణపు బళ్ళు బయలుదేరాయి. వాటిలో కావ్యకలాపం క్రమానుక్రమణికగా నేర్పుతూ వచ్చారు. శిక్షణ సమస్తమూ భాషావాఙ్మయాలకు మాత్రమే నియంత్రితమవుతూ వచ్చింది. పిల్లలందరూ ఈ ప్రాచీన భాషల వ్యాకరణాల్లోని వివిధ సూత్రాలనూ కంఠాపాఠంగా



విధిగా నేర్వవలసి వచ్చింది. ఆ నేర్వడం కూడా వట్టినే కాదు. ఉదాహరణ ప్రత్యుదాహరణతోనూ, అపవాద ప్రత్యపవాదాలతోనూ సహా నేర్వవలసి వచ్చింది. పురాణ కావ్యవాఙ్మయంలోని గాథోపగాథల వివరాలనన్నిటినీ కూడా వారు వాటి భూగోళ విశేషాలతోనూ, చారిత్రక సన్నివేశాలతోనూ సహాక్రమంగా తెలుసుకోవలసి వచ్చింది. ఈరీతిగా వారు పాత్రపరిశీలన చేసి ప్రస్తుతించడమో, లేక జీవితంలోని ఉన్నతోన్నతమైన ఆదర్శాలతో సానుభూతి కనపరచడమో చేయగలిగేలోపుగానే వారి మనస్సులు వట్టి నిష్ప్రయోజనమైన జ్ఞానపుంజంతో తలమున్కలుగా క్రుంగిపోవలసి వచ్చింది. ఇంతకూ ఆమానవీయవిద్యావిధానం మనసులోపెట్టుకొని యుండిన ఆదర్శమేమో తెలుసునా? కావ్యవాఙ్మయనిష్ణాతుడే ఆ విధానానికి ఆదర్శమూర్తి. కాని ఆ ఆదర్శాన్ని అందుకొని ఆదరించడానికి పూర్వం ఈ విద్యావిధాన ప్రయత్నాలలో బోలెడంత దండగమారి వ్యవహారం జరుగుతూ వచ్చింది. ఆదర్శాన్ని అందుకోగలిగిన పిమ్మట కూడా అందులో ఏవో అనేక జీవితావసరాలు లోటుపాటుకు లోనైయున్నట్లు ద్యోతకమయ్యేది. ఈ పద్ధతిమీద సంపూర్ణంగా ఆధారపడిన విద్య గట్టిగా చేయగలిగితే గనక చిత్తసంస్కారంగల చిన్మయవ్యక్తిని – సౌందర్యమంటే చెవికోసుకొనే సహృదయుణ్ణి – మానసిక వాసనలలోని మహితచ్ఛాయలను ప్రస్తుతింపగలిగే మహితాత్ముణ్ణి – మానవ ప్రకృతిని గురించిన పరిజ్ఞానం ప్రకృష్టంగా గలిగిన ప్రబుద్ధుణ్ణి సృష్టింపగలిగే మాటయేమో వాస్తవమే. కాని, అత్యధిక సంఖ్యాకమైన సందర్భాల్లో ఈ పద్ధతి నిజానికి మాటలు, మాటలు, మాటలు వట్టి మాటల పోగులైన మనుష్యులను మాత్రమే – తాము సాక్షాత్తుగా నివసిస్తున్న ఈ ప్రపంచమంటే యేమిటోకూడా సరిగా యెరుగని శుద్ధ బుద్ధ స్వరూపులను మాత్రమే – వాస్తవ జీవితంతో అణుమాత్రమైనా సంబంధ సంపర్కాలకు నోచుకోని ఛాందసులను మాత్రమే సృష్టింప గలిగింది.

ఈ మానవీయ విద్యావిధానానికి పరిణామఫలంగా వచ్చిపడింది రెండవదయిన

వాస్తవికవిధానం. ఏతత్సంప్రదాయవాదులు వాదిస్తూ వచ్చిందేమిటంటే? వారి ప్రకారం మనము మన పిల్లలకు నేర్పవలసింది అసలయిన వస్తువులను గురించి కాని వట్టి మాటలు కాదు. గ్రంథాల్లోని వ్యక్తులను గురించి చెప్పవలసింది వారి జీవితాలలోని వస్తుస్థితిగతులనే కాని వాటిని క్రీనీడలను కానేకాదు. ఈ వాస్తవిక ప్రపంచంలో బ్రతికి బాగుపడవలసిన బాలకులకు ఎంత మొత్తుకున్నా బుర్రకెక్కని వ్యాకరణాలతో సంకులమైన ఆ మృతభాషలు (గ్రీకు లాటిను) ఏమి అక్కరకు వస్తాయి? దేవుళ్ళూ, దేవతలూ అని లేనిపోని కల్ల బొల్లి కబుర్లతో నిండిన ఆ పాత పురాణగాథలు మాత్రం ఏమి ఉపయోగపడతాయి? ఇటువంటి చదువుకున్న చట్టుబండల పరిజ్ఞానం కంటె మబ్బులెలా ఏర్పడుతున్నాయి, ఋతువులెలా ఏర్పడినాయి, పంటలెలా పండుతున్నాయి మొదలైనటువంటి సర్వసాధారణమైన ప్రకృతి సూత్రాల పరిజ్ఞానమే ఎన్నోరెట్లు ఎక్కువ ఉపయోగకారిగా ఉంటుంది. చచ్చిన భాషలను పట్టుకొని, క్రియలేవి, కర్మలేవి – ప్రకృతులేవి, ప్రత్యయములేవి – వచనములేవి, విభక్తులేవి ఇత్యాది అనవసర ప్రసంగంకంటేనూ, స్వప్న సామ్రాజ్యసమానమైన పురాణోక్తస్వర్గంలోని కిన్నరకింపురుషాది దేవతాగణం యొక్క వంశావళీ నామావళీల పారాయణం కంటెనూ కూడా నేటికాలపు బాలకులకు భౌతికరసాయనాది శాస్త్రాల (పరినిష్ఠిత జ్ఞానం లేకపోతే పోయింది. పట్టుమని) ప్రాథమిక పరిజ్ఞానం ఏర్పడ్డా చాలు ఎంతో లాభకారిగా ఉంటుంది. మూడేమూడు ముక్కల్లో గనక చెప్పవలసివస్తే – విద్యావిధానానికి పరమప్రాప్యం శాస్త్రపరి జ్ఞానమూ, శాస్త్రీయపద్ధతుల పరిజ్ఞానమే అయి వుండవలెకాని భాషా సాహిత్యాలు వాటి ప్రాప్యం కారాదు; వస్తువులూ, వస్తువుల వాస్తవిక జ్ఞానమే దాని లక్ష్యం కావలెకాని కల్లబొల్లికట్టు కథలూ, కోటలకెక్కే వట్టిమాటలూ దాని లక్ష్యం కారాదు. ఈరీతిగా ఈ వాస్తవిక పద్ధతి హృదయంలో ఆరాధిస్తూ వచ్చిన ఆదర్శమూర్తి మన ప్రకృతి పరిజ్ఞానసీమావధులను విస్తరింపజేయడానికి బద్ధకంకణుడైన శాస్త్ర పురుషుడు. ప్రత్యేక దీక్షతో గనక పూనుకొని పనిచేసేటట్టయితే ఈ పద్ధతి సదా సత్యశోధనకి సాహసించే వివేకానందులనూ, మొక్కవోని ఉపకరణాలతో ప్రకృతి కార్యకలాపాలను గురించిన నిర్దుష్ట జ్ఞానంగల మేధావంతులనూ సృష్టింపగలిగేమాట యేమో వాస్తవమే. కాని, ఆదరాబాదరాగా పనిచేసేటట్టయితే ఇది

**స్వప్న సామ్రాజ్యసమానమైన పురాణోక్తస్వర్గంలోని కిన్నరకింపురుషాది దేవతాగణం యొక్క వంశావళీ నామావళీల పారాయణం కంటెనూ కూడా నేటికాలపు బాలకులకు భౌతికరసాయనాది శాస్త్రాల (పరినిష్ఠిత జ్ఞానం లేకపోతే పోయింది. పట్టుమని) ప్రాథమిక పరిజ్ఞానం ఏర్పడ్డా చాలు ఎంతో లాభకారిగా ఉంటుంది.**



అనేక సందర్భాల్లో కేవలమూ స్తబ్ధచైతన్యంతో కూడి చిత్తవికాసశూన్యమైనట్టి, నైతికనిష్ఠలేని, ధర్మాధర్మ పరిజ్ఞానరహితమైన యంత్రమూర్తులను మాత్రమే కనిపార వేస్తుంది.

ఇక మూడవదానికి వద్దాము. అది ప్రాకృతిక సూత్రపద్ధతి. ఈ పద్ధతి మూలంగా జ్యోతిశ్శాస్త్రంలో కోపర్నికస్ సూత్రపద్ధతి తెచ్చిపెట్టినంత విప్లవానికి సరిగ్గా దీటురాగల విప్లవమొకటి విద్యావిధానచరిత్రలో బయలుదేరింది. మానవీయ సూత్రవాదు లేమన్నారు? సారస్వాతశిక్షణ కావలెనన్నారు. వాస్తవిక వాదులేమన్నారు? శాస్త్ర శిక్షణ కావలెనన్నారు. ఆ ఉభయసంప్రదాయవాదులూ కూడా నేర్పవలసింది పదములా, లేక వస్తువులా అనే ఒక్క ప్రశ్న మీదనే వాదవివాదాలు పడుతూ వచ్చారు. ఇక ఈ తృతీయ పద్ధతి ఏమి చేసిందో చూడండి. నేర్పవలసినదేదో ఎలాగయినా కొల్లబోనివ్వండి, ఎవరికి నేర్పవలెనో వారిని ముందు కాస్త గట్టిగా గమనించండి అని అసలు విషయాన్నే పూర్తిగా మార్చివేసింది. దీనిప్రకారం చూడబోతే ఉపాధ్యాయుని లక్ష్యం పిల్లల పసిమనసులో యోగ్యతకు మించిన విషయాలను (పదాలను గురించే కానివ్వండి, లేదా వస్తువులను గురించే కానివ్వండి) బలవంతంగా నూరినూరి పోయడం కారాదు. ఆ పసిమనసుల్లోనూ ఒకే విధమైన మానసికశక్తులుండవు. ఒక్కొక్క పిల్లవానికి ఒక్కొక్క విధమైన సొంత అభిరుచులూ, సొంత అభిప్రాయాలూ, సొంత వాంఛలూ ప్రత్యేకంగా వుంటాయి. ఒక పిల్లవానికి సారస్వత శిక్షణ అవసరమై వుండవచ్చు. ఇంకొకనికి శాస్త్ర శిక్షణ కావలసి వుండవచ్చు. ఒకనికి భాషలను నేర్చుకోవలెననే అభిలాష ఉండవచ్చు; ఇంకొకనికి సారస్వతం మీద శ్రద్ధాసక్తులుండవచ్చు; మరో మూడో వ్యక్తికి ప్రయోగాలు చేసి చూడడంలో ప్రత్యేక వాంఛ ఉండవచ్చు; అదీ ఇదీకాక నాలుగోవానికి కొత్త కొత్త పరిశోధనలు సాగించడంలో ఎక్కువ కోరిక ఉండవచ్చు. కాబట్టి ఇందువల్ల ఏమి తేలుతున్నదంటే? అధ్యాపకుడైనవానికి పిల్లలమనస్సే ఎక్కువ ముఖ్యం కాని, వారికి నేర్పవలసిన విషయాలు అంత ముఖ్యమైనవి కావు.

ఉపాధ్యాయులైనవారు పిల్లల మానసిక తత్వాలను బహు శ్రద్ధగా పరిశీలించాలి. ఒక్కొక్క పిల్లవానిలోనూ గుప్తంగా అణగియున్న శక్తులను బయటికి జాగ్రత్తగా లాగి, వాటిని యథోచితంగా పెంచి పెద్దచేసి, ప్రతిపిల్ల వాని ప్రత్యేక వ్యక్తిత్వాన్ని పోదిగా పోషించడమే ఉపాధ్యాయులు ముఖ్య లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ పద్ధతివాదులు ఆదరించి ఆరాధించే ఆదర్శమూర్తి యెవరంటే? సర్వాంగీణంగా అభివృద్ధి పొందిన తన సహజశక్తులతో విలసిల్లే అసాధారణవ్యక్తియే వారి ఆరాధ్యమూర్తి ఒక విధంగా చూడబోతేనేమో ఈ పద్ధతి వారి వారికి దేవుడు ప్రసాదించిన శక్తి సామర్థ్యాలకు చక్కని దోహదం కల్పించి పెట్టింది; విద్యాశిక్షణను అవరోధం లేని పద్ధతుల మీద నడపనూ నడప గలిగింది. కానీ ఇంకొకవిధంగా చూడబోతే ఇది మనుష్యులను ఇంత వారిని అంతవారినిగా పేర్కొని, వారు ఉబ్బి తబ్బిబ్బు లయేటట్టు చేసింది; వారి వెర్రి వేషాలకూ, పిచ్చి పిచ్చి తలపులకూ ప్రోత్సాహమిచ్చింది; మీరు ఈయీ ఆదర్శాలు సాధించండర్రా అని వారికి ఏ ఆదర్శాలూ చూపించకపోయింది. అది అహంప్రత్యయాన్ని నేర్ప గలిగిందే కాని వికాసాన్ని నేర్పలేకపోయింది.

**అధ్యాపకుడైనవానికి పిల్లలమనస్సే ఎక్కువ ముఖ్యం కాని, వారికి నేర్పవలసిన విషయాలు అంత ముఖ్యమైనవి కావు. ఉపాధ్యాయులైనవారు పిల్లల మానసిక తత్వాలను బహు శ్రద్ధగా పరిశీలించాలి.**

19వ శతాబ్దంలో ఓ ప్రాకృతిక సూత్ర పద్ధతి యందు వ్యక్తిత్వం విషయమై కనపరచిన అతి మాత్రమైన ఊతంతో 20వ శతాబ్దమందు ఇంకొక కొత్తపరిణామం ఏర్పడింది. ఒకనిలోని ఒక వ్యక్తిత్వాన్ని మనం పెంచి పోషించవలెననుకొంటే ఆ మనిషి యే సంఘానికి చెందుతాడో ఆ సంఘ విషయం కూడా మనం జ్ఞప్తిలో పెట్టుకోవలసి వుంటుందని ఒక కొత్త సిద్ధాంతం వెల్లడిచేయబడింది. వ్యక్తిత్వాన్ని పట్టుకొని విద్యాసంబంధమైన ఒక శూన్యకాశంలో పోషించడానికి ససేమిరా వల్ల కాదు. ఒక పిల్లవానిని ఒక ఉపాధ్యాయుడు తరిఫీదు గనక చేయవలెననుకొంటే ఆ పిల్లవాని కర్మకాండ అంతా ఏ సంఘాని కోసమైతే ఉద్దిష్టమైయున్నదో ఆ సంఘంలో వాడు అతుకుకొని పోయేటట్టుగా వాని నతడు తరిఫీదు చేయాలి. తాను తరిఫీదు చేయదలచుకొన్నపిల్లవాడు ఒక ప్రజాస్వామిక సంఘానికి చేరినవాడై వుంటాడను కోండి. అప్పుడు వానికి ప్రజాస్వామిక సూత్రాలను బాగుగా మప్పి అందులో వానిని బాగా తయారుచేయాలి. లేక వాడు ఒక వ్యవసాయ కుటుంబానికి చేరినవాడై వుంటాడనుకోండి. అప్పుడు వానికి వ్యావసాయిక జ్ఞానాన్నే విస్తారంగా నూరిపోయాలి. వర్తక వాణిజ్యాల బాపతయితే వాటిలోనే వానిని సవ్యంగా తయారుచేయాలి. ఏతావతా, ఏమి తేలుతున్నదో తెలుసునా? మనం పెంచి పోషించవలసింది కేవల నిరంజనమయిన వ్యక్తిత్వం కాదు. మరి యేమంటే? సాంఘిక

వ్యక్తిత్వం. సాంఘిక వ్యక్తిత్వమంటే, మన వ్యక్తి ఏ సంఘానికి అయితే చేరివుంటాడో ఆ సంఘం సంబంధ బాంధవ్యాలతో సమేతమైన వ్యక్తిత్వమన్న మాట. ఈ సాంఘిక సమన్వయ సూత్రక్రమమే ఇటీవల కేవల సాహిత్య, కేవల శాస్త్రీయ విద్యాస్థానాల్లో వృత్తి, సాంకేతిక విద్యలు తామేర్పరచుకోవడానికి ఆస్కారం కల్పించింది. సాంఘికయంత్రంలో తన స్థానమందు తాను కూర్చొని, అది సక్రమంగా, సవ్యంగా ఆడేటట్టు చేయగల పూర్ణపురుషుడైన పౌరుడు ఈ సంప్రదాయవాదులకు ఆదర్శమూర్తి. అందువల్లనే ఈ మధ్య కొన్ని సంవత్సరాలబట్టి ఎక్కడ చూచినా మనకు 'పౌరత్వానికి శిక్షణ, పౌరత్వానికి శిక్షణ' అనే కేకలు పదేపదే వినిపిస్తూవున్నాయి. ఈ సాంఘిక సూత్ర పద్ధతి సర్వదుంబాలా రాజ్యాలలో దాని పరమావధి ప్రమాణానికి వెళ్ళింది. నాజీఫాసిస్టు రాజ్యాలలోనే చూడండి కావలిస్తే. అక్కడ పౌరత్వం కోసమై వ్యక్తులను తరిఫీదు చేయడమనేది ఎంత సలక్షణంగా సాగిస్తూవున్నారో కాస్త గమనించండి. వ్యక్తులనబడే వారందరూ రాజ్యాంగంలో తదేకంగా తన్మయులయి పోతున్నా రనడమే అందుకు తగిన తార్కాణ. అక్కడ వ్యక్తులకు నావి అంటూ వేరే అభిప్రాయాలు లేవు; వేరే విశ్వాసాలు లేవు; వేరే ఆదర్శాలు లేవు. రాష్ట్రీయ అభిప్రాయాలే, రాష్ట్రీయాదర్శాలే వారి అభిప్రాయాలూ, వారి విశ్వాసాలూ, వారి ఆదర్శాలున్ను. ప్రత్యేక వ్యక్తులనేవారు బ్రహ్మాండమై, మహాగందరగోళమైన రాజ్యాంగయంత్రంలో నిర్దుష్టమైన చిన్న చిన్న చక్రాలుగా ఉండవలసినవారు మాత్రమే.

**మనం పెంచి పోషించవలసింది కేవల నిరంజనమయిన వ్యక్తిత్వం కాదు. మరి యేమంటే? సాంఘిక వ్యక్తిత్వం. సాంఘిక వ్యక్తిత్వమంటే, మన వ్యక్తి ఏ సంఘానికి అయితే చేరివుంటాడో ఆ సంఘం యొక్క సంబంధ బాంధవ్యాలతో సమేతమైన వ్యక్తిత్వమన్నమాట.**

ఈ సాంఘిక సూత్రపద్ధతి మూలాన తలవనితలంపుగా వచ్చిపడ్డ ఈ ఫలితం ఇప్పుడు మళ్ళీ కొత్తగా ఒక విద్యాహృదయాన్వేషణకు దారితీస్తున్నది. విద్య యొక్క లక్ష్యం కేవలమూ ఉన్నపాళాన ఉన్న వ్యక్తిత్వమూ కాదు; ఉన్న పాళాన ఉన్న రాజ్యాంగపౌరత్వమూ అనిన్నీ మళ్ళీ క్రొత్త వక్కాణింపులు బయలుదేరాయి. అంటే, మరొక సూత్రపద్ధతికి – అయిదవదానికి అంకురార్పణ ఏర్పడిందన్నమాట. ఈ క్రొత్తదానిని ఆదర్శ సూత్ర పద్ధతి (Idealistic Theory) అనే పేరుతో పిలువవచ్చు. దీని అస్పష్టమైన నూతన స్వరప్రస్తారము ఇప్పటికప్పుడే ఈ యుద్ధపు మసకచీకట్ల వెనకలనుంచి వినవస్తూవున్నది. మానవుడు కేవలమూ రాజ్యాంగంలోని ఒక పౌరుడు మాత్రమే కాదని తెలియచేయబడింది. అతడు రాజ్యాంగంలో ఒక పౌరుడయ్యే ముందరమొట్టమొదట అతడు ఈ విశాలవిశ్వంలో ఒక కాపురస్థుడు. కాబట్టి ఈ విశ్వంలో తన స్థానమేదో అతడు తెలుసుకోవాలి. జీవితానికి నిజమైన లక్ష్యమేమిటో, దానిని

అందుకోవడానికి తాను ఏయే సాధనోపాయాలను అవలంబించవలెనొ కూడా అతడు తెలుసుకోవాలి. వట్టి జీవితోపాయాలను మాత్రమే కాక సుఖసుందర జీవితోపాయాలను కూడా అతడు బడి చదువుల కింద నేర్చుకోవాలి. విద్యవల్ల వృద్ధి చేసుకోవలసినవి అతని ప్రాకృతిక శక్తులొక్కటి మాత్రమే కావు. ధర్మాధర్మవివేచన చేయగలగడానికిన్ని, ఎక్కువ తక్కువ విలువలు రూపించగలగడానికిన్ని, మలిదాన్ని కాకుండా తొలిదాన్నే అనుసరించగలగడానికిన్ని సాధనభూతమైన ఆధ్యాత్మిక శక్తులను కూడా వాటితో సరిసమానంగా వృద్ధిచేసుకోవాలి. వ్యక్తిత్వం అన్నంత మాత్రంచేత ఒక్క నైసర్గిక మానవుని మహితస్వరూప కీర్తనమే కాదు; వానితో సరిసమానంగా ఆధ్యాత్మిక మానవుని మహితస్వరూపకీర్తనం కూడా దీని కిందికే వస్తుంది. మానవుడన్న ప్రతివానిలోనూ కొద్దోగొప్పో దైవికాంశ లేశమాత్రమయినా వుండనే వుంటుంది. ఏ రాజ్యాంగమయినా సరే, లేక ఏ సంఘమయిన సరే దాన్ని తన తన అవసరానుకూలాలకు అనుగుణంగా లొంగదీసుకోవడానికి సుతరామూ సాధ్యంకాదు. సాంఘిక వ్యక్తిత్వాన్ని తప్పక సమకూర్చుకోవలసిందే; అందుకు సందేహం ఎంతమాత్రమూ పనిలేదు నిజమే. కాని, ఆ సాంఘికవ్యక్తిత్వం సదా ఆధ్యాత్మిక వ్యక్తిత్వానికి లోబడిందిగానే వుండిపోవాలి. రాజ్యంలో కొంతమంది వ్యక్తులు రాజ్యాంగానికంటె ముందుదారి పట్టినవారు ఉండి, భావస్వాతంత్ర్యమూ వాక్స్వాతంత్ర్యమూ కలవారై, రాజ్యాంగచక్రప్రవర్తకుల నిర్ణయాల సందర్భంలో తాము వారితో సమానంగా కూర్చోగలిగినవారు ఉంటేనే ఆ రాజ్యం సక్రమపరిస్థితుల మీద ముందుకు వెళ్ళిపోగలుగుతుంది; శ్రేయస్సౌఖ్యాలకు ఉపకరణమూ కాగలుగుతుంది. కాబట్టి రాజ్యాంగం అనేది ఎన్నటికీ విద్యమీద గుత్తకు పుచ్చుకొన్నట్టుగా సంపూర్ణ పెత్తందారీ పెట్టుకోరాదు. అది చేయవలసిందల్లా ఏమిటంటే? కావలసింది కావలసినట్లు ద్రవ్య సహాయం చేయడమూ, జాతి మొత్తానికంతటికీ చదువు సంధ్యలబ్బేటట్టు చూడడమూ, విద్యాసంస్థలు సక్రమంగా, చక్కగా, నేర్పుతో నిర్వహింపబడేటట్టు నిఘా పెట్టివుండడమూ ఇవే వారు చేయవలసిందల్లా. లక్ష్యాలేమిటో, లక్షణాలేమిటో, పద్ధతులేవో, మార్గాలేవో మొదలైన తక్కిన తతంగాన్ని నిర్ణయించే పూచీయావత్తూ వారు సమాజంలోని విషయజ్ఞులయిన పెద్దల బుద్ధులకే విడిచిపెట్టాలి.

పరిశీలన చేసి చూస్తే ఈ అన్ని పద్ధతుల్లోనూ సత్యాంశలు ఉన్నట్టే కనబడుతున్నది. కాని, మనకే గనక నిజంగా చక్కని విద్యాప్రణాళిక కావలసివున్నట్టయితే ఈ అన్నింటినీ ఏకసూత్రానికి తెచ్చి కలిపివేయాలి. కేవల సారస్వత విద్యగాని, కేవల శాస్త్ర విద్యగాని, కేవల సాంకేతిక విద్యగాని, కేవల పారిశ్రామిక విద్యగాని, లేదా కేవల మతనైతిక విద్యలు గాని మన కార్యసాధనకు ఉపకరించేవి కావు. పాక్షికమైన ఈ అన్నిపద్ధతుల్లోనూ చెప్పినట్టి యావత్తు విద్యాప్రణాళికల విశేషాలనూ ఒక్కసూత్రానికి తెచ్చి సమన్వయ పరచి ఆచరణలో పెట్టవలసి వున్నది. ఆధునిక యూరోపియ విద్యావిధానాల

బాగోగులను గురించి ఇంతవరకూ సవివరంగా చర్చించడమయింది. ఇప్పుడు ఈ యూరోపీయ పద్ధతులనూ, భారతీయుల ఆచరణ ప్రచారణలను బట్టి ఊహింప నయ్యున్న ప్రాచీన భారతీయ విద్యాపద్ధతులనూ పరస్పరంగా పోల్చి చూచి మంచి చెడ్డలను తేలుద్దాము. బాగా పరీక్ష చేసి చూస్తే, బహుశా ఒక్క ప్రాకృతిక పద్ధతిని మాత్రం తప్పనిచ్చి మిగిలిన ఈ యావత్తు ఆధునిక పద్ధతులూ అలనాడు మన దేశంలో ఆదరించి అంగీకరించి ఆచరణలో పెట్టిన బాపతుగానే గోచరమవుతున్నది. ఇంకా ఒక మిక్కిలి ముఖ్యమైన విషయమేమిటంటే, యూరోపులో ఇటీవలనే పొడసూపిన ఆదర్శపద్ధతి, సాంఘిక పద్ధతులనేవి ప్రాచీన భారతదేశంలో ఏనాడో అసలు విద్యాప్రణాళికకే మూలకందంగా వుంటూవచ్చాయి. తమ ఆశ్రమాలకో, లేక తమ గృహాలకో మూలమూలలనుంచి శిష్యగణాలను ఆకర్షించుకొంటూ వచ్చిన మన సుప్రసిద్ధ గురుకులపతులందరూ రాజ్యాంగసంబంధాలకు దూరులై సర్వస్వతంత్రులైన వ్యక్తులుగానే తమ గురుకులాలను నడుపుకొంటూ వచ్చారు. ధర్మమే వారి అధ్యాపనలోకెల్లా సారములో సారముగా వుంటూ వచ్చింది. శిష్యులు కూడా వారివారి కులానుసారంగా వారి వారి పరిసరాల్లో సమ్మసరిగా ఇమిడిపోయేటట్టు మాత్రమే కాక అవసరమయితే ఆ పరిసరాలను అభివృద్ధి చేసుకొనేటట్టు కూడా తరిఫీదు పొందుతూ వచ్చారు. బ్రాహ్మణజాతి ఛాత్రులకు పురోహితులుగానో, లేక ఉపాధ్యాయులుగానో అయ్యేందుకు తగిన శిక్షణ ఇవ్వబడుతూ వచ్చింది. అలాగే క్షత్రియ శిష్యులకు యుద్ధవీరులుగానో, లేక పరిపాలకులుగానో అయ్యేందుకున్ను, వైశ్య శూద్ర శిష్యులకు వారివారి వర్తక వాణిజ్య కృషి పరిశ్రమలలోనూ దానిదానికి తగిన శిక్షణ ఇవ్వబడుతూ వచ్చింది. కాని, అందరి విషయంలోనూ అన్నిటా ధర్మమే సకలశిక్షణకూ మూలకందంగా వుంటూ వచ్చింది. ప్రతివిద్యార్థికీ వృత్తి శిక్షణ ఇస్తూ వచ్చారు. కాని, ఆ ఇవ్వడం మట్టుకు సర్వదా ఒక ఆదర్శాత్మక లక్ష్యంతోనే ఇస్తూ వచ్చారు. ఉపనిషత్తులో మనము చూస్తూ వున్నరీతిని ఆనాడు బ్రాహ్మణ బాలురకు నేర్పుతూ వుండిన విషయాల పట్టీలనూ బట్టి చూస్తే ఆ పాఠ్యప్రణాళికలలో వారివారి వృత్తివిద్యలే కాక వాటికి తోడు సారస్వతవ్యాసంగమూ, ఆనాటి శాస్త్రాల చదువూ కూడా కలిసియుండినట్టు కనబడుతున్నది. ఉదహరణకు కావలిస్తే ఛాందోగ్యోపనిషత్తులోని ఈ కథను చిత్తగించండి.

ఒకనాడు నారదుడు సనత్కుమారుని వద్దకు వెళ్ళి తనకు చదువు చెప్పమని అడిగాడట. అడిగితే, ఇంతవరకూ నీవేమేమి చదువుకున్నావో, ఏయే విషయాలు తెలుసో చెప్పమన్నాడట సనత్కుమారుడు. నారదుడు తనకు తెలిసినవన్నీ ఒక పట్టీకట్టి చెప్పాడట. ఆ పట్టీలో ఒక్క వేదాలు మాత్రమే కాక ఆనాటికి సారస్వత గ్రంథాలుగా ఉంటూ వచ్చిన ఇతిహాసాలూ, పురాణాలూ, ఆనాటికి శాస్త్రాలుగానూ, ఇతర కళలుగానూ వుంటూ వచ్చిన జ్యోతిర్గణితాలూ, తదితర అనేక విద్యలు కూడా

కనిపించాయి. ఇన్ని విద్యలు నేర్చి, ఆనాటి సారస్వతంలోనూ, ఆనాటి శాస్త్రాల్లోనూ ఇంత పరిజ్ఞానం సంపాదించి కూడా తనకు ఆత్మజ్ఞానమనేది ఒకటి లభించకపోబట్టి తన చదువు పూర్తిగా ముగియనట్లే నారదుడు తలపోశాడు.

జ్ఞానం అబ్బినవారికి మరి దుఃఖాలే వుండవని ఆయన ఎవరో చెప్పగా వినివున్నాడు. ఇన్ని చదువుల్లో ఆరితేరి ఇంత జ్ఞానభాండారం ఆర్జించివున్నా ఆయన ఇంకా దుఃఖాలకు దూరుడు కాలేకపోయినాడు. అందుకోసమని ఆయన విద్యలలోకెల్లా విశిష్టవిద్య అయిన ఆత్మవిద్య నేర్చుకొందామని వెళ్ళి సనత్కుమారుని ఆశ్రయించాడు.

ఈ కథవల్ల మనకు ప్రాచీనభారతదేశంలోని విద్యాప్రణాళిక ఆదర్శాలన్నీ స్పష్టంగా తెలియవస్తున్నాయి. ఆనాటి విద్యాప్రణాళికలో కనిపించిన లోపమల్లా ఒక్కటే. అది యావద్దేశ ప్రచార దృష్టితో సాగకపోయింది; పూర్తిగా కులవిచక్షణలతో కొనసాగింప బడింది. అందువల్ల అది ఇంచుమించు అనేక సందర్భాలలో తొంభైతొమ్మిదిపాళ్ళు వృత్తివిద్యలతోనే పర్యవసిస్తూ వచ్చింది. అది యెల్లాగయినా పోనివ్వండి కాని ప్రాచీన భారతదేశంలోని విద్యాప్రణాళిక తన ఆదర్శాత్మకమైన గాడినుండి కాని, వృత్తివిద్యా ప్రధానమైన మూలసూత్రం నుంచి కాని ఏనాడూ దాటిపోయి దారితప్పి యెరిగింది లేదు. కుంఫిణీ ప్రభుత్వం బ్రిటిషు ఇండియాలోని విద్యావిషయక సమస్యలను స్వయంగా చేపట్టడానికి పూర్వం – మొన్న మొన్నటి 19వ శతాబ్ది ప్రారంభంలో కూడా మన యావత్తు గ్రామాలయందూ చిరకాలంగా నెలకొని పోయివుండిన ప్రాచీన పాఠశాలలు తమ పాత సంప్రదాయాలను లేశమయినా వదలకుండా ఆ వెనుకటి పాఠ్యక్రమాన్నే గట్టిగా అంటిపెట్టుకొని పల్లెటూరి పిల్లలకు యథాప్రకారంగా వ్రాతా, చదువూ, పల్లెటూరి లెక్కాచారాలూ, గ్రామసీమలను గురించిన లోకజ్ఞానమూ, ఈ అన్నిటికీ మించి ఇతిహాసపురాణాల మూలంగా ధర్మబోధా ఇత్యాది విషయాలను నిరాఘాటంగా సాగిస్తూనే వుండినాయి. అటుపిమ్మట మన దేశచరిత్రలో బ్రిటిషు యుగం ప్రారంభమయింది; ప్రాచీనకాలపు విద్యాబోధన పద్ధతులన్నీ అడుగంటి పోయాయి. నేటి మన పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ నేర్పబడుతూ వున్న విద్య (ఇతర లక్షణాలు ఎన్ని వుంటేనేమి గాక) వృత్తివిద్యాత్మకమూ, ఆదర్శస్వరూపమూ అయిన తన ఆధారం నుంచి పట్టు తప్పిపోయి వేరుదారి పట్టింది. నిర్జీవమైన ప్రణాళికలతో వేలాదిమంది నిరుద్యోగ యువకులను తయారుచేసి వారి నెందుకూ కొరగాని వారినిగా, ఎలాటి జీవితతత్వాలూ లేనివారినిగా, తరిఫీదు చేసి పాడుచేసింది.

**సంపాదకుని వ్యాఖ్య:**

ఈ వ్యాసం లోని అంశాలు ఈ రోజుకీ సజీవంగా ఉండడం ఆశ్చర్యాన్నీ, ఒకింత బాధనీ కలిగిస్తాయి. ప్రస్తుత విద్యా విధానం మీద కూలంకష చర్చకి ఈ వ్యాసం నాంది కావాలని నా అభిలాష.

హాస్య-వ్యంగ్య ప్రకాశిక

# ఫోను



వ్యంగ్యాత్మ
Sweet77479@
gmail.com

ఫోనుకీ భారతీయులకీ, అందులోనూ తెలుగువాళ్ళకీ మోగీమోగని ఫోనుకి అవినాభావ సంబంధం ఉంది. ఆ ఒక్క సీన్ కోసం విశ్వనాథ్ గారి సినిమా (స్వర్ణకమలం) చూసినవాళ్ళు వేవేలమంది ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో (ఆయ్.... ఇనపడతాందా ఆండీ ... ఆయ్....). ఫోన్‌కీ నాకూ కూడా సంబంధం ఉందండీ. లేకపోతే ఎందుకు రాత్తానండీ. కథలో 'నేను' లేకపోతే కథ ఎలా పుడుతుందండీ!

ఫోన్‌లో మాటాడుతూ ఆఫీసులో కుర్చీలో కూర్చుని ఫోటోలు తీయించుకునేవాళ్ళు, సెల్‌ఫోనులో మాట్లాడుతూ ఫోటోలు తీయించుకునే వాళ్ళు, నడుస్తూ నడుస్తూ, ఏదో సభలో మాట్లాడుతున్నప్పుడు, లేక మాట్లాడుతున్నట్లు ఫోటోలు దిగి ఫేస్‌బుక్‌కి అంకితమిచ్చేవాళ్ళు, సభలో స్టేజీమీద, ఆడియన్స్ లోనో ఉంటూ ఫోనులో మాట్లాడుతున్నట్లున్న ఫోటోలు ప్రొఫైలు పిక్చర్‌గా పెట్టుకునేవారూ, సభలో ప్రసంగిస్తుంటే అత్యవసరంగా వచ్చిన ఫోనులో "ఎప్పుడు అఘోరిస్తున్నారు? ఈ రాత్రయినా మగాడిలా వస్తారా లేక మృగాడిలానా?" అని గదవాయింపు గొంతు వినపడినా, తాను ఎంత బిజీగా ఎడతెరిపిలేని ఫోన్ కాల్స్ తో ఉంటాడో తెలిపేందుకు ఫేస్‌బుక్‌లో వీడియోపోస్ట్ చేసేవారూ... ఇలా ఎందరో ఫోన్ బాంధవ్యులు, బాధితుల కథలు, కథనాలు, విశేషాలు మనకి చాలా తెలుసు.


నా చిన్నప్పుడు అంటే ముద్దు మొహానికి, మొద్దు మొహానికీ, తేడా తెలిసే వయసు, అరవై నాలుగేళ్ళ సంగతి. మా ఇంట్లో ఒక విభాగంలో పోస్ట్ ఆఫీసు ఉండేది. సుమారు పదివేలమంది ఉండే గ్రామానికి అది పెద్ద పోస్టాఫీసు. అందులో పోస్ట్ కార్డులూ, ఇంగ్లాండ్ (inland) కవర్లు లాంటివి అమ్మడంతో పాటు ట్రంక్ కాల్స్ చేసుకునే సౌకర్యం కూడా ఉండేది. కన్నాల్లో ఉండే అంకెల్లో వేలుపెట్టి టిప్ టిప్



మని తిప్పి రిసీవర్‌ని చెవిలో పెట్టుకుని అలిసిపోయే వరకు అరిచే వాళ్లందరినీ చూశాను. ఎవరూ అవతలి నుంచి పలికి పలకరించకపోతే నిస్సహాయంగా విడిచిన నిట్టూర్పులు చాలా విన్నాను. అవతలి గొంతు వినిపించక, మాట్లాడుతుంటే తెగిన తీగలూ, బంధాలు, పగిలిన ఎదల రొదలు విన్నాను. ఇంతకీ "నీకు పనీపాటా, చదువు సంధ్య, బడీ దడీ లేవా" అని మీరు అడగవచ్చు. పల్లెటూరులో పాకబడిలో చదివే నాకు ఎండకీ వానకీ వచ్చే సెలవులు, జనాభాలెక్కలకీ జాతరకీ వచ్చే సెలవులతో ఏమి చేయాలో తెలియక, ఏమీ తోచక అరుగుమీద కూర్చునే అవకాశం తప్ప వేరే అవకాశం లేని నాకు పక్కనే ఉన్న పోస్టాఫీసులో జరిగే తంతు, తతంగాలు పరికించడం ఎంటర్‌టైన్‌మెంట్‌గాను ఎడ్యుకేషనల్ గాను ఉండేది. కొంచెం వర్షం పడితే చాలు ఫోను మూగబోయేది. పోస్ట్ మాస్టర్‌కి మూడ్ బాగోపోతే ఫోను సానుభూతిగ మౌనవ్రతం చేసేది. తరుచూ ట్రంక్ కాల్ చేయడానికి వచ్చేది మా ఊరి సర్పంచ్ మంచిగంధం సుబ్బారావు గారు మాత్రమే. ట్రంక్ కాల్ బుక్ చేసి కాల్ వచ్చేవరకు పట్టువదలని విక్రమార్కుడిలా అరుగుమీద, నాకు ఆవల పక్కన కూర్చొనేవాడు. ఆయన దగ్గర నుండి వచ్చే గంధం ఏమిటో అప్పుడు తెలిసేది కాదు గానీ అది సురనిశ్వాస అని పెద్దయ్యాక అనుభవంతో తెలిసింది. ఆయన ఫోన్‌లో ఘాటుగా మాట్లాడు తుంటే చాటుగా వినే నాకు పదకోశ అభివృద్ధి, సంస్కారోన్నతి కలిగేవి! వాటిని తరువాత బడిలోనూ, ఇంట్లోనూ ఉపయోగిస్తే ఎందుకు శిక్ష పడేదో అనుభవం ద్వారా తెలిసింది.





రాజీవ్‌గాంధీ, పి.వి నరసింహారావుగార్ల ధర్మంతో విరివిగా, విస్తృతంగా అందరికీ ఫోన్‌లు లభ్యమయ్యే కాలానికి, ఎక్కడో ఎవరికో (డబ్బు, దర్పం ఉన్న) ఫోన్ ఉండే కాలానికీ మధ్య ఉన్న సంధికాలంలో పెరిగిన నాకు వింత అనుభవాలు ఎదురయ్యేవి. ఫోన్ ఉన్నవాళ్ళు ఉన్నత వంశ దీపికలని భావించేవాళ్ళు. అలా ఆలోచించే వాళ్ళ కోవలో నేనూ ఉండేవాడిని. పెళ్ళంటూ చేసుకుంటే ఫోన్ ఉన్నవాళ్ళ అమ్మాయినే చేసుకుంటానని మనసులో శపథం చేసుకున్న వైనం ఇంకా గుర్తు ఉంది. విధి సహకరించడంతో ఆ నిర్ణయానికి కట్టుబడలేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే పనిచేయని ఫోన్ పెట్టుకుని బిల్డప్ ఇచ్చే




రాయుడిగారికి అల్లుడిని అయ్యే వాడిని. కొంచెం ముందుకు వెడితే, చదువూ/ అమెరికాలో H1B ఉద్యోగం, అన్ని హంగులూ ఉండే అపార్ట్మెంట్, అందులోనూ అడిగిందే తడవుగా, పోటీపడి ఫోన్ కనెక్షన్ ఇచ్చే MCI లాంటి కంపెనీలు; వీటిని చూసే సరికి గాలికొట్టి వదిలిన బుడగలాంటి అనుభూతి కలిగేది. ఫోనాధి పతినన్న గర్వం, దర్పం కొత్తల్లో కొంత ఉండేవని చెప్పడానికి సిగ్గుపడ్డా అది వాస్తవం. మంచం పక్కన, సోఫా పక్కన చేతికందిన ఫోనులో దర్జాగా అయిన వాళ్ళతో, కాబోయే వాళ్ళతో మాట్లాడుతుంటే ఎల్లలు లేని ఆనందానికి అధిపతిగా ఫీల్ అయ్యేవాడిని. అమెరికా వచ్చిన ఆరువారాలకి వచ్చిన ఫోన్ బిల్లు చూసి ఉక్కిరిబిక్కిరి అయి దిక్కుతోచక "ఇది నిజమా" అన్న సంభ్రమాశ్చర్యాలతో జారిపోతుందేమోనన్న గుండెని జారిపోనీయకుండా తమాయించుకున్న రోజులు గుర్తున్నాయి. కటింగ్స్ అన్నీ పోను చేతికొచ్చే నెలసరి ఆదాయం రెండువేలల్లో వెంటనే కట్టవలసినది 1100 డాలర్లు. మిగిలిన దానితో ఇంటి అద్దె, కరెంటు, కిరాణా సామాను, బయట తిండి, ఏపుగా ఆడక్కుండా పెరిగే జుట్టు కత్తిరింపు (అమెరికాలో జుట్టు కత్తిరించే వ్యక్తికి కూడా ఒక స్థాయి ఉంటుంది) మొదలయినవి. ఎంత గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త అయినా 900 లో నెల జీవితం కుదించడం అసాధ్యం. అప్పుడే అందొచ్చింది అమెరికన్ ఎక్స్ప్రెస్ కార్డు. అప్పుకాని అప్పు, ఘరానా అప్పు. కార్డు వాడాను. నెలరోజులు వెసులుబాటు దొరికింది. రాబోయే నెల గురించి అప్పుడే మొదలైన ఆందోళనతో కష్టపడి ఉగ్గబట్టుకుని ఫోన్‌కి దూరంగా ఉండేవాడిని. అయినా కాబోయే వారితో కలపడం కోసం అయినవారు చేసే ప్రయత్నం, ఎవరితోనో బంధం పెంచుకోవాలనే ఆతృత, ఫోనున్న ఆసామిననే అభిప్రాయం కల్గించాలన్న ఉత్సాహం; ఇదీ డోలాయమాన మనస్థితి.

ఫోను బిల్లుకీ, వాస్తవానికీ మధ్య సంఘర్షణ రాస్తే అమెరికోపనిషత్తు కావచ్చు. గోడకి తగిలే తీగల ఫోను నుంచి తీగలవసరం లేని సెల్‌ఫోన్ యుగంలోకి ప్రవేశించినప్పుడు ఆ అనుభూతి వేరు. ఎప్పుడైనా, ఎక్కడనుంచైనా, ఎవరితోనైనా మాట్లాడవచ్చనే స్వతంత్రభావన అద్వితీయం. కానీ నిమిషాలని డాలర్లలోకి మార్చే వ్యవస్థ అది. ఆ రోజుల్లో అమ్మ, అయినవాళ్ళు, ఆత్మీయంగా, అనంతంగా మాట్లాడేవారు. నా గుండె నిమిషానికి యాభై సెంట్స్(25 రూపాయలు) వేగంతో కొట్టుకునేది. బిల్లు కట్టే సమయానికి కళ్ళు ఆర్ద్రతతో చెమర్చేవి. కొండకచో,



బాష్పధారలు కురిసేవి. ఆ యుగం గడిచి మాట్లాడినంత మాట్లాడవచ్చనే ప్రణాళికలు వచ్చాయి. అమ్మతో, ఆప్తులతో మనసారా కాలనియంత్రణ లేకుండా మాట్లాడవచ్చని ఆనందించా. ఇప్పుడు అమ్మ తక్కువగా మాట్లాడుతుంది. ఆప్తులనుకున్న వారు వాట్సప్‌లో "హాయ్" చెబుతారు, చేతులు జోడిస్తారు. వేళ్ళు, చేతులు పైకి పెడతారు. ఇప్పుడు ఫోన్ అవసరం లేదు. మాటల మాధ్యమం ఇంకిపోయింది. ఎమోజీలతో భావప్రకటనలు చేసే అవకాశం రావడంతో, మాటలు రాసే అవసరం అడుగంటింది. మాట్లాడే గుణం చిన్నబోయింది.

మాట్లాడటం కోసం, సంక్షిప్త సమాచారం పంపిణీ కోసం, ఉపయోగపడే ఫోన్, ప్రపంచాన్ని చేతికి తెచ్చే గడుసు ఫోనుగా మారింది. అపరిమిత సంక్షిప్త సమాచార ప్రసారాలు, అనంతకాల మాటల అవకాశాలు అనతి కాలంలోనే అమలులోకి వచ్చాయి. భారతదేశంలో జియో ఆగమనంతో మాటలు, అంతర్జాల గమకాలు ధరాతీతం అయ్యాయి. ఆత్మీయతలు కుంచించాయి. అనుబంధాల తోరణాలు తెగిపోయాయి. మాట్లాడటానికి విషయం లేదు, మాట్లాడే ఇచ్ఛ లేదు, మాటల్లో మమత లేదు. గడియారంలో నిమిషాలున్నాయ్. నిమిషానికి వెలలేదు. మాటలున్నాయ్, మాటల్లో మమత లేదు. మనిషికి మనిషి అవసరం లేదు. సాంగత్యం ప్రతిబంధకమైంది. నిరాఘాటంగా, నిరంతరం దొరికే వస్తువులకి విలువ ఉండదు. అమితంగా దొరికే తిండికి రుచి ఉండదు. బాహాటంగా చూపే అందంలో ఆకర్షణ ఉండదు. రోజూ వచ్చే అతిథికి మర్యాద దక్కదు. ఎక్కువగా మాట్లాడే వారి మాటకి గౌరవం ఉండదు. కాల నియంత్రణ లేని ఫోన్ వ్యవస్థకి విలువ ఉండదు.

★ ★ ★

పరిశోధనా పత్రం

# తిలక్ కథలు – శిల్పసౌందర్యం

మొదటి భాగం




డా॥ పి.సి.వెంకటేశ్వర్లు
సహాయ ఆచార్యులు
9490164963

"కథను ఊహించడం ఒక ఎత్తు, దాన్ని చెప్పడం మరో ఎత్తు. కథ చెప్పే విధానమే కథకి అందాన్ని, బలాన్ని ఇస్తుంది. దీనినే శైలి, శిల్పం అంటారు. ఉత్తమ కథలతో గల పరిచయం వల్ల తన కథలలో ప్రతిభావంతుడైన రచయిత శిల్పాన్నీ శైలినీ విస్పష్టంగా రూపొందించుకోగలడు.

"కథలో ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికో బలపరచడానికో చేసే ప్రయత్నం కథాశిల్పంలో ఒక ముఖ్యమైన దోషం"

ఇవి కథాశిల్పం గురించి తిలక్ చేసిన స్పష్టమైన ఆలోచనలు. "కథలు రాయడం ఎలా" అనే వ్యాసంలో ఆయన చెప్పిన కథానిర్మాణ విషయాలు చాలా వున్నాయి. తిలక్ కథాశిల్పం విషయంలో లోతైన అవగాహన లేకుంటే, ఆయన కథలు అలాంటి సజీవ చిత్రాలుగా పాఠకుల్ని ఆకట్టుకునేవి కావు. ఆయనే స్వయంగా చెప్పుకున్నట్టు ఉత్తమ కథల్ని చదవడం వల్ల అలాంటి శిల్ప నైపుణ్యం అలవడింది.

"అతని మీద ఎవరి ప్రభావమూ, ఎవరి వస్తు శిల్ప శైలీ ప్రభావమూ లేవని చెప్పలేం. అందర్నీ ఊగించిన చలం, సోమర్సెట్ మామ్, మొపాసా ఎవర్ని వదలి పెట్టారు గనుక. అయినా ప్రత్యక్ష, బలోపేతమైన స్వకీయ ముద్ర. స్వతంత్రమైన అన్వేషణ, లోతూ, మెరుపూ అతను తిలక్ " అంటూ తిలక్ కథాశిల్పం పై ఎవరెవరి ప్రభావాలున్నాయో స్పష్టపరిచాడు మునిపల్లె రాజు. అదేవిధంగా కోడూరి శ్రీరామమూర్తి తిలక్ కథల తత్వాన్ని వివరిస్తూ ప్రేమ్ చంద్ 'కఫన్' సోమర్ సెట్ మామ్ 'Caker and Ale' వంటి కథల్లోని శిల్పం తిలక్ కథల్లో కన్పిస్తుందని చెప్పడంలో తిలక్ కథానిర్మాణంలో ఎవరి ప్రభావం వుందో తెలుస్తుంది. అంతేకాదు ఇంకా లోతుగా తిలక్ కథల్ని పరిశీలించి "శిల్పంలో మొపాసాకు దగ్గరగా కనపడతాడు తిలక్" అని చెప్పాడు కోడూరి శ్రీరామ మూర్తి. "ఆయన కథానికా ప్రక్రియ నియమాలను, పరిమితులను, లక్ష్యాలను అర్థం చేసుకోనే కథలు రాశాడు" అని అంపశయ్య నవీన్ చెప్పడంలో తిలక్ కథలు కథానికా శిల్ప లక్ష్యాలను కొనసాగించాడని అర్థమౌతుంది. మేరుపర్వతంలాంటి తిలక్ సాహిత్య శిల్పాన్ని అంచనా వేయడం అంటే సముద్రపు తరంగాల్ని గుప్పెట్లో చూపాలని




ప్రయత్నించడమే. నేను అర్థం చేసుకున్నంత మటుకు యువ పరిశోధకుల కోసం తిలక్ కథల్లోని కొన్ని శిల్పసౌందర్య విషయాల్ని చెప్పడం ఈ వ్యాసోద్దేశం.

శిల్పసౌందర్య విశిష్టతను గురించి వల్లంపాటి వారు “కథాసంవిధానం, పాత్రలు, నేపథ్యం, దృష్టికోణం, కంఠస్వరం’ అనేవి కథాంగాలుగా వుంటాయని, తన కథానిక శిల్పం’లో చెప్పుకొచ్చారు. పోరంకి దక్షిణామూర్తి కథాశిల్పాన్ని “వస్తు విన్యాసం, పాత్రచిత్రణ, సంఘటన, సంఘర్షణ, సన్నివేశకల్పన, కథనం, శీర్షిక’’’ అనే విభాగాలుగా వర్గీకరించాడు. రచయిత కథలో చెప్పేదాన్ని వస్తువని, ఎందుకోసం చెప్తున్నాడో అది ఉద్దేశమని, ఒక విధమైన పద్ధతిలో చెప్తాడు దాన్నే శిల్పమని అంటాడు ఖదీర్ బాబు’ ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచించినపుడు గొప్ప కథకుడైన తిలక్ తన కథలను ఒక పద్ధతిలో చెప్పాడు. ఒక ప్రత్యేకమైన శిల్ప నిర్మాణాన్ని ప్రదర్శించాడు. కథలకు పేర్లు పెట్టడంలో, కథల్ని ప్రారంభించడంలో, పాత్రల్ని నిర్మించడంలో, సంభాషణలు చేయించడంలో, కథనం చేయడంలో, వాక్యాల్ని నిర్మించడంలో, వర్ణనలు చేయడంలో, సాహిత్యపు సొబగులు అద్దడంలో, సంఘర్షణ, సంభావ్యత, స్థలకాలాదుల వంటి అంశాల నిర్వహణలో, తనదైన కంఠస్వరాన్ని విన్పించడంలో చివరికి కథా ముగింపులో తిలక్ కథాశిల్పం స్పష్టంగా కనిపిస్తుంది. కథ చదవడం ప్రారంభమైన కొద్ది సేపటికే అది తిలక్ కథ అని అర్థమైపోతుంది. అదే తిలక్ కథానిర్మాణపు ప్రత్యేకత.

### శీర్షికలు:

“మంచి శీర్షిక దొరికితే; దాని ఆధారంగా కథలు రాసే వారు వున్నారు. మంచి శీర్షిక దొరకనిదే కథారచన ఆరంభించని వారూ వున్నారు. కథ రాసినా, సరైన శీర్షిక దొరక్క నెలల తరబడి యోచించవలసిన అవసరం ఉంటుంది.’’ అంటాడు శార్వరి. ఈ మాటలు వెనుక అనేక మంది కథకుల అనుభవం ఉంది. కథకు పెట్టే పేరులోనే శిల్పానికి అంకురార్పణ జరుగుతుంది. కథకు శీర్షిక ఇంటికి గడపలాంటిది. అది ఎంత ఎత్తు, ఎంత వెడల్పు, అనేది నిర్మించబోయే ఇంటిని బట్టి వుంటుంది. అలాగే కథలో చెప్పబోయే వస్తువును గాని, సంఘటననుగాని, ఆధారంగా చేసుకొని రచయిత శీర్షిక నిర్ణయిస్తాడు. శ్రీశ్రీ ‘ఒసే తువాలందుకో’, పద్మరాజు ‘గాలివాన’ వంటివి సంఘటనను

ఆధారంగా చేసుకొని పెట్టిన శీర్షికలు. తిలక్ 'నలజర్ల రోడ్డు' కథా శీర్షిక అక్కడ జరిగిన సంఘటన ఆధారంగా పెట్టబడిందని కథ పూర్తయిన తర్వాత అర్థమౌతుంది. అలాగే 'రాత్రి 9 గంటలకు' అనే శీర్షిక ఆ సమయంలో నగరంలో జరుగుతున్న సన్నివేశాల్ని ప్రతిఫలింపజేస్తూ పెట్టబడింది.


కథలకు జంటపదాల శీర్షికల్ని పెట్టడం ఒక ప్రత్యేకత. అయితే తిలక్ కథా శీర్షికలు ఆ గాలివాటంలో పెట్టాడని ఖచ్చితంగా ధ్రువీకరించలేం గానీ ఆయన 'సుందరీ – సుబ్బారావు', 'మీరేనా – నీవేనా' కథా శీర్షికల్ని మాత్రం కథలోని సన్నివేశాల్నిబట్టి నిర్ణయించాడనిపిస్తుంది. అలాగే తిలక్ 'కదిలేనీడలు', 'ఏమీలేదు' వంటి ఆలోచనాత్మక కథా శీర్షికలను ఎంచుకున్నాడు. వీటిలోని పాత్రల తత్వం అర్థం చేసుకొనే విధంగా ఇలాంటి పేర్లు తిలక్ కథలకు పెట్టడం శిల్ప నిర్మాణంలో భాగమే. అదే విధంగా సామాజిక కోణం నుంచి సాగే కథలకు, మానవత్వం వాసనలతో నడిచే కథలకు 'ఓడిపోయిన మనిషి', 'అతని కోరిక' వంటి అర్థవంతమైన పేర్లు పెట్టాడు తిలక్. దొంగ ఎవరో తెలియపరిచే కథకు 'అసలు దొంగ' అని పేరు పెట్టాల్సిన అవసరం లేదు.

డొంక తిరుగుడు కథా శీర్షికలు తిలక్ శిల్ప నిర్మాణంలో భాగం కాదు. అందుకే 'దొంగ' సంక్షిప్త శీర్షికను మంచి భావం కుదిరేలా ఇమిడ్చాడు. బొమ్మచుట్టూ అల్లబడిన కథకు 'బొమ్మ' అని, ఉంగరం చుట్టూ తిరిగిన వ్యక్తి జీవితాన్ని వర్ణించే కథకు 'ఉంగరం' అని, ఒక వ్యక్తి జీవితం ఎలా రంగులరాట్నంలా తిరిగిందో చెప్పే కథకు 'జీవితం' అని, రకరకాల సంక్షిప్త శీర్షికల ద్వారా కథా భావాన్ని పలికించాడు తిలక్. సహజంగా కవి అయిన తిలక్ కొన్ని కథలకు 'గడియారపు గుండెలు' 'మణి ప్రవాళం' 'సముద్రపు అంచులు' వంటి కవితాత్మక శీర్షికలను పెట్టి తన శిల్ప నిర్మాణానికి ప్రారంభం చేశాడు.

**డొంక తిరుగుడు కథా శీర్షికలు తిలక్ శిల్ప నిర్మాణంలో భాగం కాదు. అందుకే 'దొంగ' సంక్షిప్త శీర్షికను మంచి భావం కుదిరేలా ఇమిడ్చాడు. బొమ్మచుట్టూ అల్లబడిన కథకు 'బొమ్మ' అని, ఉంగరం చుట్టూ తిరిగిన వ్యక్తి జీవితాన్ని వర్ణించే కథకు 'ఉంగరం' అని, ఒక వ్యక్తి జీవితం ఎలా రంగులరాట్నంలా తిరిగిందో చెప్పే కథకు 'జీవితం' అని, రకరకాల సంక్షిప్త శీర్షికల ద్వారా కథా భావాన్ని పలికించాడు తిలక్.**

## కథా ప్రారంభాలు:

"కథ అనేది గుర్రపు పరుగు వంటిది. ప్రారంభం, ముగింపు ముఖ్యం" అంటాడు మోపాసా. తిలక్ మొపాసా కథలతో ప్రేరణ పొందాడని ముందే చెప్పుకున్నాం. అందుకే



తిలక్ కథల్లో ప్రారంభాలు నత్తనడకన వుండవు. కథకుణ్ణి నేరుగా కథలోకి ప్రవేశపెడ్తాయి. ఇది తిలక్ శిల్ప లక్షణం. ప్రకృతి వర్ణనలు, సుదీర్ఘ సన్నివేశాలు వంటివి వెదకినా దొరకవు. పాఠకుడి దృష్టిని స్పష్టమైన ప్రదేశంలో, ఖచ్చితమైన సమయంలో, సరైన సందర్భంలో నిలబడేటట్లు వాక్యం ప్రారంభిస్తాడు. పాఠకుణ్ణి ప్రారంభపు మాటలతో బంధిస్తాడు.

తానే చూసినట్లు కథ చెప్పడం, పాత్రల చేత కథను చెప్పించడం వంటి ప్రారంభాలు వున్నా ఆసక్తిగా ఎత్తుగడ శిల్పాన్ని నిర్వహిస్తాడు తిలక్.

'నల్లజర్ల అడవి మీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు. అవధాని గారు ఇలా అనేటప్పటికి మేమందరం ఫక్కున నవ్వాం." అని నల్లజర్ల రోడ్డు కథలోని ప్రారంభ వాక్యాలు వేరే పాత్ర చేత రచయిత కథ చెప్పిస్తున్నాడనే విషయాన్ని, అడవిలో జరగబోయే సంఘటనల స్వరూపాన్ని సూక్ష్మంగా తెలియజేస్తాయి.

'యవ్వనం' కథలో 'ఆ రోజు విశాలలో ఎప్పుడూ లేని ఉత్సాహం సముద్రపు కెరటాల్లా పొంగింది." ప్రారంభ వాక్యాలు కథను సూచన ప్రాయంగా తడుముతూ సాగుతాయి. సముద్రపు కెరటపు పొంగు ఉపద్రవ సూచకంగా పాఠకుడికి అర్థమై, కథలోకి జొరబడేలా చేస్తాయి ప్రారంభవాక్యాలు. 'ఫలిత కేశం' కథలో "ప్రసాదరావు అద్దం ముందు నిలుచున్నాడు. అతనికి తనని తాను తీరికగా చూసుకోవాలనిపించింది. అందులో ఏదో తృప్తి వుంది. అహం వుంది అనే ప్రారంభ వాక్యాలు ఎంతో హాయిగా ప్రశాంతంగా కథలోకి తీసుకెళ్తాయి. వివేచనా శక్తిగల పాఠకుడు తొలి వాక్యంలో తిలక్ భావాల లోతును తర్కించుకోవచ్చు. అద్దం నిజం చెప్తుంది. వాస్తవాన్ని కాదు. నిజం వేరు వాస్తవం వేరు. ఉన్న రూపాన్ని ఉన్నట్టు చూపడం నిజం. కుడిని ఎడమగా చేసి చూపడం వాస్తవం. చిన్న తత్వాన్ని పట్టుకుంటే ప్రారంభ వాక్యాల్లో తిలక్ శిల్ప సౌందర్యం అర్థమౌతుంది. కథలో ప్రధాన పాత్ర నిజం గురించి ఆలోచించాడు. వాస్తవం గుర్తించలేక పోయాడు. 'బొమ్మ' కథలో ఎత్తుగడ శిల్పాన్ని వ్యాఖ్యానంలా చెప్తాడు తిలక్. 'ఆ పెద్దనగరంలో మార్కెట్టులో ఒకచోట బల్ల మీద ఓ ఆడది కూర్చుని వుంది. ఆమె చాలా అందమైనది. లావణ్యమైనది....... ఆమె ఎవరో ఎవరికీ తెలియదు' అంటూ సాగిన వాక్యాలు తాను చెప్పబోయే సమకాలీన సమాజంలోని వ్యక్తుల మానసిక స్థితిని పట్టి చూపిస్తాయి. కొందరు వ్యక్తులు ఆమెను ఉల్లేఖాలంకారంలోలాగా ఎలా ఊహించారో చెప్పడానికే కవి అలాంటి పెద్ద ప్రారంభం చేశాడు. 'ఓడిపోయిన మనిషి' కథను 'తెరచి ఉన్న కిటికీలోంచి వొంటి మీద జల్లుపడి చటుక్కున మెలకువ

వచ్చింది కళ్ళు తెరచి కిటికీలోంచి చూశాను.' అనే ఆలోచనాత్మకమైన ఎత్తుగడతో ఆరంభిస్తాడు తిలక్. 'కళ్ళు తెరచి చూశాను' అనడంలో అంతకుముందు కళ్ళు తెరవకుండా సమాజాన్ని చూసిన ఒక వ్యక్తిని పరిచయం చేయబోతున్న రచయిత శిల్ప నిర్మాణ దక్షత అర్థమౌతుంది.

## పాత్ర నిర్మాణ శిల్పం:

తిలక్ పాత్రకు పెట్టే పేర్ల విషయంలోను, పాత్రలు నిర్మించే క్రమంలో ప్రత్యేక శిల్పాన్ని ప్రదర్శించాడు. లోకం పోకడ తెలియని పురుషులకు ఆ రోజుల్లో 'సుబ్బారావు' అనే పేరు పెట్టి వ్యంగ్యంగా పిలిచే పరిస్థితి. మునిమాణిక్యం వారి కథల్లో భర్త పాత్రలో అమాయకపు సుబ్బారావు కన్పిస్తాడు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి గురించి తెలిసిందే. అలాంటి ఉద్దేశంతోనే కాబోలు సెకండరీ గ్రేడు స్కూలు మాస్టరులోని అమాయకత్వాన్ని చెప్పడానికి 'సుబ్బారావు' అనే పేరు పెట్టాడు 'సుందరీ–సుబ్బారావు' కథలో అలాగే స్వచ్ఛమైన వ్యక్తిత్వంగల స్త్రీలకు నిర్మల (నిర్మల మొగుడు), స్వేచ్ఛా ప్రవృత్తిలో జీవించాలనుకొనే స్త్రీకి విశాల(యవ్వనం), ధైర్యం, చురుకుదనం గల యువతులకు సూర్యుడు(నల్లజర్ల రోడ్డు) వంటి పేర్లు పెట్టాడు.

ఇక పాత్రలను మలచిన పద్ధతిని తిలక్ కథల్లో ప్రత్యేకంగా గమనించాలి. పాశ్చాత్య పాత్ర నిర్మాణ పద్ధతి తిలక్‌లో కనిపిస్తుంది. ప్లాట్ క్యారక్టర్స్ (సరళరేఖ పాత్రలు) రౌండ్ క్యారక్టర్స్ (గుండ్రని పాత్రలు) రెండూ తిలక్ కథల్లో వున్నాయి. మనిషి ఎంత ఉన్నతంగా వుండగలడో చూపిస్తాడు. ఎంత పతనమవుతాడో చూపిస్తాడు. ఎలాంటి ఒడిదొడుకులు లేని మనిషిని చూపిస్తాడు. అనైతికతతో పక్కవారిని నిరంతరం హింసించే మనిషిని రూపుకట్టిస్తాడు. ముసలి మనిషి (ఊరిచివర యిల్లు), నరసమ్మ (సముద్రపు అంచులు) వంటి పాత్రలు స్వార్థంతో, నమ్మిన మనిషిని వంచన చేయడంలో స్థిరంగా నిలబడిపోతాయి. వారి స్వభావంలో కథ ముగిసేవరకు మార్పురాదు. అలాగే వాస్తవికంగా పాత్రల్ని నిర్మించడం తిలక్ విలక్షణత. శంకరం (పరివర్తన), గవరయ్య (దేవుణ్ణి చూసిన వాడు), సీతాపతి (సీతాపతి), గోపాలం (దొంగ) వంటి పాత్రలు వాస్తవాల్ని గ్రహించి తాము మారాలని అర్థం చేసుకుంటాయి. గతంకంటే భిన్నంగా తమ దిశను మార్చుకుని జీవించడానికి సిద్ధపడుతాయి. వెంకటేశ్వర్లు (ఆశాకిరణం) లక్ష్మీమోహన్ రావు (అతనికోరిక) వంటి పాత్రలు పలాయన వాదానికి, అసమర్థతకు శాశ్వత చిరునామాగా చూపిస్తాడు రచయిత. కూతురు వ్యభిచారిణిగా మారిందని తెలిసి, చావును వాయిదా వేసుకొనే తండ్రి, కొడుకు చనిపోయినాడని తెలిసి పెళ్ళాం పుస్తెలతో వేశ్య సాంగత్యం కోసం వెళ్ళిన వ్యక్తి వంటి పాత్రలను నిర్మించడంలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు తిలక్.

★ ★ ★

దృక్కోణం

# కరోనానంతరకాలం



డా. కొవ్వలి గోపాలకృష్ణ
editor@prakasika.org

గతసంవత్సరం ఈ సమయానికి కరోనా వాడల్లోనే ఉంది. ఊహాన్ నగర సమస్యగానే పరిచయం అయింది ప్రపంచానికి. మొదట్లో చాలా మంది సమస్య త్వరలో సమసిపోతుందని ఊహించారు. కరోనా వైరస్ గురించిన వివరాలు బయటపెట్టిన చైనా డాక్టరు మరణంతో సమస్య అంతర్జాతీయ స్థాయి సమస్యగా రూపొందింది. ఆంతరంగిక భద్రతావ్యవస్థ హెచ్చరించినా పెడచెవిన పెట్టి, కరోనా ఒక 'మిథ్య'గా, 'గాలివార్త'గా అగ్రరాజ్య పాలకులు కొట్టిపారేశారు. ఆదిలోనే తగిన జాగ్రత్తలు తీసుకొని ఉండి ఉంటే అగ్రరాజ్యంలో లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయేవారు కాదు. కోట్లాదిమంది కోవిడ్ బారిన పడేవారు కాదు. ఆర్థిక, సామాజిక వ్యవస్థ ఇంతగా చితికేది కాదు. విచిత్రమేమంటే, ఇలాంటి ఉపద్రవాలు వస్తాయని తెలుసు. వస్తే ఎలా ఎదుర్కోవాలి అన్న విషయం మీద విస్తృతప్రణాళికలు తయారుచేసి ఉంచారు. ఉపద్రవనివారణశాఖ కూడా ఉంది. ఎప్పుడో ఏదో రావచ్చని ఈ శాఖవారిని కూర్చోపెట్టి మేపడం ఎందుకని వారిని ఇంటికి పంపేశారు. ప్రణాళికలని తగలబెట్టేశారు.

ముసుగు అవసరం లేదు, ముసుగు 'బలహీనతకి నిదర్శనం' లాంటి సెంటిమెంటులతో అగ్రరాజ్యం సమస్యకి ముసుగు కప్పింది. రాజకీయాలు, అరాచకాలు, అబద్ధప్రచారాలు, అసంబద్ధ విధానాలు, మతిలేని నేత, గతిలేని ప్రజ, వెరసి అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న ఈ దుర్భరస్థితి. "బలవంతుడు నాకేమని పలువురతో నిగ్రహించి పలుకుట మేలా" అన్న చందంగా, బలవంతమైన రాజ్యం కనపడని కణంతో కృశించిపోతోంది. రాచపీనుగ ఒక్కటే పోదన్నట్లు అగ్రరాజ్యం అన్ని రాజ్యాలని పతనమార్గంలోకి నెడుతోంది.

ఇక భారతదేశం విషయం చూస్తే, లాక్‌డౌన్ 1,2,3లు నివారణకి దోహదపడ్డాయో లేదో బయటి ప్రపంచానికి తెలీదుకాని, రోజువారి జీతాలు, కూలిమీద బతికే బక్కజీవుల బతుకుమాత్రం అతలాకుతలం అయింది. ఇళ్ళలో పనిచేసి బతుకు సారించేవాళ్ళు, ఇంట్లోంచి పనిచేసి మనలేరు కదా! ఒక్కటి మాత్రం గమనించదగ్గ విషయం, అగ్రరాజ్యంలో ప్రభుత్వం ఏమీచేయట్లేదు అన్న భావం ప్రజల్లో ఉంటే భారతదేశంలో మాత్రం ఏదో చేసేస్తున్నారు మనకేం ఫర్వాలేదు అన్న భద్రతాభావం ఇంప్రెషన్ మాత్రం

కలిగించగలిగారు.

పాలకులు మాత్రం కరోనాని ఎడాపెడా వాడుకుంటున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కరోనా వల్ల ఎన్నికలు జరుపలేమని ఒక పార్టీ, కరోనా ఉన్నా లక్షమందితో తెలంగాణా రాష్ట్రంలో రాలీ పెట్టి 'బలప్రదర్శన' చేసి ఒక పార్టీ, కరోనాకే నవ్వొచ్చేలా కరోనా పేరు వాడేస్తున్నారు.




అంతర్జాతీయ నాయకత్వ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొన్ని దేశాలు మినహా (europeలో) ప్రపంచదేశాలు కరోనాని అరికట్టడంలో విఫలం అయ్యాయి. ప్రజలను నడిపించేవాడు ప్రజలకి ఏది మంచిదో తెలుసుకుని ప్రజలను ఆ పనికి సమాయత్తం చేసేవాడు నాయకుడని పూర్వం వినేవాళ్లం. ఇప్పుడు, ప్రజలు ఏమి ఆశిస్తారో అదే తిరిగి వాళ్ళకి చెప్పేవాడు ఓట్ల నాయకుడు అయ్యాడు.

వంద సంవత్సరాల క్రితం వచ్చిన అంటువ్యాధికి, ఇప్పటి అంటువ్యాధికి, అప్పటి, ఇప్పటి కాలమానపరిస్థితులకి చాలా తేడాలున్నాయి. ఇప్పుడు ప్రపంచం పరస్పరం ఆధారపడి బతికే ఒకచిన్న సమాజంలాంటిది. అమెరికా, ఇండియాలకు మధ్య పదిరోజులు విమానాలు రద్దయితే ఎంతమంది జీవితం మీద ప్రభావం పడుతుంది? ఎన్నోచుక్కలు కలిస్తేనే ప్రపంచవ్యవస్థ చిత్రపటం సంపూర్ణం అవుతుంది. కరోనా కాలంలో "మాకు మేమే, మీకు మీరే" అన్న ధోరణి చాలా దేశాలలో, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రబలుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టి ఉంటే చవకగా అందరికీ అందుబాటులో ఉండే విధంగా టీకా రూపొందే కార్యక్రమం జరిగేది. కానీ ఎవరికి వారే టీకా రూపొందించే కార్యక్రమంలో పడడంవల్ల సమన్వయలోపంతోపాటు పేదదేశాలకి టీకా అందుబాటులోకి రావడంలో జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మనుషుల జీవితం మీద కరోనా ప్రభావం విస్తృతంగా ఉంది. సాంకేతిక ప్రగతి, మనుషుల మధ్య గోడలు కడితే, కరోనా ఆ గోడలను మరింత పటిష్టం చేసింది. ఒకరు లేకపోతే ఇంకొకరు లేరు అన్నంతగా ఉండే స్నేహితులు, ప్రేమికులు కూడా నోరువిప్పి మాట్లాడుకునే పరిస్థితి కూడా లేదు. ఎవరికి కోవిడ్ ఉందో ఎవరితో మాట్లాడితే కరోనా సోకుతుందో అన్న సంశయం, భయం అందరిలోనూ ఉంది. పూర్వం స్త్రీలు పరాయి పురుషుడిని చూస్తే కొంగు కప్పుకునేవారు. ఇప్పుడు లింగబేధం లేకుండా ప్రతివాళ్ళు



ముసుగు సర్దుకుంటున్నారు. అదొకరకంగా "నన్ను అనుమానిస్తున్నాడా" అన్నట్టు ఉంటోంది. ఇంతకీ ఉందో లేదో తెలీని, ఎలా ఉంటుందో ఏం తింటుందో, ఆడో, మగో తెలీని ఈ కణం మన ఆలోచనల్లో మాత్రం స్థిరంగా పాతుకుపోయింది. 'అందమే ఆనందం' అని అభిమాన కవి అన్నాడు కాబట్టి, పైసా ఖర్చులేని ఎవరికీ హాని కలిగించని అందం చూద్దామంటే అరవిందాలలాంటి ముఖాలు ముసుగారవిందాలయి నల్లటిమబ్బుల చాటున చక్కని చంద్రుడిలా దాక్కుంటున్నాయి.

సుమారు సంవత్సర కాలంపాటు, ప్రపంచం అనుభవిస్తున్న క్షోభకి చరమాంకం మొదలయింది. అనతికాలంలోనే అందరికీ టీకాలు, అంతటా ఆనందాలు వెల్లివిరుస్తాయి. కానీ పునర్నిర్మాణానికి చాలా కాలం పడుతుంది. ముఖ్యంగా మానవ అనుబంధాల పునర్నిర్మాణం కష్టతరం, సమయం పట్టే విషయం. యువకులకి చేయూతనిచ్చి ప్రోత్సహించే కార్యక్రమాలు ఇప్పుడు చాలా అవసరం. అంతకుమించి, ఆలంబన లేని వయోవృద్ధులకు ఆదరణ కల్పించడం అవసరం ఉంది. కరోనా ప్రపంచ పురోగతిని కొన్ని దశాబ్దాల వెనక్కి నెట్టింది, ప్రపంచవ్యాప్తంగా. శిశిరం శాశ్వతం కాదు. వసంతాగమనాన్ని ఆపలేము. అందరికీ ఆలవాలమయ్యే వసంతవాకిలి మానవాళి ఆశయం కావాలి. ప్రపంచ సమాజాన్ని కలిసిమెలసి పునర్నిర్మించవలసిన అవసరం మునుపెన్నడూ లేనంతగా ఉంది. అన్నిరంగాలలోనూ అంతర్జాతీయ నాయకత్వ అవసరం మెండుగా ఉంది. సందర్భానికి అనుగుణంగా ఎదగగల సామర్థ్యం, సంస్కారం, నైపుణ్యం ఉన్నతెలుగువాళ్ళు ఈ చారిత్రాత్మక సమయంలో నాయకులుగా ఉద్భవిస్తారని ఆశిద్దాం.

★ ★ ★

శాస్త్ర ప్రకాశిక

## కందుకూరి వీరేశలింగం

# తొలి ఆధునిక వైజ్ఞానిక రచయిత, దార్శనికుడు



డా. నాగసూరి వేణుగోపాల్
9440732392

కందుకూరివారు సైన్స్ కూడా రాశారా?– అనే ప్రశ్న ఎదురుకావచ్చు! అది ప్రశ్నించినవారి పొరపాటు కాదు. వీరేశలింగంగారు విజ్ఞాన సంబంధమైన రచనలు కూడా చేశారని పెద్దగా ప్రచారం లేదు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రహసనాలు రాశారు కనుక సైన్స్ రచయితగా పరిగణించి, ఉజ్జాయింపులు వేసి ఉండవచ్చు. నిజానికి వారు తొలితెలుగు సైన్స్ రచయిత కూడా! అందులో సందేహం లేదు.

''తెలుగులో మొదటి వచన ప్రబంధమును నేనే రాసితిని; మొదటి నాటకమును తెనిగించితిని; మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రాసితిని; మొదటి ప్రహసనమును నేనే రాసితిని; మొదటి చరిత్రమును నేనే విరచించితిని; స్త్రీలకై మొదటి వచన పుస్తకమును నేనే విరచించితిని; అయినను ప్రథమ ప్రయత్నము లెప్పుడును ప్రథమ ప్రయత్నములే!'' – అని కందుకూరి వీరేశలింగం తన 'స్వీయ చరిత్రము'లో స్పష్టంగా చెప్పుకున్నారు. నవల, నాటకం, సైన్స్, ప్రహసనం, చరిత్ర, స్త్రీల రచన – తనే మొదట తెలుగులో చేశానని చెబుతూ, అదే సమయంలో తొలి రచన తొలి రచనే అని వినయంగా ప్రకటించుకున్నారు. ఆయన పేర్కొన్న క్రమం కూడా పేర్కొనదగ్గది. ప్రకృతిశాస్త్రంగా సైన్స్‌ను మూడవ స్థానంలో పేర్కొనడం బట్టి వారు దానికెంతో ప్రాధాన్యమిచ్చారని గమనించాలి.

1982లో స్వీయచరిత్రము విశాలాంధ్ర ప్రచురణగా వెలువరిస్తూ, కందుకూరి మీద ఎంతో పరిశోధన చేసిన డా.అక్కిరాజు రమాపతిరావుగారు 'సంస్మరణ' పేరున ఆ పుస్తకానికి ముందుమాటలో ఇలా శ్లాఘిస్తారు– ''...పూర్తిగా భూలోకానికి మాత్రమే పరిమితమైన ఇతివృత్తం, అంతవరకు ఏ తెలుగు రచయితా స్వీకరించిన దాఖలా కనబడదు''. ఇది చాలా విలువైన పరిశీలన. కందుకూరి సాహిత్యం వాస్తవికమైన ప్రపంచానికి చెందినదని పేర్కొనడమే కాదు– ఇంకా అంటారు–''దివ్య, దివ్యాదివ్య, అతిమానుష, అద్భుతేతివృత్తాలే ఇతిహాసాలు, కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలుగా,




పాటలుగా, ద్విపదలుగా, యక్షగానాలుగా– వీరేశలింగం సాహిత్యంలో కొత్తదారులు వేసినవరకూ–రచితమవుతూ వచ్చాయి''.

''లౌకికసాహిత్యం వీరేశలింగంతోనే తెలుగులో ప్రారంభమైందని చెప్పాలి'' అంటూ రమాపతిరావుగారు వీరేశలింగం నవల, నాటకం, ప్రహసనం, విమర్శ, వ్యాసం, జీవితచరిత్ర, కవుల చరిత్ర, స్వీయచరిత్ర మొదలైన ఎన్నో నూతన ప్రక్రియలకు శ్రీకారం చుట్టారని కొనియాడతారు. ఇన్ని చెప్పిన రమాపతిరావు గారు ఎందులకో వారి విజ్ఞాన రచన గురించి చెప్పడం మరిచిపోయారు!

1971లో వెలువడిన స్వీయచరిత్ర సంగ్రహ ముద్రణకు రాసిన పీఠికలో ప్రసిద్ధ కథకులూ, సంపాదకులు, సైన్స్ రచయిత కొడవటిగంటి కుటుంబరావు కూడా వీరేశలింగంగారి సైన్స్ రచనలను పరోక్షంగా కూడా ప్రస్తావించలేదు.

పిమ్మట ఎవరూ వీరేశలింగంగారిని సైన్స్ రచయితగా చెప్పిన, చర్చించిన దాఖలాలు తెలుగులో పెద్దగా కనబడలేదు. వీరేశలింగం కొటేషన్ పేర్కొంటూ– ''తెలుగులో మొదటి వచన ప్రబంధమును నేనే రాసితిని; మొదటి నాటకమును తెనిగించితిని...'' అని మాత్రమే రాసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కనుక కందుకూరివారు సైన్స్ రచనలు కూడా చేశారా?– అని ఎవరైనా అడిగితే వారి దోషం ఏమీలేదు. అది మన పరిశీలకుల పరిమితి మాత్రమే! ఇక్కడ ఒక మినహాయింపు ఉంది. 1977లో సాహిత్య అకాడమీ కోసం 'మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' సీరీస్‌లో నార్ల వెంకటేశ్వరరావుగారు ఆంగ్లంలో రాసిన మోనోగ్రాఫ్ వీరేశలింగం గురించి విడుదలయ్యింది. అందులో 'అదర్ పయోనీరింగ్ వర్క్స్' అనే అధ్యాయంలో ఇలా పేర్కొంటారు–

"He published, after years of study, two basic books on physiology and astronomy. For illustrating them, he ordered blocks, at heavy expense from Calcutta and London. If the fact is kept in mind that his science books were the first of their kind in Telugu, they are excellent".

నిర్ద్వంద్వంగా వీరేశలింగం తొలి తెలుగు సైన్స్ పుస్తకాలు చక్కగా సాధికారంగా

రాశారని నార్ల వెంకటేశ్వరరావు అతి స్పష్టంగా చెప్పారు. అయినా, తర్వాతివారు గమనించలేదు.

కందుకూరి సైన్స్ రచనలు ఎప్పుడు చేశారు, ఏమి చేశారు అనే విషయాలు చెప్పుకునేముందు ప్రాథమికమైన విషయం ఒకటి చెప్పుకోవాలి. వీరేశలింగంగారు నాస్తికులా? చిలకమర్తి నరసింహం 1937లో స్వీయచరిత్రకు ముందుమాట రాస్తూ... ''మహావీరుడు, కార్యశూరుడు, ఆస్తిక మతావలంబకుడు, సంఘసంస్కర్త...'' అంటూ ప్రస్తుతించాడు. స్వీయచరిత్రము ప్రారంభంలో ''శ్రీ పరబ్రహ్మణేనమః'' అంటూ ఈశ్వర ప్రార్థనము కందుకూరి రాసుకున్నారు. ''ఓ పరమేశ్వరా! ఓ దయాసత్య ధర్మస్వరూప! ఓ సుజన సహృదయ ప్రమోద సంధాయకా!'' అంటూ అది ఒక కన్ఫెషన్ లా సాగుతుంది. స్వీయచరిత్రము తన భార్య రాజ్యలక్ష్మమ్మకు అంకితమిస్తూ వివరమైన ఒక వాక్యం రాశారు వీరేశలింగం. అది కూడా 'ఓమ్' అని మొదలవుతుంది. కనుక వారు నాస్తికులు కారు అని స్పష్టంగా చెప్పవచ్చు.

1848 ఏప్రిల్ 16న జన్మించిన కందుకూరి తన ఇరవయ్యేళ్ళ వయసులో వెలువరించిన మార్కండేయ, గోపాల శతకాలు వెలుగు చూసిన తొలి రచనలు కాగా, 1874 అక్టోబరులో 'వివేక వర్ధిని' మాసపత్రిక ప్రారంభించే కాలానికి వారి వయసు 26 సంవత్సరాలు. అలాగే తొలి విజ్ఞాన సంబంధమైన రచన 'పదార్థ వివేచన శాస్త్రము'– రసాయన శాస్త్ర ప్రశ్నోత్తర గ్రంథం 1877–78లో వెలువడింది. అప్పటికి వారు రసిక జన మనోరంజనము (1870–71), శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచన నైషధము (1871), శుద్ధాంధ్రఉత్తరరామాయణం (1872) తోపాటు నీతి చంద్రిక విగ్రహము సంస్కృత అనువాదం (1874), సంగ్రహ వ్యాకరణము (1875), షేక్స్ పియర్ ఆంగ్ల నాటకం 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' తెలుగు అనువాదం (1875), అధిక్షేప పద్యరచన అభాగ్యోపాఖ్యానము (1876) కూడా రాశారు.

'పదార్థ వివేచక శాస్త్రము' తర్వాత సుమారు పది సంవత్సరాలకు అంటే 1886లో 'శరీరశాస్త్ర సంగ్రహము' అనే రెండవ విజ్ఞాన సంబంధమైన పుస్తకం వెలువడింది. 1889లో 'దేహ ఆరోగ్య ధర్మ బోధిని', 1895లో 'జ్యోతిష్యశాస్త్ర సంగ్రహము', 1896లో 'జంతుస్వభావ చరిత్రము' వెలువరించారు. అంటే రెండు దశాబ్దాల కాల వ్యవధిలో ఐదు విజ్ఞాన సంబంధమైన రచనలు చేశారు కందుకూరి. ఈ ఐదు పుస్తకాలలో ఏ ఒక్కటి భవదీయ విశ్లేషకులు ఇంతవరకు నేరుగా పరిశీలించలేదు. కనుక వాటి గురించి ఇతరులు చెప్పిన విషయాలతోపాటు, వారు ఏ నేపథ్యంలో సైన్స్ రచనలు కొనసాగించారో మాత్రమే ఇక్కడ చర్చించుకుందాం. ఆ పుస్తకాలు లభ్యమైన తర్వాత వాటిని విడిగా విశ్లేషించుకునే ప్రయత్నం చేద్దాం.

వీరేశలింగం దృష్టి తార్కిక దృష్టి, సమాజహితమైన ధోరణి.''తెలుగు భాషలోనున్న ప్రబంధము – లన్నియు కామినీ కచకుచసంభోగాది వర్ణనలతో నిండియుండి



యేకరీతివిగా నుండుటచేతను, అట్టి ప్రబంధ ములను రచించిన వారిలో నేనొక్కడైనను నాకు వెనుకటి యభిప్రాయములు మారి శృంగార ప్రబంధములు చేయు మేలుకంటే కీడె క్కువగానుండునన్న సిద్ధాంతమునకు వచ్చినవాడగుట చేతను, ప్రబంధ ప్రణీకత పథమును బరిహసింపవలెనన్న యుద్దే శ్యముతోన భాగ్యోపాఖ్యానము చేసితిని'' అని స్పష్టంగా చెప్పుకున్నారు. ఈ తొలి తెలుగు వ్యంగ్య రచన 1876లో రాగా మరుసటి సంవత్సరమే వారి తొలి తెలుగు విజ్ఞాన సంబంధమైన రచన 'పదార్థ వివేచక శాస్త్రము' వెలువడింది. సాహిత్య ప్రయోజనం స్పష్టంగా బోధపడిన తర్వాతనే వారు సైన్స్ వైపు వచ్చారు!

స్వీయచరిత్రము తొలి అధ్యాయం మూడవ పేరాలో తన జాతకచక్ర వివరాలు ఇస్తూ వీరేశలింగం ''నాకెంతమాత్రమును విశ్వాసము లేకపోయినను సత్యాన్వేషుల విమర్శకయి యుపయోగపడవచ్చునని నా జాతకచక్రమునిందు బొందుపరచు చున్నాను'' అని అంటారు. ఇందులో వారికున్న 'పరీక్షకు నిలిపే ధోరణి' ప్రస్ఫుటం అవుతుంది. ఇంకా చూడండి– ''...నేనారంభదశలో జ్యోతిశ్శాస్త్రమునందత్యంత విశ్వాసము కలవాడనేయైనను జన్మపత్రికలలో దీర్ఘాయుష్మంతులగుదురని చెప్పబడిన వారనేకులల్పాయుష్కులగుచుండుటయు,... చూచుచు వచ్చిన కొలదిని నాకీ జ్యోతిష్య విషయమయి యంతకంతకు నమ్మకము తగ్గి లోకానుభవమధికమయినది. తరువాత పూర్ణముగా నశించెను...'' అని నిజాయితీగా వివరిస్తారు. ఇంకా అంటారు – ''.. సుముహూర్తములను బెట్టుకుని జన్మపత్రములనుబట్టి దీర్ఘాయుష్మంతులయిన వరుల నేర్పరచుకుని వివాహ కార్యములు నడుపునపుడు వివాహితులలో లక్షలకొలది బాల వితంతువులేలకావలెను? అట్టిచోట్లనెల్ల జాతకబలమేమగును? ముహూర్త బలమే మగును? జన్మపత్రములలోవ్రాయబడిన ఫలములలో గొన్ని కాకతాళీయములుగా గలుగుట తటస్థించినను గొన్నియైనను దప్పిపోవుచుండుటచేత నట్టి శాస్త్రము విశ్వాసయోగ్యమైనది కాదని నా దృఢ నిశ్చయము....''

ఇటువంటి సమాజహితమైన దృష్టి. రాగద్వేషాలు లేని దృష్టి విజ్ఞాన సంబంధమైన రచనకు, వివేచనకు అవసరం. ఆ ధోరణిలో సైన్స్ రచనలు చేసిన తొలి తెలుగు రచయితగా కందుకూరిని ప్రస్తుతించాలి.

అమావాస్య రోజున ఉద్యోగంలో చేరడం, ఇంటిలోని తేనెపట్టు తీయకుండా, ఆగి తేనెపట్టిన తర్వాత భుజించడం – వంటి సంఘటనలను వీరేశలింగం యువకుడిగా చూపిన తార్కిక దృష్టికి, తెగువకు తార్కాణాలు. తన తల్లి అర్థంలేని వాత్సల్యంతో అతిగా భోజనం పెట్టడం గురించి కూడా వీరేశలింగం వివరిస్తారు స్వీయచరిత్రలో. ఈ దిశలో స్త్రీల ఆరోగ్యం, ప్రజల మూఢ విశ్వాసాల గురించి చాలా రచనలు వారివి మనకు కనబడతాయి. హాస్యం, వ్యంగ్యం మేళవించి ప్రహసనాలు వెలువరించారు. ప్రహసనాలలో కందుకూరి వారి అభిప్రాయాలు కొన్ని పరిశీలిద్దాం.

''సూర్యుడికి భూమికి మధ్య చంద్రుడు అడ్డం వస్తే సూర్యగ్రహణం పడుతుందంటారు. సూర్యుడుకీ, చంద్రుడికీ మధ్య భూమి ఉండి భూమి నీడ చంద్రుని మీద పడితే చంద్రగ్రహణం అంటారు'' (గ్రహణములు)

''సూర్యకిరణాలు వేడిమి చేత సముద్రములోను, నదులలోనూ, మడుగులలోనూ వుండే నీరు ఆవిరి రూపంగా పైకి లేచి ఒకచోట కూడుకుని పైన గాలిలో మేఘంగా ఏర్పడి బరువు ఎక్కువయినపుడు నీరు కిందపడుతుంది. దీన్నే వర్షమంటారు'' (వర్షము)

''జాతకాలు, గ్రహాలూ జ్యోతిష్యుల చేతులలో వున్నవి. జ్యోతిష్యులు మీ చేతిలో వున్నారు. ఒక్క కళ్యాణం కాదు, చేసుకునేవారు వెర్రివారైతే ఎన్ని కళ్యాణాలైనా అవుతవి'' (బహు భార్యత్వము)

స్త్రీల కష్టాలకు సానుభూతితో, మగ ప్రపంచం దౌష్ట్యంపట్ల విమర్శతో ప్రహసనాలు రచించిన కందుకూరివారు అప్పటికి తెలిసిన పరిజ్ఞానాన్ని స్పష్టంగానే వివరించారు. చరకుడు, సుశ్రుతుడు, భావమిశ్ర, శాలిహోత్ర, గార్గి, ఆర్యభట్ట, వరాహమిహిరుడు మొదలైన భారతీయ విజ్ఞాన ఖనులను వివరంగా అధ్యయనం చేశారు వీరేశలింగం. ఖగోళం గురించి తెలుసుకోవాలని చెన్నపురిలో అబ్జర్వేటరీ సందర్శించేవారు. ఊపిరితిత్తులు, గుండె ఎలా పనిచేస్తాయో తెలుసుకోవడానికి వధ్యశాలకు పోయి మేకలను చంపడం, మాంసం తీయడం పరిశీలించాడు. ఆనాటి సమాజంలో ఒక బ్రాహ్మణ యువకుడు ఇలా చేయడం సాహసమే.. మనిషి అంతర్గత నిర్మాణం చూడాలని ఆస్పత్రికి వెళ్ళి శవాన్ని కోయడం కొంతవరకు చూడగానే స్పృహతప్పి పడిపోయారు. ఆధునిక విజ్ఞానం అలవరుచుకోవాలని నిజాయితీగా ప్రయత్నం చేశారు. గతానికి ఉండే చాదస్తాన్ని, మూర్ఖత్వాన్ని ఈ విజ్ఞానంతో తొలగించుకోవాలని భావించారు.

పాశ్చాత్య ప్రపంచపు విజ్ఞానాన్ని, ఆవిష్కరణలను బలంగా పట్టుకొంటే గానీ మన దేశం ఆధునికంగా, ప్రగతిశీలకంగా, బలంగా కాదని వీరేశలింగం వాంఛించాడని నార్ల వెంకటేశ్వరరావు మోనోగ్రాఫులో అభిప్రాయపడతారు. వీరేశలింగానికి ఖగోళ శాస్త్రంపట్ల ప్రత్యేక ఆసక్తి వుండేది. ఈ విజ్ఞాన శాఖను ఆయన తలమానికంగా



పరిగణించారు. అయితే అది జ్యోతిష్య శాస్త్రాన్ని ఖచ్చితంగా వదిలించుకోవాలని స్పష్టంగా అభిప్రాయపడతారు.

శరీరశాస్త్ర సంగ్రహము (1886), జ్యోతిశ్శాస్త్ర సంగ్రహము (1895) – ఈ రెండు రచనలు చక్కగా అధ్యయనం చేసి వెలువరించినవి. ఈ పుస్తకాలలో చిత్రాలకోసం లండన్, కలకత్తా నుంచి బ్లాకులు తెప్పించడం గమనార్హం. ఇందులో తొలి పుస్తకం పాఠ్యగ్రంథంగా నాలుగయిదు ముద్రణలు పొందింది. ప్రతి ఎడిషన్ మెరుగుబడుతూ వచ్చింది. జంతు స్వభావ చరిత్రము (1896) సుమారు 60 పాలిచ్చే జంతువుల లక్షణాలు, ధర్మాలు గురించి వివరిస్తుంది. భౌతిక శాస్త్రం, భూగోళ శాస్త్రం గురించి పుస్తకాలు రాయాలని తలచారు. కానీ, పూర్తి చేయలేకపోయారు. ప్రాచీన గ్రంథాలు పరిశీలించి పదజాలం తన ఎంపిక చేసుకున్నారని నార్ల వెంకటేశ్వరరావు వీరేశలింగానికి కితాబు ఇస్తాడు.

సమాజానికి అవసరమైన అన్ని అంశాలనూ, బలమైన వ్యక్తీకరణకు దోహదపడే అన్ని సాహితీ ప్రక్రియలనూ స్పృశించిన ప్రతిభాశాలి కందుకూరి వీరేశలింగం. ఇటు సంస్కృతం నుంచి, అటు ఇంగ్లీషు నుంచి ఎంచుకుని అనువాదాలు చేసిన మహామహుడు. ఆయన విజ్ఞానాన్ని తెలుగు సమాజానికి వ్యాసాలుగా, ప్రహసనాలుగా అందించారు. ఆయన వాడిన తెలుగు కొంత జటిలంగా ఉండవచ్చు కానీ, అధ్యయనం చేసి వ్యక్తీకరించిన విజ్ఞాన విషయాలు సవ్యంగానే వున్నాయి. సుమారు ఒకటిన్నర శతాబ్దం క్రితమే తెలుగు సమాజానికి సైన్సు సుగంధపు భిక్ష పంచిన దార్శనికుడు కందుకూరి వీరేశలింగం. ఆయన నిస్సందేహంగా తొలి తెలుగు సైన్సు రచయిత!

★ ★ ★

శాస్త్ర ప్రకాశిక

# కలయిక



వింజనంపాటి
రాఘవరావు
Ph: 9247444994

ఒకటి ఒకటి కలిపితే ఎంత? ప్రశ్న మరోసారి అడుగుతాను.

ఒకటికి ఒకటి కలిపితే ఎంత ? దీనికి సమాధానం చిన్నపిల్లలైనా చెప్తారు కదూ !

అయితే ఈ సమాధానం లెక్కల్లో అయితే రెండు – జీవశాస్త్రంలో అయితే సమాధానం ఒకటి మాత్రమే. తేడా మీకు అర్థమైందనుకుంటాను. ఐనా మరొక్కసారి వివరంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ఒక శుక్ర కణం, ఒక అండం కలిసి ఒక సంయుక్త బీజం (ZYGOTE). దాన్నుంచి ఒక పిండం తొమ్మిది నెలల తర్వాత సుమారు ఒక లక్ష బిలియన్ల కణాలతో పూర్తిగా అభివృద్ధి చెందిన శిశువు. ఒక మంచి సస్పెన్స్ థ్రిల్లర్ కథలా ఉంది కదూ ! కదిలే శుక్రకణాలు, కదలని అండాలు, ఒకే రకమైన విభజనలు.

ఒక మగ, ఒక ఆడ. ఇద్దరిలోనూ వేర్వేరు హార్మోన్లు, హార్మోన్లతో మారిపోయే ప్రవర్తన – ఇవన్నీ శాస్త్రవేత్తలలోనూ, సామాన్యులలోనూ సమానంగా ఆసక్తి రేకెత్తించే అంశాలు. సృష్టిలో మొదటగా స్త్రీ, పురుషులనే భేదం ఎప్పుడు ఏర్పడిందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

లింగత్వం అనేది జీవ పరిణామ సిద్ధాంతాలకు సంబంధించి అత్యంత క్లిష్టమైన సమస్య. మరే ఇతర ప్రకృతి సిద్ధమైన దృగ్విషయము ఇంతటి ఆసక్తిని రేకెత్తించలేదు. డార్విన్, మెండల్ ఇతర విషయాలన్నింటినీ విశదీకరించినప్పటికీ, అన్నింటికీ కేంద్రబిందువైన లింగత్వ ఆవిర్భావం గురించి అరకొరగా తప్ప వివరించలేకపోయారు. లైంగిక ప్రత్యుత్పత్తి జీవ పరిణామ దృష్ట్యా అసంగతమైనది.

కానీ కల్పన (నమూనా) దృష్ట్యా నమ్మశక్యం కానటువంటిది.


ప్రకృతిలో పునరుత్పత్తి జరిగే పద్ధతి అంటే మనకు తెలిసింది – స్త్రీ, పురుష బీజ కణాల వలన కొత్తతరం ఆవిర్భావం. అయితే నిమ్న స్థాయి జీవుల్లో ఆడ, మగ అనే భేదం లేకుండానే కొత్త జీవులు ఆవిర్భవిస్తాయి. ఈ రకమైన ప్రత్యుత్పత్తిని అలైంగికోత్పత్తి అంటారు. –

బాక్టీరియాలలో సమృద్ధిగా ఆహారం లభించగానే శరీరం పూర్తి స్థాయికి ఎదుగుతుంది. పూర్తిగా ఎదిగిన జీవిలో ఉండే DNA అనే పదార్థం విడిపోయి,



బాక్టీరియా రెండుగా విడిపోతుంది. ఈ పద్ధతిని ద్విధా విచ్ఛిత్తి అంటారు. ఇలా ఒక బాక్టీరియా నుండి అతి కొద్ది సమయంలోనే అసంఖ్యాకంగా పిల్లజీవులు ఏర్పడతాయి. ఈ పిల్ల జీవులన్నీ జన్యుపరంగా ఒకే విధంగా ఉంటాయి. వీటన్నింటినీ కలిపి 'క్లోన్' (CLONE) అంటారు. ఇలాంటివే మరికొన్ని అలైంగిక పద్ధతుల ద్వారా అత్యంత ప్రాథమిక జీవులు ప్రత్యుత్పత్తి జరుపుతాయి. అలైంగిక ప్రత్యుత్పత్తి అత్యంత సరళమైనది. జీవులు తమ సంఖ్యను వేగంగా అభివృద్ధి పరుచుకోవటానికి ఉపయుక్తమైనది.

ఇప్పుడు లైంగిక పద్ధతిలో సంతానాభివృద్ధిని పరిశీలిద్దాం. అత్యంత ప్రాథమిక జీవులైన 'ప్రోటోజోవా'లలో కూడా లైంగిక ప్రత్యుత్పత్తి కన్పిస్తుంది. కొన్ని ప్రోటోజోవా జీవులు అనుకూల పరిస్థితుల్లో అలైంగిక పద్ధతిలోనూ, ప్రతికూల పరిస్థితుల్లో లైంగిక పద్ధతిలోనూ సంతానాభివృద్ధి చేస్తాయి. చాలా ప్రాథమిక స్థాయి జీవులలో స్త్రీ పురుష భేదం లేదు. రెండు వేర్వేరు 'క్లోన్' లకు చెందిన జీవులు దగ్గరకు వస్తాయి. వాటి మధ్య జన్యు పదార్థ మార్పిడి జరుగుతుంది. తర్వాత విడిపోయి విభజనలు చెందుతాయి. ఒకవేళ జన్యు పదార్థ మార్పిడికి వేరే జీవి లభ్యం కాకపోతే, తమ పద్ధతిలో అలైంగిక ప్రత్యుత్పత్తి జరుపుతాయి. అనేకసార్లు అలైంగిక పద్ధతిలో ప్రత్యుత్పత్తి జరపటం వలన జన్యుపదార్థం బలహీనపడుతుందని శాస్త్రజ్ఞుల భావన. వేరొక జీవి జన్యుపదార్థంతో కలయిక వలన జీవి పునరుత్తేజితం అవుతుంది. రెండు వేర్వేరు జీవుల జన్యు పదార్థాలు కలిసిపోవటాన్నిపున:సంయోజనం (Recombination) అంటారు. బాక్టీరియాలలో కూడా ఈ పున:సంయోజనం కన్పిస్తుంది. రెండు బాక్టీరియాల మధ్య సెక్స్ పైలస్ (Sex Pilus) అనే సేతువు నిర్మాణం జరిగి, దాని ద్వారా DNA పదార్థం, ఒక దాని నుండి మరొక బాక్టీరియాకు బదిలీ అవుతుంది. పున:సంయోజన ప్రక్రియ DNA పదార్థం మరమ్మత్తు చేయటానికి ఉద్దేశించబడినదని కొందరి అభిప్రాయం. పునఃసంయోజన




ప్రక్రియ సుమారు 3 బిలియన్ సంవత్సరాల క్రితం ఆవిర్భవించబడి ఉండవచ్చు. పునఃసంయోజన ప్రక్రియ నుండి లైంగిక ప్రత్యుత్పత్తి ఆవిర్భవించిందని కొందరు శాస్త్రవేత్తల వాదన. లైంగిక ప్రత్యుత్పత్తి ప్రాథమిక కేంద్రక జీవుల్లో 1 నుండి 2 బిలియన్ సంవత్సరాల క్రితం ఆవిర్భవించబడి ఉండవచ్చు. దీనికి స్పష్టమైన కారణాలు తెలియకపోయినప్పటికీ, బహుశః పరాన్న జీవులు లైంగిక ప్రత్యుత్పత్తిని ప్రోత్సహించాయనే వాదన కూడా ఉంది.

పరాన్నజీవి అతిథేయి శరీరంలోకి ప్రవేశించాలంటే అతిథేయి కణం నిర్మాణం తెలిసి ఉండాలి. కణం పై ఉండే ప్రొటీన్లు పరాన్నజీవిని లోపలికి రాకుండా అడ్డుకుంటాయి. ఒక్కసారి లోపలికి ప్రవేశించే మార్గం తెలిసిపోతే అన్ని పరాన్నజీవులు అదే పద్ధతిని అనుసరిస్తాయి. అంటే, అన్ని ఇళ్ళకూ ఒకే రకం తాళం కప్ప ఉంటే తెఱవటానికి ఒకే తాళం చెవి సరిపోతుంది కదా ! అలాగన్న మాట.

అలైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా ఏర్పడే జీవులన్నీ, అంటే ఒక క్లోన్ లోని జీవులన్నీ ఒకే తాళం చెవితో తెరుచుకునే ఇళ్ళ వంటివి. దీనివలన పరాన్నజీవుల బారినపడే అవకాశాలు ఎక్కువ. పునఃసంయోగం వలన కానీ, లైంగిక ప్రత్యుత్పత్తి వలన కానీ ఏర్పడిన జీవులు ప్రతిసారీ కొత్త తాళం కప్పను కలిగిన ఇంటివంటివి. వీటిలోకి ప్రవేశించాలంటే పరాన్నజీవులు ప్రతిసారీ కొత్త తాళం చెవి తయారు చేసుకోవాలంటారు శాస్త్రజ్ఞులు.

మొదట్లో స్త్రీ, పురుష సంయోగ బీజాలు అంటూ వేర్వేరుగా ఉండేవి కావు. కేవలం రెండు కేంద్రకాలుండేవి. పేరామసియం వంటి ప్రొటోజోవా జీవులు ఒక కదిలే కేంద్రకాన్ని, ఒక కదలని కేంద్రకాన్ని తయారు చేస్తాయి. కదిలే కేంద్రకాన్ని పురుష

కేంద్రకమనీ, కదలని కేంద్రకాన్ని స్త్రీ కేంద్రకమని పిలుస్తారు. ఒక పేరామసియంలోని పురుష కేంద్రకం, మరొక పేరామసియంలోని స్త్రీ కేంద్రకాన్ని చేరి దానితో కలిసిపోతుంది. దీన్ని సంయుగ్మం అంటారు. దీన్ని లైంగిక ప్రత్యుత్పత్తిగా గుర్తించారు.

మలేరియా పరాన్న జీవి ప్లాస్మోడియంలో రెండు వేర్వేరు స్త్రీ, పురుష సంయోగ బీజాలేర్పడ్డాయి. దాదాపు ఒకే పరిమాణంలో ఉండే కణం నుండి ఎనిమిది వరకూ పురుష సంయోగబీజాలు ఏర్పడితే, స్త్రీ సంయోగ బీజం మాత్రం ఒకటే ఏర్పడుతుంది. స్త్రీ బీజ కణం పరిమాణం అంతకంతకూ పెద్దదై పోతూ ఉంటే, జీవ పరిణామ ప్రక్రియలో భాగంగా పురుష బీజకణానికి చలనానికి అవసరమైన అన్ని హంగులూ ఏర్పడ్డాయి. పొడవైన తోక, ఈదటానికి అవసరమైన శక్తినందించే యంత్రాంగం, స్త్రీ బీజ కణాన్ని గుర్తించటానికి, అండంలోకి ప్రవేశించటానికి అవసరమైన రసాయన పదార్థాలు... ఇలా అనేకం.

లైంగిక పద్ధతిలో ప్రత్యుత్పత్తి జరపటానికి కొన్ని చిక్కులున్నాయి. ఒక అండం, ఒక శుక్ర కణం కలిసి సంయుక్తబీజం ఏర్పడుతుందని మనకు తెలుసు. అయితే క్రొత్తగా ఏర్పడే జీవి తల్లిదండ్రులకు రెట్టింపు పరిమాణంలో ఉండాలి కదా ! కానీ అలా జరగటం లేదని మనకు తెలుసు. దీన్ని అర్థం చేసుకోవటానికి కణ విభజన పద్ధతుల గురించి కొంచెం అర్థం చేసుకుందాం.

శరీరంలోని దైహిక కణాలలో, కణ విభజనకు ముందు కేంద్రకంలోని DNA రెట్టింపయి, రెండు కణాల మధ్య సమంగా పంచబడుతుంది. అదే బీజ కణాలలో అయితే DNA పదార్థం సగానికి తగ్గించబడుతుంది. దీన్ని క్షయకరణ విభజన అంటారు. దీనవలన లైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా ఏర్పడే జీవుల్లో ఎప్పటికీ DNA పదార్థం తల్లిదండ్రులలో ఉన్నంతే ఉంటుంది.

ప్రస్తుతం స్త్రీ, పురుష బీజకణాలు ఏర్పడటం పూర్తి సమాచారం మన దగ్గర ఉన్నప్పటికీ, ఖచ్చితంగా స్త్రీ, పురుష జీవులు వేర్వేరుగా ఏర్పడ్డాయో చెప్పటం కష్టం. అలాగే స్త్రీ జీవి శరీరంలో పిండం అభివృద్ధి చెందటానికి అవసరమైన యంత్రాంగాన్ని ఎలా ఏర్పరచుకున్నాయో వివరించటమూ కష్టమే. వానపాములు, జలగలు వంటి జంతువులు, జీవులు, ఎక్కువ శాతం మొక్కలు ఉభయ లైంగికాలు.

అలైంగికోత్పత్తి ఒకే సంఖ్య ఉన్న అనేక లాటరీ టిక్కెట్లు కొనటం వంటిదని, లైంగికోత్పత్తి వేర్వేరు సంఖ్యలున్న కొన్ని లాటరీ టిక్కెట్లు కొనటం వంటిదని అంటారు డాక్టర్ విలియమ్స్. లైంగికోత్పత్తి వలన వచ్చే వైవిధ్యాలు, వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకుని నిలబడతాయని వీరి భావన.

మనుగడ కోసం జీవులు జరిపే పోరాటంలో, జీవులు నిరంతరం క్రొత్త సమస్యలకు సమాధానం వెతకాలి. అది పరాన్నజీవులు, వాతావరణం, ఆహారం ఏదైనా కావచ్చు. ఈ పోరాటంలో యోగ్యమైన లక్షణాలున్న జీవులే మనుగడ సాగిస్తాయంటారు 'లీవాన్

వేలెన్' (Leighvan Valen) తన 'రెడ్ క్వీన్ హైపోథిసిస్' లో.

తల్లిదండ్రులు వయసులో బాగా పెద్దవాళ్ళైనా వాళ్ళ పిల్లలు ఎప్పుడూ పూర్తికాలం ఎలా జీవించ గలుగుతున్నారు? చాలా చెత్త ప్రశ్న ఇది. బెర్న్ స్టీన్, మైకోడ్, హాఫీ అనే శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం దైహికమైన కణాలు నిరంతర విభజన వలన వృద్ధాప్య దశకు చేరుకుంటాయి. బీజకణాలు క్షయకరణ విభజన చెందుతూ, నిరంతరం పునఃసంయోజనం చెందటం వలన DNA మరమ్మతుకు అవకాశం ఏర్పడి, వృద్ధాప్యదశకు చేరటం లేదంటారు.

లైంగిక ప్రత్యుత్పత్తి అంటే ఒకే పుస్తకం రెండు కాపీలు కొని, పేజీలన్నింటినీ విడదీసి, క్రొత్త పుస్తకం తయారు చేయటానికి ఏ పేజీ ఎంచుకోవాలో లాటరీ వేయటం వంటిదంటారు రిడ్లి, మార్క్ అనే జీవపరిణామ శాస్త్రవేత్తలు. లాటరీలో ఎన్నిక కాని పేజీ వృధా అవుతుంది.

ఇప్పుడున్న పద్ధతిలో లైంగిక ప్రత్యుత్పత్తి అవసరమైన హంగామా అంతా లేకుండానే జరుగుతుంది. మరి ఇదంతా ఎందుకు ? యౌవనం తెగింపునిస్తుంది. దీనివలన జీవి మనుగడకే ప్రమాదం రావచ్చు. కేవలం సంతానోత్పత్తి కోసం ఇంత ఖరీదైన వ్యవహారం అవసరమా? ఏమో, మానవ మేధస్సు దీనిపై మథిస్తూనే ఉంటుంది. క్రొత్త ఆధారానికై వెతుకుతూనే ఉంటుంది.

విశ్వం నిర్మాణం విషయంలో భగవంతుడు పాచికలాట ఆడటం లేదంటారు – ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత ఆల్బర్ట్ ఐన్ స్టీన్.

అంతా చదివారు కదా ! ఇంతకీ స్త్రీ జీవి ముందు పుట్టిందా ? మగజీవి ముందు పుట్టిందా ? ఆలోచించండి !

★ ★ ★



# కథా ప్రకాశిక

# అర్ధాంగి

**ప్రకాశిక నిర్వహించిన 2020 దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ.**




తరిగొప్పుల
విఎల్ఎన్ మూర్తి
8008577834

'షిర్డికి మనం వెళ్తున్నట్లు మామయ్యగారికి చెప్పారు కదా!'... నిలదీసినట్టు అడిగింది నీలిమ.

'ఆ చెప్పా!'... క్యాజువల్ గా అన్నాడు వేణు.

'మరంత అర్జంటుగా చెప్పాల్సిన అవసరం ఏంటో'...



'అదేంటీ అలా అంటావ్? జస్ట్ చెప్పాలనిపించింది, చెప్పాను. అలాగే అత్తామామయ్యలకీ చెప్పాను'

'మనం షిర్డి వెళ్తున్నామని తెలిస్తే వాళ్ళేవో డబ్బులు ఇస్తారని మీ ఆశ!'

'ఆశ కాదు'

'పోనీ మరొహటి. చిన్న ఉద్యోగం చేస్తూ నాలుగు డబ్బులు కూడబెట్టి ఊరెళ్దామని అనుకుంటే, మీరు చేసిన నిర్వాకం ఇదీ''– ఆమె స్పీడుగా విసిరిన గిరాటేసిన గరిట పులుసు గిన్నెలో పడి కొన్ని తుప్పర్లు అతనిమీద పడ్డాయి.

'నీ ఉద్దేశం అసలు అర్థం కావడం లేదు. పెద్దవాళ్ళకి చెప్పడం తప్పా?'..

'మీరు చెప్పడం వల్ల ఏం జరిగిందో తెలుసా?'

'ఏవైందీ'

'ఇందాక నాకు మామయ్యగారు ఫోన్ చేసి, సరిగ్గా మనం వెళ్తామన్న తేదీకి రెండ్రోజులు ముందు ఇక్కడికి వస్తానని చెప్పారు!'

'మరి నాకు చెప్పలేదే?'

'మీరు 'బాగా బిజీ' అని! అందుకే నాకు ఫోన్ చేశానన్నారు. అత్తగారితో కలిసి వస్తారుట'

బాగా బిజీ అన్నమాటలోని వ్యంగ్యాన్ని అర్థం

చేసుకున్నా పట్టించుకోనట్లు – 'అవునా!'...

'అదే కదా నేను ఏడ్చేదీ... మనం ఎప్పుడు ఎక్కడికి వెళ్దామన్నా మీదగ్గర డబ్బులుండవ్. పోనీ ఏదో బోనస్ కలిసి వచ్చి షిర్డి వెళ్దామనుకుంటే, ఇదిగో ఇలా మరో అడ్డు' అంటూనే తన కంచంలో హఠాత్తుగా మజ్జిగ పోసేసుకుంది.

★★★

చిన్న ఉద్యోగి వేణు. అంత పెద్ద సిటీలో నీలిమతో కాపురం పెట్టి కొన్ని సంవత్సరాలే అయింది. వాళ్ళకి సంవత్సరం వయసున్న పాప. ఇంటి అద్దె, సరుకులు, బస్ పాస్, స్కూలు ఫీజులు, పుస్తకాలు– వీటికి బొటాబొటిగా సరిపోయే జీతం వేణుది. ఇతని ఇబ్బందులు చూసిన తండ్రి ఎప్పుడో కాస్త డబ్బు సర్దుబాటు చేసినా, ఆయన అనే మాటలు నీలిమని బాగా మానసికంగా ఇబ్బంది పెడుతుంటాయి. వేణు అటు తండ్రిని డబ్బు అడగలేక సతమతమవుతున్నట్లు నీలిమకి తెలుసు. అందుకే చిన్న స్కూల్లో టీచర్ గా ఉద్యోగం చేస్తూ ఏదో అలా కాపురాన్ని నెట్టుకొస్తోంది.

అనుకున్నట్టే మామగారు, అత్తగారు సెలవురోజే వచ్చారు. అది వేణుకీ నీలిమకీ వాళ్ళిచ్చిన బంపర్ ఆఫర్. ఎందుకంటే రైల్వే స్టేషన్ కి వెళ్ళి వాళ్ళని ఇంటికి తీసుకురావాలి వేణు. మళ్ళీ మరో సెలవురోజు వరకు ఉంటారు. ఎప్పుడొచ్చినా అదే తీరు. ఒకరకంగా నయం. మరో రకంగా నరకం. వారానికి ఒకేరోజు సెలవు వాళ్ళిద్దరికీ. అందులో సగం రైలుకోసం, బస్సులెక్కి వెళ్ళిరావడానికీ సరిపోతుంది. కాకపోతే లీవ్ వేస్ట్ అవ్వదు. అత్తమామలు వస్తే సెలవు పెట్టాలి నీలిమ. అదో రకమైన ఇబ్బంది. అసలు స్కూల్లో పనిచేయనక్కర్లేదు ఆమె. మొహమాటం వీడి డబ్బులు అడిగితే మామగారిస్తారు – కానీ ప్రతీ పైసాకి లెక్కకట్టినట్టు దెప్పుతుంటారు. అది పట్టించుకోకపోతే ఆయనంత మంచివాళ్ళు మరొకరుండరు. కానీ ఆత్మాభిమానం దెబ్బతినేలా దెప్పుతుంటే సహించడం కష్టం. నీలిమకి ఎదురైన సమస్య అదే!

★★★

ఆరోజు మధ్యాహ్నం భోజనం చేస్తుండగా వేణువాళ్ల నాన్నగారు 'మీకో విషయం చెప్పాలి' అని హఠాత్తుగా అన్నారు.

'మీకు తెలుసుకదా ఊళ్ళో ఇల్లు పాడుపడుతోంది. అది అమ్మేసి కొత్త ఇల్లు కొందామనుకుంటున్నా' అని చెప్పి ఆగారు.

'మళ్ళీ కొత్త ఇల్లు కొనుక్కోవడమెందుకూ...మాతో పాటే ఉండొచ్చుగా ఇక్కడే' అంది నీలిమ.

'మేమిక్కడ ఇమడలేం... అక్కడైతే అంతా తెలిసినవాళ్ళూ, చుట్టాలూ బంధువులూనూ'

'నిజమేలెండి, ఇక్కడ ఆస్పత్రికెళ్ళాలన్నా చాలా ఇబ్బందే' ఒప్పుకొంది నీలిమ.


'అందుకే అక్కడ ఇల్లు కొనేస్తే పడుంటుంది కదా. ఇల్లు అమ్మినా డబ్బు సరిపోలేదు. ఇంట్లో బంగారం,బ్యాంకులో దాచిందీ అంతా తీసినా సరిపోవడం లేదు. కాబట్టి నీ గాజులు ఇస్తే వాటిని తాకట్టు పెట్టాలనుకుంటున్నా'... నీలిమతో అన్నారాయన.

చటుక్కున వేణుకేసి చూసింది నీలిమ.. చురుక్కుమంది వేణుకి.

కూరలో వేసిన మిరపకాయలన్నీ ఒక్కసారే నమిలినట్లు ఫీలయ్యి పొలమారాడతను. పక్కనే ఉన్న అతని తల్లి నీళ్ళగ్లాసు అందించింది.

వేణు నెమ్మదిగా గొంతు సవరించుకుని 'ఇప్పుడా గాజులు తాకట్టు పెడితే ఎంతొస్తుందీ... అయినా అది ఏమూలకి సరిపోతుందీ?' అన్నాడు నెమ్మదిగా.

'అదే నేనూ చెప్పాను. కోడలి మెడలో ఎలాగూ బంగారు మంగళసూత్రం లేదు...పసుపుతాడు కట్టుకుని తిరుగుతోంది. ఉన్న గాజులు తీసుకోవడం ఎందుకని అన్నా మీ నాన్న వినిపించుకోవడం లేదు' స్క్రిప్ట్ చదివినట్టు చెప్పింది తల్లి.



'అదేంటీ మావగారూ! సంవత్సరం కింద ఏదో స్థలం కొనాలని నా మంగళసూత్రం పట్టుకెళ్ళారు! ఇప్పుడు గాజులంటున్నారు. ఇవి తప్ప నాదగ్గర బంగారం ఏవుందీ?' గొంతు విప్పింది నీలిమ.

'నీ దగ్గర సూత్రాలు తీసుకెళ్ళానని నువ్వు అంటున్నావు! ఆస్పత్రి ఖర్చులనీ,ఇంటి అద్దె అనీ- ఎన్నిసార్లు డబ్బు తీసుకున్నాడు వీడు'...

'ఎంత తీసుకున్నా మంగళసూత్రాలు కుదువపెట్టినంత కాదు కదండీ? అదేదో మేం తాకట్టు పెట్టుకున్నా అంతకన్నా ఎక్కువ డబ్బులొస్తాయి. మీరిచ్చే డబ్బులకి, మీరు పట్టుకెళ్ళిన బంగారానికీ ఎంత తేడా ఉందో మీకు నేను చెప్పాలా' నెమ్మదిగా అన్నా సూటిగానే అడిగేసింది.


'ఇప్పుడీ కొత్త ఇల్లు కొంటే ఎవరికొస్తుంది...వీడికే కదా!తక్కువ ధరకు వస్తోందని కొనాలనుకున్నాను. నీ బంగారం నీదగ్గరే ఉంచుకో...నాకేం అక్కర్లేదు. కొన్న బంగారం ఒంటిమీద దిగేసుకోవడానికి కాదు, అవసరానికి అక్కరకొస్తుందని! ఉంగరాలూ గాజులూ బంగారంతో చేసినవే వేసుకున్న కుటుంబం నుంచి వచ్చావని మరిచిపోయాను'... ఆమె పుట్టిల్లు స్థితి గురించి గురిచూసి బాణం వదిలాడాయన.

'కేవలం గాజులకోసం మా వాళ్ళని ఏవీ దెప్పిపొడవనక్కర్లేదు... వాళ్ళు ఎక్కడెక్కడి బంగారాన్నీ తాకట్టు పెట్టుకోవాలని అనుకోరు'

'అంటే నేనే తేరగా మీదగ్గరా, అందరి దగ్గరా బంగారాన్ని లాక్కుని తాకట్టు పెడతానని నీ వెక్కిరింత. అంతే కదా!'

'అలా నేను అనలేదు'...

'నువ్వు ఎలా అన్నా పడటానికి రాలేదు. ఇప్పుడు నువ్వు గాజులిస్తే పట్టుకెళ్తా. లేకపోతే జీవితంలో వీడికి పైసా పంపను. నువ్వు వీడూ జీతాలు సంపాదించి పిల్లకి కావాల్సిన అన్నీ సమకూర్చేసుకోండి. పెరుగుతున్న పిల్ల అది. అవసరాలకోసం దమ్మిడీ అడక్కండి. బైక్ కొందామన్నా మళ్ళీ పెట్రోలుకి నేనే డబ్బులివ్వాలి. వీడినీ నీ ఉద్యోగాన్నీ చూసుకుని అంత మిడిసిపడకు!'... కోపంతో కంచం ముందు నుంచి లేచారాయన.



'చూడమ్మా... ఎంత కాదన్నా మళ్ళీ మీ మామగారినే డబ్బులడగాల్సి వస్తుంది. అనవసరంగా పంతాలకి పోకు' అనునయించిందామె అత్త.

వేణుకేసి తీక్షణంగా చూసి, గాజులు అక్కడే తీసేసి అత్తగారికిచ్చేసింది నీలిమ. 'ఇవి తీసుకెళ్ళండి... మేం ఎప్పుడు అడుక్కున్నా ఇంత పడేయండి!' అంటూ కోపంగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. బిక్కచచ్చి అక్కడే నిలబడ్డ వేణునీ, భోరున రోదిస్తోన్న నీలిమనీ ఏవీ పట్టించుకోకుండా– వాటిని అందుకుని పెట్టెలో దాచేశారాయన.

ఆరాత్రి...

తలకింద చేయి పెట్టుకుని పైన సీలింగు ఫ్యాన్ వేపు చూస్తూ ఏదో ఆలోచిస్తూన్న వేణుతో లోగొంతుతో అంది –

'ఇప్పుడో ఇరకాటంలో పడ్డాం'

'అవును, ఏం చేయాలో అర్థం కావడం లేదు'

అనవసరంగా కోపంలో గాజులు ఇచ్చేశాను కానీ, తర్వాత ఆలోచిస్తే తెలిసింది... నేనెంత తెలివితక్కువ పనిచేశానో అని'...

'ఇప్పుడనుకుని ఏం లాభం? ఎల్లుండి సెలవు వరకూ ఆగి గాజులు ఇవ్వాల్సింది'

'నిజమే' తనలో తాను అనుకుంది. వెంటనే 'అవునూ, అప్పుడు మాత్రం ఎలా ఇస్తాం? దొరగారు ఒరిజినల్ గాజులు– అదే తాకట్టు పెట్టిన గాజులు తేగలరా' చిన్న

నవ్వూ, సన్నపాటి ఆందోళన – రెండూ కలగలిపి అంది.

అతను నవ్వలేదు – నవ్వలేడు కూడా! ఎందుకంటే చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నాడు.

రెణ్ణెళ్ళ ముందు జరిగిన సంఘటన దగ్గరికి అతను వెళ్ళిపోయాడు. నీలిమకి అర్థమై, మౌనమైంది.

చంటిపిల్లకి ఒళ్ళు కాగిపోతోంది. రాత్రి అవుతోంది. వేణు వచ్చేస్తూ ఉంటాడని అతనికి ఫోన్ చేయలేదు నీలిమ. ఏ సిటీబస్సులోనో వేలాడుతూ ఉంటాడని, ఎక్కడ ఎక్కుతూ దిగుతూ ఉంటాడోనని ఫోన్ చేయలేదు. అయితే అనుకోకుండా ఆ నెల వన్ అవర్ పర్మిషన్ మిగిలిపోవడంతో బాస్ కి చెప్పి తొందరగానే ఇంటికొచ్చేశాడు వేణు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇంటి ఓనర్, పక్కింటివాళ్ళు పెళ్ళికెళ్ళారు. మరీ ఎక్కువ ఆలోచించకుండా డాక్టర్ దగ్గరికి అలాగే తీసుకెళ్లాడు. పిల్ల పరిస్థితి చూసి, ఆస్పత్రిలో అడ్మిట్ చేసి, డాక్టర్ ట్రీట్‌మెంట్ మొదలు పెట్టాడు.

ఇప్పుడు చాలా పెద్దమొత్తంలో కావాలి. అప్పు పుట్టదు ఎలా? తండ్రికి ఫోన్ చేస్తే 'ఈ నెలలో ఇవ్వలేన'ని చెప్పడంతో నీలిమ గాజులు తాకట్టు పెట్టాడు వేణు.

★★★

పిల్ల బతికితే చాలనుకున్నారు. డాక్టర్ సరైన వైద్యం అందించడంతో పిల్ల చలాకీగా ఇంటికొచ్చింది. ఆ తర్వాత స్కూలుకి వెళ్ళాలి కాబట్టి, చేతులకి నాలుగు మట్టి గాజులతో పాటు వన్ గ్రాము గోల్డ్ గాజులు రెండు ఆ చేతికొకటి ఈ చేతికొకటీ వేసుకుని కాలం వెళ్ళబుచ్చుతోంది నీలిమ.

ఈరోజు మామగారు అన్నమాటలకి పంతంతో ఆ గిల్ట్ నగలిచ్చేసింది. ఆ గాజులు గిల్టువని ఆమె తెలుసుకునే లోపు ఆయన సూట్ కేసులోకి వెళ్ళిపోయాయి. ఏం చేయాలో పాలుపోని సంఘటన అది.

'పోనీ మామయ్యగారికి అసలు సంగతి చెప్పేద్దామా'...

'నీకేమన్నా పిచ్చా... ఆ పని ఎందుకు చేశావని అడగరూ?'

'చంటిదానికి బాగోలేదని ఆస్పత్రిలో జాయిన్ చేశామని తెలుసుగా. అందుకే ఖర్చు అయిందని చెప్పేద్దాం'

'అది గాజులు ఇవ్వకముందు చెప్పాలి. ఇప్పుడు కాదు!'

'మరి అలాగే పంపిస్తారా'

'చూద్దాం రెండ్రోజులు ఉందిగా! ఈలోగా ఆలోచిద్దాం'

★★★

మర్నాడు ఆఫీసుకి వెళ్ళినా, గాజుల గురించే దిగులు. కనిపించిన ప్రతీవాణ్ణీ అప్పు

కోరాడు...శాలరీ అడ్వాన్స్ పెట్టాడు. బాస్ ని డైరక్ట్ గా అప్పు అడిగాడు. ఆయనే కళనున్నాడో డబ్బు కొంచెం ఇచ్చాడు. అంతా బోనస్ తో కలిపి గాజుల్ని తాకట్టు నుంచి విడిపించాలి. ఇక మిగిలింది– తండ్రికి అసలు సంగతి ఎలా చెప్పడం? 24 క్యారెట్ల ప్రశ్న అది.

'నిజం చెప్పేద్దాం నీలిమా... ఏదైతే అదే జరుగుతుంది!'..నిస్సత్తువతో అన్నాడు వేణు. 'గజేంద్రమోక్షం' గుర్తుకొచ్చింది నీలిమకి. 'ఎన్నో సంవత్సరాలు యుద్ధం చేసి ఇక తన వల్ల కాదని వేడుకున్న ఏనుగుకి అభయం ఇవ్వలేదా ఆ శ్రీహరి? మనమింత ప్రయత్నం చేశాం...దేవుడికి దణ్ణం పెట్టి కోరుకుందాం'

''మీరు ఇంత కష్టపడ్డారు... రేపు ఎలాగైనా గాజులు తెస్తాను, ఆ మార్వాడీ షాప్ ఓనర్ భార్య నాకు స్నేహితురాలే. ఫోన్ చేసి పనివాళ్ల చేత ఓ అయిదు నిమిషాలు షాప్ ఓపెన్ చేయమని రిక్వెస్ట్ చేస్తా. ఒకవేళ తేలేకపోతే సోమవారం కొరియర్లో పంపేద్దాం. అంతేగాని నిజం 'ఇప్పుడు' చెప్పకూడదు' అంటూ భర్తకి భరోసా ఇచ్చింది నీలిమ.


★★★

ఆదివారం వచ్చేసింది. ఉదయాన్నే శేటు భార్యకి ఫోన్ చేసింది నీలిమ. ఆమెకి నీలిమ అవస్థలు తెలుసుకాబట్టి, పనివాడికి చెప్తానని... పదిగంటల కల్లా షాప్ దగ్గర ఉండమని హామీ ఇచ్చేసింది. రైలు ఎక్కించడానికి మూడుగంటల ముందే ఇంట్లో హడావుడి మొదలైంది. సిటీ బస్ ఎక్కి రైల్వేస్టేషన్ కి వెళ్ళాలంటే, దార్లో ట్రాఫిక్ జామ్ ఉంటుందేమో అని గాభరా పెట్టసాగారు నీలిమ మామగారు. ఆఖరికి కొరియర్లో పంపడమే బెటర్ అని భావించారు వేణు, నీలిమలు.

ఫర్లాంగు దూరంలో ఉన్న బస్టాండ్ కి తల్లిదండ్రులను వేణు తీసుకెళ్ళాడు. చివరి ప్రయత్నంగా – పసిపాపని ఎత్తుకుని షాప్ దగ్గరకి వెళ్లింది నీలిమ. పనివాడు వచ్చి డబ్బు తీసుకుని బంగారం గాజులిచ్చేశాడు. అవి పట్టుకుని ఆదరాబాదరాగా నీలిమ బస్టాండ్ కొచ్చింది. అప్పటికి బస్సు రాకపోవడంతో ఓ చెట్టుకింద నిలబడ్డ వేణుని, అత్తగారూ– మామగారుని చూసి అక్కడికి వెళ్ళింది. నీలిమకి పట్టిన చెమట్లు చూసి అత్తగారు 'ఎందుకమ్మా ఇలా వచ్చావ్? ఏవైనా మరిచిపోతే తర్వాత తీసుకెళ్ళేవాళ్ళం కదా' అని కొంగుతో ఆ నుదుటిపై చెమటని తుడిచింది.

'మామయ్యగారూ! ఇవి అసలు గాజులు... మొన్న మీకిచ్చినవి గిల్టు గాజులు. ఇవి బీరువాలో పెట్టి స్కూలుకి ఆ గిల్టు గాజులు పెట్టుకుని వెళ్తున్నాను. కోపంతో మీకిచ్చినప్పుడు ఆ సంగతి గుర్తురాలేదు. బీరువా సర్దుతుంటే ఇవి కనబడగానే తీసుకొచ్చాను. మీరు మీ ఊళ్ళో తాకట్టుపెట్టడానికెళ్తే పరువు పోతుందని గాభరాతో వచ్చేశాను' అని ఆయాసంతో చెప్పింది.

'చూడమ్మా! నీ గాజులు తీసుకెళ్దామని వచ్చినా, అవి కొత్త ఇంటికి అచ్చిరావని



మామయ్యగారితో చెప్తూనే ఉన్నాను. తిరిగి ఇవ్వడానికి ఆయనకి అహం అడ్డొచ్చింది. రైల్వేస్టేషన్‌లో వీడి చేతికిచ్చి పంపించేస్తానని జేబులో పెట్టుకుని ఇక్కడికొచ్చారు. నీ బంగారం నీదగ్గరే ఉంచుకోమ్మా!' అంది అత్తగారు.

'అవునమ్మా! ఊరు బయల్దేరేముందునుంచీ మీ అత్తగారు అదే పాట. నాకు డబ్బుకిబ్బంది ఎదురవుతుందని నీ గాజులు తీసుకుందామనుకున్నా. ఇవి గిల్టు గాజులో, బంగారం గాజులో నాకు తెలీదు. తీసుకున్నాక తిరిగి ఇద్దామంటే ఈగో వెనక్కి లాగింది. అందుకే సూట్ కేసులో అదే రోజు పెట్టేసినా, రైల్వేస్టేషన్లో తిరిగి ఇవ్వాలని ఇదిగో జేబులో పెట్టుకున్నా. ఇవి నీ దగ్గరే ఉండాలి. ఆలోచిస్తే మీ అత్తగారు చెప్పిందీ కరక్టే... నిన్ను ఏడిపించి నీ బంగారంతో ఇల్లుకి ఖర్చుపెట్టడం మంచిది కాదు, తీసుకో'

'ఫర్వాలేదు మావయ్యగారూ! ఇప్పుడు రోజూ ఇవి పెట్టుకోవడం లేదు కదా. మీకు ఈ రకంగానైనా పనికొస్తే అదే చాలు... పదివేలు!'..

'సరేనమ్మా ఇవ్వు' అని బంగారం గాజులు తీసుకుని కొడుకుతో 'ఒరేయ్! ఇదిగో ఈ గాజులు తీసుకుని జాగ్రత్తగా జేబులో పెట్టుకో. ఇంటికెళ్ళగానే కోడలికిచ్చేయ్' అని – ఇంతకు ముందు ఇచ్చిన గిల్టువీ, అప్పుడే ఇచ్చిన బంగారం గాజులూ కలిపి కొడుక్కి ఇచ్చేశారాయన.

ఇంతలో బస్సు రావడంతో వేణు తన తల్లిదండ్రులను ఎక్కించి, నీలిమకి థ్యాంక్స్ చెప్పి తానూ బస్సెక్కాడు. బస్సు కనుమరుగైనంత వరకూ టా టా చెప్తూ, ఇంటికి నడుస్తూ ఆమె ఆలోచిస్తోంది.

'డబ్బులేకపోయినా ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్న డాక్టర్, అడగ్గానే డబ్బు ఇచ్చిన బాస్, ఫోన్ చేయగానే సెలవు రోజున షాప్ ఓపెన్ చేయించిన శేటు భార్య, ఆదివారం అయినా దుకాణానికొచ్చి గాజులు ఇచ్చిన పనివాడు... వీళ్ళ మనసులన్నీ బంగారమే కదా! వయసువల్ల కొడుకుమీద అధికారం చలాయించాలనుకున్నా ... తర్వాత పరిస్థితి తెలుసుకున్న అత్తగారూ, మామగారి మనసూ బంగారమే కదా. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని తండ్రిమాటకి ఎదురు చెప్పలేని తన భర్తా బంగారమే. తనతోపాటు ఎండలో తిరిగి వాడిపోయిన చంటిబిడ్డ కూడా బంగారమే! ఇంతమంది బంగారం లాంటి వాళ్ళు తనచుట్టూ ఉన్నా, ఆరోజు గాజులకోసం ఎందుకు గొడవపడ్డానా...అని ఆలోచిస్తూ ఇంటికెళ్తోంది నీలిమ.

★ ★ ★

# ఇంకుడుగుంత

**ప్రకాశిక నిర్వహించిన 2020 దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ.**



**రావుల కిరణ్మయి**
**8247566615**

**నా జన్మభూమి ఎంత అందమైన దేశము...**
**నా ఇల్లు అందులోన చల్లనీ ప్రదేశము...**
**నా సామీరంగా..హై..హై..నా సామీరంగా**

ఒకప్పటి చిత్రంలో నాగేశ్వరావుగారిలో ఎంత ఆనందమో, నాలో అంతకు రెట్టింపు ఆనందం. ఒక్కటే తేడా– ఆయన చిత్రంలో పాట కోసం నటించి ఉండవచ్చు. కానీ నేను అనుభవిస్తున్నాను.

పది సంవత్సరాల క్రితం వైట్ కాలర్ జాబ్ రెక్క పట్టుకొని పరాయి దేశంలో అతిథినై ఎగిరి వెళ్ళాను నేను. ఇంతకాలం తర్వాత– పుట్టిన ఊరిపై మమకారంతో ముఖ్యంగా తాతయ్య అనురాగంతో మనసు వాయువేగంతో ఉంటే, బస్సు మాత్రం తాబేలు నడక మల్లే ఉంది. ఐనా హాయిగా కారులో రాగలిగే స్థోమత ఉండి కూడా ఈ నెలరోజులైనా మునుపటిలా తిరగాలనే కోరిక! కిటికీ పక్కసీటులో కూర్చుని బయటకు చూస్తున్నాను. నగరం పొలిమేరలు దాటి పల్లె వైపు పరుగు తీస్తున్నది.అంతే!!

కాలం అదుపు తప్పినట్టుగా– పదును ఎరుగని నేల నెర్రెలతో కనిపిస్తోంది. వర్షం మొండికేయగా మొలకలు ఎండిపోయి చెలక చిన్నబోయింది. తడారిన పొలాలన్నీ ఎడారిలా కనిపిస్తున్నాయి. ఆ దృశ్యాలన్నీ హృదయవిదారకంగా ఉన్నాయి. ఒకప్పుడు ఊళ్ళు ప్రకృతి ఒడిలో ఆడుకుంటున్న పసిపాపల్లా, కేరింతలు కొడుతూ ఆనందంతో హాయిగా ఉండేవి. ఎటు చూసినా పచ్చని పండ్ల తోటలు, కూరగాయ చేనులు, వరి పొలాలతో జీవకళ ఉట్టిపడేది. నేడు బక్కచిక్కి పొదుగు ఎండిన గోమాతలా, అస్థిపంజరంలా కనిపిస్తున్నాయి. అటువంటి ఆ దృశ్యాలు నన్ను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మా ఊరు, తాతయ్య పొలం ఇలాగే వట్టిపోయి బీడువడ్డాయా? ఆ మోడు బతుకుల్ని చూసి నేను తట్టుకోగలనా? ఆలోచన రాగానే– ఆనందం ఆవిరై, ఆవేదన మేఘమై, కన్నీళ్ళలా కురిసేందుకు సిద్ధమవుతోంది. ఆ జ్ఞాపకాల గతం కళ్ళ ముందుకు వచ్చింది.

తాతయ్య ప్రకృతి ప్రేమికుడు. జపనీస్ వ్యవసాయ ప్రేమికుడి స్ఫూర్తితో తనకున్న ఇరవై ఎకరాలలో ఫుడ్ ఫారెస్ట్ నిర్మించాడు. మట్టి గోడలు గడ్డి కప్పు ఆవాసాలతో తన దగ్గర పని చేసే కూలీలందరికీ నివాస స్థలాలు ఇచ్చాడు. చక్కగా పది, పదిహేను కుటుంబాలు తాతయ్యను, ప్రకృతిని, వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తుండేవి. పనస, బొప్పాయి, అరటి, సపోటా వంటి పండ్లతోటల సాగు చేస్తుండేవి. అలా తాతయ్య అప్పటినుండే జీవితానికి మట్టిపరిమళంతో పాటు మంచితనాన్ని అద్దుకొని గుబాళిస్తున్నాడు.

తాతయ్యది పెద్ద బంగళా. ముందు తోట. తోటలో పని చేస్తున్నంతసేపూ మొక్కలతో, పువ్వులతో మమేకమై కనిపిస్తాడు. పనిలోనే పరమాత్మని దర్శిస్తాడు. ఇప్పటికీ పలుగు తీసుకొని పాదులు చేస్తుంటాడు. తాతయ్య ఇప్పుడు రారాజు కానీ– తన తాతలనాడు దొడ్డు బియ్యం ఉడకేసుకొని ఏ ఉల్లిపాయో, మిరపకాయో ఉప్పుతో నంజుకొని పంచభక్ష్య పరమాన్నం తిన్నంత తృప్తిగా నిద్రపోయేవాడట. అదే ఆయన ఆరోగ్య రహస్యం. చేసే పనిని ప్రేమిస్తే వచ్చే ఫలితం ఎట్లాంటిదో రుజువు తాతయ్యే. ఆ ఇంట్లో ఏసీ అవసరం ఉండదు. పచ్చని ప్రకృతి గాలి ఊయల ఊపుతూ జోల పాడుతుంది. వైభోగమంతా ఇప్పటికీ అలానే ఉండి ఉంటుందా...ఏమో? నేను చూస్తున్న దృశ్యాలు నా ఊరినీ కబళించి మృగ్యం చేశాయా... అనుకుంటే చాలా బాధగా ఉంది.

ఇది చూడటానికా నా ఊరికి వెళ్తున్నాను. హే భగవాన్! నేను రాకున్నా నా చిన్నప్పటి మధుర చిత్రాలు మలిగిపోకుండా ఉండేవేమో? ఇప్పుడున్న స్థితిలో నా ఊరిని చూసి తట్టుకునే మనోధైర్యాన్ని నాకివ్వు ప్రభూ...అనుకోగానే కన్నీళ్ళు రాలాయి. అలా అలా ఆలోచనలతోనే ఊరు చేరాను.

ఇంటికి నడిచి వెళ్తుంటే చాలావరకు సగం కూలిన ఇళ్ళే! వదిలివేసి ఉన్నవే. పళ్ళూడిన బోసినోటిలా ఉన్నాయి. ఇల్లు చేరిన నాకు తాతయ్య, నానమ్మ ఆత్మీయస్పర్శ ఊరటనిచ్చింది. మరుసటి రోజు పొలం వద్దకు వెళ్ళాం. ఆశ్చర్యకర విషయం



ఏమిటంటే– ఇంత కరవు రాక్షసి తాండవిస్తున్నా, మా పొలం గట్లు పచ్చగా కళకళ లాడటం సంతోషాన్నిచ్చింది. అది ఎలా సాధ్యమయ్యిందో తాతయ్యనే అడిగాను.

చుట్టూ ఉన్న నేలను పదేపదే వదులుచేయడం కారణమని చెప్పాడు. ఇంకా నాటిన తొలి రెండు వారాలూ అతి తక్కువ నీటితోనే వాటిని (మొక్కలను) కాపాడుకోగలిగానని అన్నాడు. తొలకరి తర్వాత అడుగు లోతు దుక్కి దున్ని, కొన్ని రోజుల అనంతరం మరోసారి లోతుగా మట్టి వదులవగా... అడుగులోతు నాలుగు అంగుళాల వెడల్పుతో గుంతలు తవ్వి నీళ్ళు పోసి మొక్కలు నాటానన్నాడు. ఆ చెమ్మ రెండు వారాలు మొక్క బతికేందుకు ఉపయోగపడి, వేళ్ళు లోపలికంటా వెళ్ళడం కారణంగా మొక్క తనంత తానే అతి తక్కువ నీటితో బతికేస్తుందని వివరంగా చెప్పాడు.

తనకి వ్యవసాయం మీద ఉన్న మక్కువ స్పష్టంగా అర్థమైంది. అదే ఆయనను, ఆ మొక్కలను బతికిస్తున్నదని బాగా తెలిసివచ్చింది. మరింత ఉత్సాహంగా చెప్పాడు– తన ఇరవై ఎకరాల తోటను కూడా వాటర్ మేనేజ్మెంట్ ఫోరం నిపుణుల సూచనల మేరకు చేశాడట. వాలుకు అడ్డంగా ప్రతీ 50 మీటర్లకు ఒక వరుసలో కందకాలు తవ్వించానని, అదృష్టం కొద్దీ– తవ్విన కొద్దిరోజుల్లోనే 3 రోజులపాటు మంచి వర్షాలు కురిసాయని అన్నాడు. పొలాల్లో కురిసిన ప్రతీ చినుకూ కందకాల ద్వారా అంతకు ముందెన్నడూ లేని విధంగా భూమిలోకి ఇంకిందని, భూగర్భ జలమట్టం పెరిగిందని చెప్పాడు. అంతకు ముందు ఆఫ్ ఇంచు పోసే బోర్లు ఇప్పుడు 4 ఇంచులు ఫుల్లుగా పోస్తుండడం తాతయ్య విజయ పరంపరను చెప్పకనే చెప్తున్నాయి.

తనతో పాటు ఊరివాళ్ళు కూడా ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటి ఆవరణలో కూడా సంవత్సరమంతా నీరు పుష్కలంగా అందాలంటే, ఇంకుడు గుంతలే ఏకైక మార్గమని ఆలోచించాడు. 250–500 గజాల స్థలంలో ఉన్న ఇంటి ఆవరణలో 4 అడుగుల వెడల్పు 6 అడుగుల పొడవు 8 అడుగుల లోతు ఉండేటట్లు గుంట తీశాడు. గుంట లోపల నాలుగు వైపులా అడుగు భాగంలో ఎక్కడా సిమెంట్ ప్లాస్టరింగ్ చేయకుండా... ఇంకుడు గుంత ద్వారా తన ఇంటిని, పంటని కాపాడుకుంటున్న తాతయ్య ఆ క్షణం అపర భగీరథుడులా కనిపించాడు. తనకున్న అనుభవం, అంతకు మించిన ఆరాటం, ఎలాగైనా గెలవాలనే పోరాటం నాకంటే తానే యువకుడిలా కనిపించేలా చేస్తోంది.

ఒక్కొక్క తేనెటీగ ఒక్కో తేనెబొట్టును ఒడిసిపడుతూ సేకరించి, తేనెపట్టున దాచి బాటసారులకు పంచినట్టు... తాతయ్య ఒక్కొక్క నీటిబొట్టునూ ఒడిసిపడుతూ ముందు తరాలకు దాచిపెడుతున్నవైనం నన్ను పరమానందభరితుణ్ణి చేసింది. ఎన్నో అనుభవాలు ఇముడ్చుకున్నాడు. నిరాశ దరిజేరనీయక ఆత్మానందం, మూర్తీభవించిన ఆత్మవిశ్వాసంతో ఆయనే ఒకపెద్ద ఇంకుడుగుంతలా కనిపించాడు!

★ ★ ★

# ఆదర్శం

**ప్రకాశిక నిర్వహించిన 2020 దీపావళి కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ.**



**అనుసూరి వేంకటేశ్వరరావు**
**7207289424**

గంట నుంచీ కిందామీదా పడి ఇంటిపనంతా పూర్తిచేసుకుంది మౌనిక. ఇంత తిని, కొంత బాక్స్ లో పెట్టుకుని, అత్తగారికి బై చెప్పేసి ఇంట్లోంచి బయటపడింది.

ఉదయం ఆరు గంటలు కావస్తోంది. భానుడి నిద్రమత్తు వదల్లేదేమో – కళ్ళు నులుముకుని ఎర్రని కళ్ళతో లోకాన్ని చూస్తున్నాడు. చెట్టు, చేమ, గుట్ట – ఎర్ర నీరు కళ్ళాపి జల్లినట్టున్నాయి.

అత్తగారు, భర్తతో కలిసి హనుమకొండలో ఉంటోంది మౌనిక. భర్త చిన్న వ్యాపారం చేస్తుంటే, ఆమె జనగామలో టీచర్ గా ఉంటోంది.


ఇంటినుంచి అర కిలోమీటర్ నడిస్తే కానీ ఆటోలు దొరకవు. పరుగులాంటి నడకతో రోడ్డుమీదకొచ్చింది మౌనిక. తుషార బిందువులు వాలిన చిగురాకుల్లా అయ్యాయి ఆమె చేతులు.

ఐదు నిమిషాల తర్వాత ఒక ఆటో వచ్చింది. అందులో వెనక సీట్లో ఇద్దరు మహిళలు కూర్చుని ఉన్నారు. షేర్డ్ ఆటోలో అది మామూలే. ఆటోలో కూర్చుని "కొత్త బస్టాండ్" అంది.

ఇరవై నిమిషాల్లో ఆటో బస్టాండ్ కి చేరింది. దేశంలో నిరుద్యోగానికి అద్దంలా ఉంది ఆ బస్టాండ్. అక్కడక్కడా చెదురుమదురుగా కాకా హోటళ్ళు, చాయ్ బిస్కట్ దుకాణాలు. బస్టాండ్ – ప్లాట్ ఫామ్ మీద గిరాకీ కోసం ఎదురు చూసే కూలీలతో బిజీగా ఉంది. అప్పుడే కదలబోతోంది జనగామ బస్సు. మౌనిక పరుగున వెళ్ళి ఎక్కింది.

లోపల కిక్కిరిసిన జనం లేరు కానీ, బస్సు సీట్లు ఖాళీ లేవు. బస్సు ముందు భాగంలో పైనున్న ఇనుప రాడ్ ఆధారంగా పట్టుకుని నిలబడిందామె. ఆ రాడ్ కి వేలాడుతున్న సగం తెగిన తోలు బెల్టులు ఆర్టీసీ ఆర్థిక స్థితిని అద్దంలో చూపుతున్నాయి.

"టికెట్ !" మహిళాభ్యుదయానికి చిహ్నంలా, లేచిన మహిళా లోకానికి



ప్రతినిధిలా మహిళాకండక్టర్ వచ్చిఅడిగింది.

“పాస్ “అని పాస్ తీసి ఆమెకిచ్చింది. సరిచూసుకుని పంచ్ చేసి తిరిగిచ్చేసి “టికెట్... టికెట్” అనుకుంటూ వెనక్కి వెళ్ళింది ఆ కండక్టర్.

ఒక్కసారి ఆమె వెళ్లిన వైపు చూసింది మౌనిక. వెనక లేడీస్ సీట్ల ఆఖరి వరసలో ఒక మగ మహారాజు కూర్చుని కనిపించాడు. వస్త్రధారణను బట్టి చూస్తే చదువుకున్న మధ్యతరగతి వ్యక్తిలాగా ఉన్నాడు.

‘హు... చదువుకున్నంత మాత్రాన సంస్కారం ఉండాలని ఏముంది? దర్జాగా ఆడవాళ్ళ సీట్లో కూర్చోడానికి సిగ్గు లేదు’ అనుకుంది మనసులో. అక్కడితో ఆగలేదు. హక్కుల కోసం పోరాడే వీరనారిలా అతని దగ్గరికి వెళ్ళింది.

“ఇది లేడీస్ సీట్! కాస్త లేస్తారా!” కొంచెం ఘాటుగానే అడిగింది.

“అయ్యో మేడం! నేను కూర్చున్న సీటు ఆయనకు ఇచ్చాను. పాపం ఒక కాలు లేదు, కూర్చొనివ్వండి” పక్కన నిలబడిన ఆవిడ అంది.

వెనక కూర్చున్న మగవాళ్ళలో ఒక వ్యక్తి –

“అతన్ని లేపకండి మేడం! మీరు ఇక్కడ కూర్చోండి” అని తాను కూర్చున్న సీట్లోంచి లేచాడు.

క్షణకాలం సిగ్గుతో బిక్కచచ్చిపోయింది మౌనిక.

‘ఛ! బుద్ధి లేక వెనక్కి చూశాను. తొందరపడి ఆ వ్యక్తి గురించి చెడుగా అనుకున్నాను. ఒక్క చదువుకోవటమే కాదు – పిల్లలకు చదువు, బుద్ధి నేర్పే తనలో మరి ఎంత సంస్కారముంది? గురివింద చందాన ఆలోచించాను’ అని బాధపడింది.

సీటు ఇవ్వబోయిన వ్యక్తిని వారించి కూర్చోమంది.

ఇంతలో బస్సు – స్టాండు మలుపులో గుంటల్లో పడి విసిరిన విసురుకి... సుడిగాలిలో చిక్కిన కాగితంలా అటూ ఇటూ ఊగింది మౌనిక. అదృష్టం బాగుండి తమాయించుకుంది. రఘునాథపల్లి బస్టాండులో ఆగింది బస్సు.

ఖాళీ అయిన సీట్లో మౌనిక కూర్చుంది. ఒక ముగ్గుబుట్ట జుట్టావిడ కూరగాయల బుట్టతో బస్సు ఎక్కింది. వయసు సుమారుగా డెబ్బై ఏళ్ళు ఉండొచ్చు, ఆమె ముఖంమీద చర్మం నీరందని బీడు భూమిలా పగుళ్లువారి ఉంది. కళ్ళు నూనె నిండుకున్న దీపావళి ప్రమిదలో చివరలు కాలిన వొత్తుల్లా ఉన్నాయి.

బడిపిల్లలు కొందరు బిలబిలా బస్సు ఎక్కారు–బార్డర్ లో సైనికుల్లా వీపున బండెడు బరువులతో!

ముసలి దగ్గులా 'కర్రు'న గేరు మార్చిన శబ్దంతో కదిలిందా ముసలి బస్సు.

"వేడి వేడి సమోసా" అంటూ చల్లని సమోసాను వేడిగా అమ్ముతున్న బాలకార్మికుడొకడు కదిలిన బస్సులోంచి దూకేశాడు.

బస్సు జనగామ చేరేవరకూ పక్కన కూర్చున్న ముసలావిడతో మాట్లాడింది మౌనిక. భర్త చనిపోయినా ఒక్కగానొక్క కొడుకును రెక్కలు ముక్కలు చేసి చదివించానని, ప్రభుత్వ ఉద్యోగం వేయించి పెళ్ళిచేశానని ఆవిడ చెప్పింది. ఉన్న అరెకరంలో కూరగాయలు పండించి జనగామలో అమ్ముకుని వస్తానంది.

'ఈ వయసులో కూడా పని చెయ్యాలా అవ్వా' అంటే –

'ఖాళీగా ఉండలేనమ్మా! ఒకరికి బరువుగా బతకటం ఇష్టం ఉండదు, కడుపుకింత తిన్నప్పుడు కాల్చేతులకింత పని జెప్పాలె' అంది.

ఒంట్లో శక్తి ఉండీ పనీ పాటా లేకుండా... ఖాళీగా ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలు మేస్తూ, సోమరులుగా నిద్ర పోతున్నవాళ్ళు ఎందరో? వాళ్ళకి ఈ ముసలవ్వ ఒక ఇన్స్పిరేషన్ ఎందుకు కాదో అర్థం కాలేదు మౌనికకు.

స్కూలుకి వెళ్ళాక బస్సులో జరిగింది అంతా తన సహ ఉద్యోగి–స్నేహితురాలితో పంచుకుంది. బాధ పంచుకుంటే గుండెబరువు తగ్గుతుంది కదా అని. కాలు లేని వ్యక్తి పట్ల తన దయలేని ప్రవర్తన గురించి చెప్పి బాధపడింది.

'అతను దివ్యాంగుడని నీకు ముందుగా తెలియదు. కాబట్టి ఆ తర్వాత జరిగిందానికి నీ తప్పేం లేదు. అనవసరంగా మనసులో పెట్టుకుని బాధపడకు!' అని ఒప్పించేలా చెప్పింది ఆ మిత్రురాలు.

గింజ తీసిన దూదిపింజలా తేలికపడిన గుండెతో మౌనిక క్లాస్ కి వెళ్ళింది.

ఆ రోజు అనుభవాన్ని పిల్లలకు చెప్పింది.

"దేశాన్ని ముందుకు నడపాల్సిన యువకులు ఎన్నటికీ సోమరులుగా మారకూడదు" అంటూ ముసలవ్వ మాటలను ఉదాహరించింది మౌనిక!

★ ★ ★

# గట్టి మేల్ తలపెట్టవోయ్

కీ.శే. గురజాడ వేంకట అప్పారావు

మమత

సమత

మానవత

దార్శనికత

నూతన ఆవిష్కరణలు



దేశభక్తి

ఆధునిక ఆలోచనలు

విశాల దృక్పథం

ప్రాపంచిక దృక్పథం

అభ్యుదయ భావాలు

సంప్రదాయ నిరతి

సమాజ శ్రేయస్సు

editor@prakasika.org

మమత-సమత-మానవత
www.gurajada.org

# ప్రకాశిక

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

సంపుటి 1 | సంచిక 2 జనవరి-మార్చి, 2021

